అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 31-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 92 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

ఆగని రెజ్లర్ల పోరాటం

పతకాలను గంగా నదిలో కలిపేందుకు యత్నం

- వారి పతకాలను తీసుకుని ఐదు రోజుల సమయం కోరిన రైతు నేత నరేశ్ టికాయత్
- ఇండియా గేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు మల్లయోధుల వెల్లడి



వివరాలు 2లో..

కేంద్ర ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం



దీనికి వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటేస్తాం

- క్రేజీవాల్ పోరాటానికి మా మద్దతు
- రాజ్యాంగ రక్షణకు ముందుకు రావాలని కాంగ్రెస్‌కు విజ్ఞప్తి
- సంయుక్త మీడియా సమావేశంలో సీతారాం ఏచూరి
- ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం : కేజ్రీవాల్
- సీపీఐ(ఎం) నేతలను కలిసిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బృందం

న్యూఢిల్లీ : ఢిల్లీలో పరిపాలనా సేవల నియంత్రణపై మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, ఎంఎ బేబి, బృందాకరత్, ఎ. విజయ రాఘవన్‌లతో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతీషి మర్లెనా, ఎంపీలు సంజయ్ సింగ్, ...5లో



లోక్‌సభ పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



సీట్లను కోల్పోవడం బాధాకరం

- రాజకీయాలకతీతంగా గళమెత్తాలి : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జనాభా ప్రాతిపదికన జరగనున్న లోక్‌సభ స్థానాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు, జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలంటూ దశాబ్దాల నుంచి కేంద్రం చెబుతున్న మాటలను, విధానాలను నమ్మి ప్రగతిశీల విధానాలతో జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు ఈరోజు తీవ్ర అన్యాయానికి లోనయ్యే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. ప్రగతిశీల విధానాలతో ముందుకు పోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ నూతన డిలిమిటేషన్‌తో తక్కువ లోక్ సభ స్థానాలు పొందడం అన్యాయం, బాధాకరమని వాపోయారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకోకుండా జనాభాను నియంత్రించని చేయని రాష్ట్రాలు, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. జనాభాను నియంత్రించిన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు తమ ప్రగతిశీల విధానాల వల్ల శిక్షించబడుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేవలం జనాభా నియంత్రణ మాత్రమే కాకుండా అన్ని రకాల మానవాభివద్ధి సూచీల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని, 18 శాతం జనాభా ...5లో



దిక్కుతోచని రైతన్న





కొనుగోళ్లలో ఆలస్యం.. తడిసిన ధాన్యం

- రెండ్రోజులుగా భారీ వర్షం

రైతు బతుకు ఆగమవుతోంది.. యాసంగి వరి పంట కోతలు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా.. కొనుగోళ్లు ఇంకా పూర్తవ్వలేదు. ఇప్పటి వరకు 50లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. అయితే చాలా ధాన్యం కేంద్రాల్లోనే ఉండటం గమనార్హం. కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభించడం.. లారీల కొరతతో తూకం వేసిన ధాన్యం కూడా కేంద్రాల్లోనే వారాల తరబడి ఉండటంతో అకాల వర్షాలకు రైతు ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. తాజాగా సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన భారీ వర్షానికి మరోసారి కోలుకోలేని దెబ్బ తగిలింది. ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.

నవతెలంగాణ– మొఫసిల్ యంత్రాంగం

ఇప్పటికే దాదాపు పూర్తికావాల్సిన కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరగడం.. మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు లేవనే సాకుతో అధికారులు అలసత్వం వహించడమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తూకం వేసి వారం రోజులు గడుస్తున్నా మిల్లులకు తరలించకపోవడంతో క్వింటాళ్ల కొద్దీ ధాన్యం వర్షార్పణమైంది. తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పలుచోట్ల ఆందోళన చేశారు.

> **పేచీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని అన్నదాతల డిమాండ్**

ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మంచిర్యాలలో యాసంగిలో లక్షకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికొచ్చిన తర్వాత వడ్లను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన అన్నదాతలకు ఊహించని పరిణామం ఎదురైంది. వారం, పది రోజుల పాటు రైతులు తూకం వేసిన ధాన్యం వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. రెండ్రోజులపాటు కుండపోత వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకోలేకపోయారు. టార్పాలిన్లు పూర్తిగా కప్పే సమయం లేకపోవడంతో చాలా వరకు ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దండేపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అధికారులు హామీనివ్వడంతో నిరసన విరమించారు.

నల్లగొండ జిల్లా భూదాన్ పోచంపల్లిలో నేతన్న విగ్రహం రోడ్డుపై రైతులు ధర్నా చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్ల రాశులు పోసుకొని నిరీక్షిస్తున్నామని, వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు ధాన్యం తడిసి ముద్దైపోతుందని బిక్కు బిక్కుమంటూ ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు వెంట వెంటనే లారీలను పంపించకపోవడంతో కాంటా వేసిన ధాన్యం అక్కడే నిల్వ ఉంటోందని, దాంతో మిగతా ధాన్యం తూకం బంద్ చేస్తున్నారని తెలిపారు. మరోవైపు మిల్లర్లు తరుగు పేరిట మోసం చేస్తున్నారని, ధాన్యం సరిగా లేదంటూ కొనుగోలును పొడిగిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పోలీసులు రైతులకు సర్ది ...2లో

నకిలీ కరెన్సీ హల్‌చల్


- 14శాతం పెరిగిన రూ.500 దొంగ నోట్లు
- ఇప్పటికీ నగదే కింగ్ : ఆర్‌బీఐ వార్షిక నివేదిక వెల్లడి



వివరాలు 5లో

37 మంది అభ్యర్థులపై వేటు

- పోటీ పరీక్షలు రాయకుండా శాశ్వత డీబార్
- టీఎస్‌పీఎస్సీ కీలక నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. లీకేజీతో సంబంధమున్న 37 మంది అభ్యర్థులపై వేటు వేసింది. పోటీ పరీక్షలు రాయకుండా శాశ్వతంగా డీబార్ చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల ...2లో

హింసకు కేంద్రమే కారణం

- అమిత్ షాతో మణిపూర్ విద్యార్థి సంఘాలు



న్యూఢిల్లీ : మణిపూర్‌లో గత కొంతకాలంగా కొనసాగుతున్న హింసాకాండకు కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలే కారణమని మణిపూర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఢిల్లీ (ఎంఎస్ఏడీ) విమర్శించింది. రాష్ట్రంలోని కుకీలు, ...5లో

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

- సీఐటీయూ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణలు

వివరాలు 2లో..



ఆకలి చావుల నుంచి అభివృద్ధి వైపు...

వానాకాలం మొదలైందంటే రైతుల కండ్లు ఆకాశం వైపు, చేతులు వడ్డీ వ్యాపారస్తుల వైపు చాచేవారు. ఆకలిచావులు, అంబలి కేంద్రాలు, వలసలు, రైతు ఆత్మహత్యలు తెలంగాణాలో నిత్యకృత్యంగా ఉండేవి. పాలమూరు కూలీలంటేనే ప్రపంచ వ్యాప్తంగా పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నేడు అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితమే నేటి అభివృద్ధి. పది సంవత్సరాలలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలబెట్టేలా జరిగిన అభివృద్ధిని నెమరువేసుకుంటూ తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సాధించిన విజయాలపై నిరంజన్‌రెడ్డి నవతెలంగాణా మహబూబ్‌నగర్ ఉమ్మడి ప్రాంతీయ ప్రతినిధి ఏ. పరిపూర్ణంకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వ్యవసాయం, అనుభంధ రంగాల అభివృద్ధిపై ఆయన మాటల్లోనే..

వ్యవసాయం నాడు తిరోగమనం - నేడు పురోగమనం

- గతంలో ఆకాశం వైపు చూసే రైతులు.. ఇప్పుడు కాలువల నీళ్లతో పంటల సాగు
- 14 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితం 10 సంవత్సరాల అభివృద్ధిలో ఓ మైలురాయి
- నవతెలంగాణతో వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ములాఖాత్







రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయంలో అభివృద్ధి ఏ మేరకు సాధించారు?

రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణా ఉద్యమ సమయంలో అప్పటి పాలకులు తెలంగాణాను కించపరిచే విధంగా మాట్లాడారు. నీళ్లు రావన్నారు, విద్యుత్ లేక రాష్ట్రం అంధకారమవుతుందన్నారు. విద్య, ఉపాధికి నిధులు ఎక్కడ నుండి తెస్తారని ప్రశ్నించారు. వారి మాటలను తలకిందులు చేస్తూ ఉచిత విద్యుత్తు 24 గంటలు ఇస్తున్నాము. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఏడాదికి 2 పంటలకు సాగునీరునందిస్తున్నాం. ఇప్పుడు ఏ రాష్ట్రం వెళ్లినా తెలంగాణ పథకాలపైనే చర్చ జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్ళు, నిధులు, నియామకాల మీద దృష్టి సారించాం. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పురుడుపోసుకున్న తెలంగాణ ...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

డబుల్ ఇంజన్ పేరుతో పేదలపై బుల్డోజర్

మోడీ, యోగి ప్రభుత్వాలపై మండిపడ్డ బి.వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగం, అభివృద్ధి గురించి చెప్పిన గొప్పలు గ్రామీణ ప్రాంతాల్లో భూతద్దం పెట్టి వెతికినా కనిపించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. యూపీలో గ్రామీణ ప్రాంత ప్రజల స్థితిగతుల పరిశీలనకు వెంకట్ నాయకత్వాన మూడు రోజులుగా అనేక జిల్లాల్లో వ్యకాస బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా మురదాబాద్, బరేలీ జిల్లాలలో పర్యటించిన అనంతరం ఈ బృందం గమనించిన అంశాలను వెంకట్ మీడియాకు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరువై, బతుకు బరువై, పెరుగుతున్న నిత్యావసర ధరలతో జీవనం సాగించలేక దేశంలోని అనేక ప్రాంతాలకు యూపీ ప్రజలు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తినటానికి తిండి లేక, పస్తులుంటున్న కుటుంబాలు అనేకం కనిపించాయని, ఈ ప్రాంతంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం పేదలకు అందుబాటులో లేదని అన్నారు. ఉపాధికి కేంద్రం రూ.1,50,000 కోట్లు నిధులు కుదించినందున గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులన్నీ అటకెక్కాయని ఫలితంగా మోడీ, యోగి ప్రభుత్వాల పట్ల గ్రామీణ పేదల్లో తీవ్రమైన ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేకతను పక్కదారి పట్టించి, ప్రజలు ఐక్యం కాకుండా మతోన్మాద చర్యలను మోడీ, యోగి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ప్రయోగిస్తున్నదని విమర్శించారు. పేదలపై తమ ప్రతాపం చూపెడుతున్న యోగి ప్రభుత్వం యూపీలో సంపదనంతా లూటీ చేసేందుకు కార్పొరేట్లకు లైసెన్స్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అప్రజాస్వామిక చర్యలను ప్రతిఘటించిన ప్రజలను, ఉద్యమకారులను లాఠీలు తూటాలతో అణిచివేతకు పాల్పడుతున్నారని, పేదలను పిట్టలను కాల్చినట్లు అమానుషంగా కాల్చి చంపుతున్నారని విమర్శించారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విచ్ఛిన్న చర్యలకు ఒడిగడుతున్నారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 4 కోట్ల మంది దళితులు, 5 కోట్ల మంది ముస్లింలు ఉన్నారని, దేశంలోనే అనేక రాష్ట్రాల జనాభాకు రెట్టింపు సంఖ్యలో దళితులు మైనారిటీలు యూపీలో ఉన్నారని తెలిపారు. 80 శాతం దళితులు నేటికీ వ్యవసాయ కార్మికులుగానే ఉన్నారని, ఉపాధి కోసం వస్తున్న అరకోరా నిధులు కూడా వారికి దక్కటం లేదని అన్నారు. అధికారంలో ఉన్న బిజెపి, ఇతర నేతలు నకిలీ జాబు కార్డులతో ఉపాధి నిధులను దోచుకుంటున్నారన్నారు. చేసిన పనులకు కూడా వేతనాలు ఇవ్వకుండా వేధిస్తు న్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం అమలు ఉత్తరప్రదేశ్‌లో అత్యంత దారుణంగా ఉందని అన్నారు. ఈ అధ్యయన బృందంలో వెంకట్‌తో పాటు వ్యకాస నాయకులు బ్రిజ్ లాల్ భారతి, రాజీవ్, తాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని రెజ్లర్ల పోరాటం

న్యూఢిల్లీ : దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. తమ పతకాలను మంగళవారం సాయంత్రం 6 గంటలకు హరిద్వార్‌లోని గంగానదిలో కలిపేందుకు ప్రయత్నించారు. రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా, సంగీతా ఫోగట్ తదితరులు తమ మెడల్స్‌తో గంగానది వద్దకు చేరుకున్నారు. అంతకుముందు రెజ్లర్లు కన్నీరు మున్నీరయ్యారు. రెజ్లర్లు తమ పతకాలను పట్టుకుని నడుస్తూ భావోద్వేగానికి గురయ్యారు. రైతు నేత రాకేష్ టికాయిత్, నరేష్ టికాయిత్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. నరేష్ టికాయిత్ జోక్యం చేసుకొని రెజ్లర్ల వద్ద మెడల్స్‌ను తీసుకొని, ఐదు రోజులు సమయం ఇవ్వాలని కోరారు.

సాక్షి మాలిక్, బజరంగ్ పునియా, వినేష్ ఫోగట్ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో రెజ్లర్లు మంగళవారం సాయంత్రం 6 గంటలకు హరిద్వార్‌లోని గంగా నదిలో తమ పతకాలను నిమజ్జనం చేస్తారని చెప్పారు. ఈ పతకాలు తమ ప్రాణమనీ, తమ ఆత్మ అని చెప్పారు. వీటిని గంగా నదిలోకి విసిరేసిన తర్వాత జీవించి ఉండటంలో అర్థం లేదన్నారు. వీటిని గంగా నదిలో కలిపిన తర్వాత తాము ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తమను 'మా బిడ్డలు' అని అంటూ ఉంటారనీ, కానీ ఆయన కూడా తమ పట్ల ఎటువంటి శ్రద్ధ చూపించడం లేదని ఆరోపించారు. తమను అణచివేస్తున్న బ్రిజ్ భూషణ్‌ను నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారన్నారు. ఆయన తళతళ మెరిసే తెల్లని దుస్తుల్లో ఫొటోలకు ఫోజులిచ్చారని మండిపడ్డారు. ఆ కాంతిలో తాము వెలిసిపోయామన్నారు.

మరోవైపు ఇండియా గేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని రెజ్లర్లు హెచ్చరించారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియా గేట్ 'జాతీయ స్మారక చిహ్నం. అది ప్రదర్శనలకు స్థలం కాదు' కాబట్టి రెజ్లర్లు నిరసనకు అనుమతించబోమని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

రెజ్లర్లకు సీనియర్ క్రికెటర్ అనిల్ కుంబ్లే మద్దతు

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న రెజ్లర్లకు సీనియర్ క్రికెటర్ అనిల్ కుంబ్లే మద్దతు తెలిపారు. '28న మన రెజ్లర్లు దాడికి గురికావడంతో ఏమి జరిగిందో విని విస్తుపోయాను. సరైన చర్చల ద్వారా దేన్నయినా పరిష్కరించుకోవచ్చు. వీలైనంత త్వరగా పరిష్కారం వస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు.

నిద్ర లేని రాత్రిని గడిపా: అభినవ్ బింద్రా

ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా మాట్లాడుతూ 'గత రాత్రి నిద్రలేదు. నా తోటి మల్లయోధుల నిరసనల భయానక చిత్రాలు వెంటాడాయి. మేము క్రీడా సంస్థల అంతటా స్వతంత్ర రక్షణ చర్యలను ఏర్పాటుచేయాల్సిన సమయం ఆసన్నమైంది' అని పేర్కొన్నారు.

రేపు దేశవ్యాప్త ఆందోళనలకు ఎస్‌కేఎం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

రెజ్లర్లకు మద్దతుగా రేపు (జూన్ 1న) దేశవ్యాప్త ఆందోళనలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చాయి. కాగా, రెజ్లర్ల పోరాటంపై అణిచివేతను తీవ్రంగా ఖండించాయి. జూన్ 1న దేశంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల వద్ద భారీ ప్రదర్శనలు, దిష్టిబొమ్మ దహనం చేయాలని పిలుపునిచ్చింది. జూన్ 5న అయోధ్యలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు మద్దతుగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, సన్యాసులు ర్యాలీ నిర్వహించనున్నారు. అదే రోజున గ్రామ, పట్టణ కేంద్రాల్లో బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించింది.

జూన్ 1 నుంచి 3 వరకు ఆందోళనలకు మహిళ సంఘాల పిలుపు

రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల తీవ్ర దాడిని ఖండించిన మహిళ సంఘాలు జూన్ 1 నుంచి 3 వరకు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు ఇచ్చాయి. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. మంగళవారం ఈ మేరకు ఐద్వాతో సహా 11 మహిళ సంఘాలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

నవతెలంగాణ - మధిర/సిద్దిపేట అర్బన్

కార్మికుల పక్షాన నిరంతరం పోరాడేది సీఐటీయూ మాత్రమేనని సంఘం జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ అన్నారు. మంగళవారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జెండావిష్కరణలు, 'మతోన్మాదం, కార్మిక వర్గంపై ప్రభావం' అంశంపై సెమినార్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని మార్కెట్ యార్డులో సీఐటీయూ మండల కన్వీనర్ పడకండి మురళి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఎం.సాయిబాబా మాట్లాడారు. దేశంలో కార్మికులు, కర్షకులు కష్టంతో సంపద సృష్టిస్తుంటుంటే.. దాన్నంతా బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కారు చౌకగా దోచిపెడుతోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండాపోవడంతో కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. అనంతరం పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు కనీస వేతనం లేకుండా, ఉద్యోగ భద్రత లేకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వారందరినీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల

జీవన ప్రమాణ స్థాయి పెరగలేదని, కార్మికులకు రెండు పూటల తిండి కూడా సరిగా లేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా కార్మికులంతా ఏకమై ఐక్యంగా ఉద్యమించాలని, వారికి సీఐటీయూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో వివిధ కార్మిక సెంటర్లలో సీఐటీయూ జెండాను సంఘం అధ్యక్షకార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం ఖమ్మంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో కార్మికులతో సభ నిర్వహించారు. వైరా, నేలకొండపల్లి, తిరుమలాయపాలెంలో జెండా ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని ఐటీసీ గేట్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ జెండావిష్కరించారు. ఇల్లందులో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అడ్డా వద్ద సంఘం మండల కన్వీనర్ కృష్ణ జెండావిష్కరించారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో చుక్క రాములు సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చడంతో అన్ని రంగాల కార్మికులు యాజమాన్యాలకు కట్టుబానిసలుగా మారారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులను కాల రాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లు కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు మార్చడం యాజమాన్యాల మెప్పు కోసం నరేంద్ర మోడీ చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. 53 ఏండ్లుగా కార్మికుల పక్షాన ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసిన సీఐటీయూ కార్మికులకు అండగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, నాయకులు శశిధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

37 మంది అభ్యర్థులపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో సంబంధమున్న ఆ 37 మంది అభ్యర్థులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ భవిష్యత్తులో నిర్వహించే పోటీ పరీక్షలకు అనుమతించకూడదని కమిషన్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై అభ్యంతరాలుంటే రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆ 37 మంది అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు సిట్ 44 మందిపై కేసు నమోదు చేయగా, వారిలో 43 మందిని అరెస్టు చేసింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నది. ఇంకోవైపు లీకేజీతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళన చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే టీఎస్‌పీఎస్సీకి పది పోస్టులను మంజూరు చేసింది. టీఎస్‌పీఎస్సీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా బిఎం సంతోష్‌ను, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఎన్ జగదీశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించిన సంగతి విదితమే.

డీబార్ అయిన అభ్యర్థులు

1. పులిదిండి ప్రవీణ్‌కుమార్ 2. అట్ల రాజశేఖర్‌రెడ్డి 3. రేణుక రాథోడ్ 4. లావుడ్యావత్ డాక్యానాయక్ 5. కె రాజేశ్వర్, 6. కె నీలేష్ నాయక్ 7. పి గోపాల్ నాయక్ 8. కె శ్రీనివాస్ 9. కె రాజేందర్ నాయక్ 10. షమీమ్ 11. ఎన్ సురేష్ 12. డి రమేష్ కుమార్ 13. ఎ ప్రశాంత్‌రెడ్డి 14. టి రాజేందర కుమార్ 15. డి తిరుపతయ్య 16. సాన ప్రశాంత్ 17. వై సాయి లౌకిక్ 18. ఎం సాయి సుష్మిత 19. కోస్గి వెంకట జనార్ధన్ 20. కోస్గి మైబయ్య 21. కోస్గి రవి 22. కోస్గి భగవంత్ కుమార్ 23. కొంతమ్ మురళీధర్ రెడ్డి 24. ఆకుల మనోజ్ కుమార్ 25. ఆది సాయిబాబు 26. పొన్నం వరుణ్ కుమార్ 27. రమావత్ మహేష్ 28. ముదావత్ శివకుమార్ 29. దానంనేని రవి 30. గున్‌రెడ్డి క్రాంతి కుమార్‌రెడ్డి 31. కొంతమ్ శశిధర్‌రెడ్డి 32. అట్ల సుచిత్రరెడ్డి 33. జిపి పురేందర్ నూతన్ రాహుల్ కుమార్ 34. లావుడయ శాంతి 35. రమావత్ దత్తు 36. అజ్మీర పృథ్వీరాజ్ 37. జాదవ్ రాజేశ్వర్.

పబ్లిక్ నోటీసు

సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా "ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ" పేరుతో రాజకీయ పార్టీని రిజిస్టర్ చేయాలని ప్రతిపాదించడం జరిగినది. పార్టీ కార్యాలయం ఇంటి నంబరు 8-6-666, శ్రీ బాలాజీ నగర్, బి.యన్.రెడ్డి నగర్, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500070 లో ఉన్నది. ఈ పార్టీ ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29A ప్రకారం రాజకీయ పార్టీగా నమోదు చేసుకోవడానికి భారత ఎన్నికల కమిషన్, న్యూఢిల్లీ వారికి దరఖాస్తును సమర్పించింది. పార్టీ ఆఫీస్ బేరర్ల చిరునామా క్రింది విధంగా ఉన్నాయి:

అధ్యక్షుడు: పి.సుబ్బరాయన్, హౌస్ నెం.8-6-666, శ్రీ బాలాజీ నగర్, వనస్థలిపురం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా., 500070.

సెక్రటరీ జనరల్: పి.ఎస్.ఎన్.మూర్తి, ఇంటి నెం. 4-12-197, భాగ్యలత కాలనీ, వనస్థలిపురం. 500070, హైదరాబాద్.

కోశాధికారి: టి.నాగభూషణం, ఇంటి నెం. 2-111, శాంతి నగర్, వనస్థలిపురం, హైదరాబాద్.

ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా అభ్యంతరం ఉంటే, వారు తమ అభ్యంతరాన్ని దాని కారణాలతో, సెక్రటరీ (రాజకీయ పార్టీ) భారత ఎన్నికల సంఘం, నిర్వాచన్ సదన్, అశోకా రోడ్, న్యూఢిల్లీ - 110001 వారి ఈ ప్రకటన ప్రచురించిన 30 రోజులలోపు పంపవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము - హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా
లేఖ నెం. ఇ1/ 2023 **కొటేషన్ నోటీసు** తేది: 29.05.2023
[illegible]
DIPR R.O.No. 2492-PP/CL/ADVT/1/2023-24, Dt.30-05-2023

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల & ఆయకట్టు అభివృద్ధి శాఖ కార్య నిర్వాహక ఇంజనీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ డివిజన్ నెం.12, చొప్పదండి
తేది: 29.05.2023
[illegible]
DIPR R.O.No. 2470-PP/CL/ADVT/1/2023-24, Dt.30-05-2023

బహిరంగ ప్రకటన

ICICI Bank బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్స్, బొమ్మనహళ్లి హోసూర్, మెయిన్ రోడ్, బెంగళూరు-560068.

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు వారు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్ట్ చెందినందున మరియు రుణాలు నాన్- పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును వారి గతంలో తెలిసిన చిరునామాలు కలిగిన వారికి నోటీసు జారీచేయబడినది, అయితే, అది వారికి చేరకుండానే వెనుదిరిగింది కావున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేస్తున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబరు) & చిరునామా	సెక్యూర్డ్ అసెట్/ స్వాధీనం చేసుకొను ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1.	మహ్మద్ అయూబ్ సివిల్ కాంట్రాక్టర్, ప్రతినిధియైన దీని ప్రొప్రైటర్ మహ్మద్ అయూబ్ & షహీన్ మహ్మద్/ 1-4-623సి, పంచ ముఖీ హనుమాన్ కాలనీ, కామారెడ్డి, నిజామాబాద్/ 503111/ 069605016742.	విద్యానగర్ కాలనీ, కామారెడ్డి టౌన్& జిల్లా, ఎంసి& ఎంపి కామారెడ్డి పరిధి, రిజిస్ట్రేషన్ సబ్- రిజిస్ట్రేషన్ ఆఫీసు, కామారెడ్డి వద్దగల 810.00చ.మీ.ల గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియాతోఆర్‌సిసి & 810.00చ.మీ.ల ఫస్ట్ ఫ్లోర్ ప్లింత్ ఏరియాతోఆర్‌సిసిలో 295.1చ.మీ.లకు సమానమైన 3200.0చ.అ.ల (355.5చ.గ.ల) పూర్తి ఏరియాలో ఉత్తరం నుండి దక్షిణం: 40.0అ.లు మరియు తూర్పు నుండి పడమర: 80.0అ.ల విస్తీర్ణపు బ్లాక్ నెం.3, వార్డునెం.5లోని ఓపెన్ ప్లాట్ నెం.53పై నిర్మించిన ఎంసి నెం.5-3-421 (అసెస్‌మెంట్ నెం.10450 06625) మరియు నెం.5-3-421/1 (అసెస్‌మెంట్ నెం.1045011764)గల ఆర్‌సిసి రూఫ్ ఇల్లు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్‌నెం.52, దక్షిణం: ప్లాట్ నెం.54, తూర్పు: 50.0అ.వె.రోడ్డు, పడమర: ప్లాట్ నెం.48.	28/04/2023 Rs. 33,93,413.00/-	21/02/ 2023
2.	మహ్మద్ అయూబ్, ప్రతినిధియైన దీని ప్రొప్రైటర్ మహ్మద్ అయూబ్/ ఎస్ కె షమీయా & షహీన్ మహ్మద్/ 1-4-623/ సి, పంచముఖీ హనుమాన్ కాలనీ, కామారెడ్డి, నిజామాబాద్/503111/ 069605018725.	విద్యానగర్ కాలనీ, కామారెడ్డి టౌన్& జిల్లా, ఎంసి& ఎంపి కామారెడ్డి పరిధి, రిజిస్ట్రేషన్ సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీసు, కామారెడ్డి వద్దగల 810.00చ.మీ.ల గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియాతోఆర్‌సిసి & 810.00చ.మీ.ల ఫస్ట్ ఫ్లోర్ ప్లింత్ ఏరియాతోఆర్‌సిసిలో 295.1చ.మీ.లకు సమానమైన 3200.0చ.అ.ల (355.5చ.గ.ల) పూర్తి ఏరియాలో ఉత్తరం నుండి దక్షిణం: 40.0అ.లు మరియు తూర్పు నుండి పడమర: 80.0అ.ల విస్తీర్ణపు బ్లాక్ నెం.3, వార్డునెం.5లోని ఓపెన్ ప్లాట్ నెం.53పై నిర్మించిన ఎంసి నెం.5-3-421 (అసెస్‌మెంట్ నెం.10450 06625) మరియు నెం.5-3-421/1 (అసెస్‌మెంట్ నెం.1045011764)గల ఆర్‌సిసి రూఫ్ ఇల్లు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్‌నెం.52, దక్షిణం: ప్లాట్ నెం.54, తూర్పు: 50.0అ.వె.రోడ్డు, పడమర: ప్లాట్ నెం.48.	28/04/2023 Rs. 30,32,813.00/-	21/02/ 2023
3.	రాజలక్ష్మి & కంపెనీ, ప్రతినిధియైన దీని పార్ట్‌నర్స్ గణేష్ కుమార్ పిండి, రవి క్రిష్ణ యాదవ్, నర్సింలు దాద, రంజిత్ కుమార్ పిండి, 6-26-344, శ్రద్ధానంద్ గంజ్, నిజామాబాద్- 503002/ 354705000708.	మున్సిపల్ కార్పొరేషన్, నిజామాబాద్ లిమిట్స్‌లోని కినాలక్ట్ నిజామాబాద్, గుర్బాబాది రోడ్ వద్ద బ్లాక్ నెం.26, వార్డు నెం.6 లోగల మున్సిపల్ నెం.6-2-97 కలిగిన ఓపెన్ ప్లేస్‌తో ప్రస్తుతమున్న టిన్ షెడ్ రూఫ్ ఇల్లు. పూర్తి ఏరియా: 118.00చ.గ.లు లేదా 98.65చ.మీ.లు. టిన్ షెడ్ రూఫ్ ప్లింత్ ఏరియా 286.87చ.అ.లు. సరిహద్దులు: ఉత్తరం: 30అ.వెడల్పురోడ్, దక్షిణం: పొరుగువారి ఖాళీ స్థలం, తూర్పు: బి.యెల్లయ్య ఇల్లు, పడమర: పి.గంగారం ఇల్లు. ప్రస్తుత మరియు భవిష్యత్ రెండింటితో భూమి శాశ్వతంగా జతచేసిన లేదా జతచేయబడు ఫిక్చర్లు, ఫిట్టింగులు మరియు అన్ని ప్లాంట్ మరియు మెషినరీతోసహా దానిపైగల అన్ని భవనాలు మరియు నిర్మాణాలు.	29/04/2023 Rs. 59,40,377.00/-	16/08/ 2022

నోటీసు సరిగా బట్వాడాఅగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/ మరియు/లేదా వారి హామీదారులు (వర్తించినట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులు కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: మే 31, 2023
ప్రదేశం: కామారెడ్డి, నిజామాబాద్

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ప్రపంచ గమనం

మరోసారి చైనాపై విరుచుకుపడనున్న బైడెన్-మీడియా



చైనా డెఫెన్స్ పరిశ్రమలో అమెరికా పెట్టుబడులను నియంత్రించటానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఒక ఎక్సిక్యూటివ్ ఆర్డర్‌ను తయారు చేస్తున్నట్టు ఒక అజ్ఞాత వనరు అందించిన సమాచారం ఆధారంగా ఆక్సియోస్ వార్తా సంస్థ రిపోర్ట్ చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇటువంటి చర్యలను చైనా "ఆర్థిక బలాత్కారం"గా పేర్కొంటోంది. ఈ ఎక్సిక్యూటివ్ ఆర్డర్ మరి కొన్ని రోజుల్లో విడుదల అవుతుందని ఆక్సియోస్ రాసింది.

ఈ ఆర్డర్ ఎప్పుడో రావలసిందని, జి-7 దేశాలన్నింటితో ఇటువంటి విధానాన్ని అవలంబించేలా చేయాలనే ఉద్దేశం ఉండటంవల్ల ఇది ఆలస్యం అయినదని అమెరికా మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ నెలలో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన జి-7 సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. చైనా "డిఫెన్స్ పరిశ్రమ"ను ఎంత విస్తృతంగా నిర్వచిస్తారనే విషయంపట్ల ఇంకా స్పష్టత రాలేదు.

చైనా మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ దాదాపు ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉంది. దీనిపై ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆంక్షలు విధించాడు. ఇది కాకుండా వివిధ టెక్నాలజీలు రక్షణ రంగాన్ని ప్రభావితం చేస్తాయనే పేరుతో "సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల"పై ఆంక్షలు విధించే అవకాశముందని బ్లూమ్ బర్గ్ గత నెలలో రిపోర్ట్ చేసింది.

ఇప్పటికే అక్టోబర్ నెలలో చైనాకు సెమీకండక్టర్ల, సెమీకండక్టర్ల తయారీలో ఉపయోగించే హార్డ్ వేర్, సాఫ్ట్‌వేర్‌ల ఎగుమతులపైన అమెరికా ఆంక్షలను విధించింది. అంతేకాకుండా చైనాను సెమీకండక్టర్ సప్లై చైన్ల నుంచి మినహాయించేందుకు "చిప్ 4 ఎలియన్స్" పేరుతో జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ దేశాలతో అమెరికా చర్చలు జరుపుతోంది. ఈ చర్యలను జాతీయ భద్రతకు సంబంధించిన విషయంగా అమెరికా సమర్థించుకుంటోంది. అయితే ఈ చర్యల "వాస్తవ లక్ష్యం చైనా తనను తాను అభివృద్ధి చేసుకునే హక్కును లేకుండా చేయటమేనని, ఇది ఆర్థిక బలాత్కారం తప్ప మరొకటి కాదు" అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్ బిన్ ప్రకటించాడు.

టర్కీ అధ్యక్షుడిగా ఎర్డోగన్ తిరిగి ఎన్నిక

కెమాల్ కిలిక్ దరోగ్లును ఓడించి తయ్యిప్ ఎర్డోగన్ మూడవసారి టర్కీ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు టర్కీ సుప్రీమ్ ఎలెక్షన్ కౌన్సిల్ సోమవారం నాడు ప్రకటించింది. ఈ ఎన్నికల్లో ఎర్డోగన్‌కు 52.14 శాతం ఓట్లురాగా, కిలిక్ దరోగ్లుకు 47.86 శాతం ఓట్లు వచ్చాయని సుప్రీమ్ ఎలెక్షన్ కౌన్సిల్ చైర్మన్ అహమ్మద్ యెనీర్ ఒక పత్రికా సమావేశంలో చెప్పాడు. ఎలెక్షన్ కౌన్సిల్ విడుదల చేసిన సమాచారం ప్రకారం ఎర్డోగన్ తన ప్రత్యర్థిని 22 లక్షల ఓట్ల ఆధిక్యంతో గెలిచాడు.

"ఈరోజు ఎవరూ ఓడిపోలేదు. మన 8.5 కోట్ల పౌరులలో ప్రతి ఒక్కరూ గెలిచారు. ఎన్నికల ప్రచారంలో పేర్కొనబడిన తగవులను, తగాదా లను పక్కనపెట్టి, మన జాతి కన్నకలల కోసం, లక్ష్యాల కోసం ఐక్యమవ్వా ల్సిన సమయం ఇది" అని రాజధాని అంకారాలోని అధ్యక్ష భవనం బయట చేసిన తన విజయానంతర ఉపన్యాసంలో ఎర్డోగన్ విజ్ఞప్తి చేశాడు.

ఆదివారం రాత్రి ఎన్నికలు ముగిసిన తరువాత కొన్ని గంటల్లోనే ఎర్డోగన్ తన ప్రత్యర్థి, కిలిక్ దరోగ్లు కంటే చాలా ముందున్నట్టు అందరికీ అర్థమైందని టర్కీ అనదోలు వార్తా సంస్థ పేర్కొంది. 98 శాతం ఓట్ల లెక్కింపు జరిగేటప్పటికే తాను గెలుపొందినట్టు, అందుకు దేశంలోని ప్రతి ఒక్కరికీ తాను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎర్డోగన్ తన ఇస్తాంబుల్ నివాసం బయట ప్రకటించాడు. ఈ ఎన్నికలకు ముందు మే14న జరిగిన మొదటి రౌండు ఎన్నికల్లో ఎర్డోగన్ ఆధిక్యంలో వున్నప్పటికీ ఆయనకు అధ్యక్షుడుగా గెలవటానికి కావలసిన 50 శాతం ఓట్లు పడలేదు. పర్యవసానంగా రెండవ రౌండు ఎన్నిక అనివార్యం అయింది. మూడవ అభ్యర్థి, సినాన్ ఒగాన్‌ను తొలగించి ఆదివారంనాడు రెండవ రౌండు ఎన్నికను నిర్వహించారు.

ఎర్డోగన్ 11 సంవత్సరాలపాటు టర్కీ ప్రధానిగా పనిచేసిన తరువాత 2014 నుంచి అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆయన పాలనలో టర్కీ యూరోపియన్ యూనియన్‌లో చేరకుండా దూరంగా జరిగింది. ఉక్రెయిన్‌తో సహా ప్రాంతీయ ఘర్షణలను పరిష్కరించే శాంతికాముకుడి పాత్రను ఎర్డోగన్ పోషిస్తున్నాడు. ఆయన నాయకత్వంలోని టర్కీకి రష్యా, చైనాలతో మంచి వాణిజ్య, దౌత్య సంబంధాలున్నాయి. ఆయన ప్రత్యర్థి కిలిక్ దరోగ్లు ఎర్డోగన్ కంటే ఉదారవాది. నాటో కూటమి దేశాలతో దెబ్బతిన్న టర్కీ సంబంధాలను మెరుగుపర్చాలని, యూరోపియన్ యూనియన్‌లో చేరేందుకు చర్చలను తిరిగి మొదలెట్టాలని ఈయన ఆశించాడు. కిలిక్ దరోగ్లు తన ఓటమిని హుందాగా అంగీకరిస్తూ తన ఓటమికి విచారిస్తున్నాననీ, "నిజమైన ప్రజాస్వామ్యం"కోసం తన పోరాటం కొనసాగుందనీ ప్రకటించాడు.

నాటో దేశాలలో ఎర్డోగన్ నాయకత్వంలోని టర్కీ ఒక్కటే రష్యాపై ఆంక్షలను విధించలేదు. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యా, టర్కీ దేశాలమధ్య సంబంధాలు మరింతగా బలోపేతమయ్యాయి. తన విదేశాంగ విధానం సమతుల్యంగా ఉందని, టర్కీని ఒక ప్రాంతీయ ఇంధన వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేయదలిచానని, ఇంధన ఉత్పత్తిదారులైన రష్యా, అజర్ బైజన్ వంటి తూర్పు దేశాలకు, వినియోగదారులైన పశ్చిమ దేశాలకు మధ్య టర్కీ సంధానకర్త పాత్రను పోషిస్తుందని ఎర్డోగన్ అన్నాడు.

డ్రైవింగ్‌పై కేరళ యువతుల ఆసక్తి

కొచ్చి : కేరళ యువతులు డ్రైవింగ్ నేర్చుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. గత సంవత్సరం కేరళలో సుమారు 11 లక్షల మంది డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్ (ఎల్ఎల్) పొందగా వారిలో 40శాతం మంది మహిళలే ఉన్నారు. ఇతర రాష్ట్రాలలో ఎల్ఎల్ పొందుతున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. ఎల్ఎల్ పొందిన మహిళల సంఖ్యలో గోవా రెండో స్థానంలో ఉంది. అక్కడ ఎల్ఎల్ తీసుకున్న వారిలో 33శాతం మంది మహిళలే. అయితే ఉత్తరప్రదేశ్‌లో వీరి సంఖ్య అత్యంత తక్కువగా 5శాతం, బీహార్‌లో 3శాతం మాత్రమే ఉంది. విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం కారణంగా కేరళలో ఎక్కువ మంది మహిళలు డ్రైవింగ్ నేర్చుకోవడంపై మక్కువ చూపుతున్నారని నిపుణులు అభిప్రాయపడ్డారు. కేరళలో విద్యావంతులైన మహిళల సంఖ్య కూడా ఎక్కువే. ప్రజా జీవితంలో కూడా వారు చాలా క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటారు. ఉద్యోగినులు ఎక్కువగా ద్విచక్ర వాహనాలు ఉపయోగిస్తున్నారు. యువతులే కాకుండా మధ్యవయస్కులైన మహిళలు కూడా డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని రవాణా శాఖ అధికారులు తెలిపారు.



అటవీ సంరక్షణ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- జూన్ 30న భూమి అధికార్ ఆందోళన దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గిరిజనులతోపాటు అడవులు, అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్న వారి హక్కులను హరించే ప్రతిపాదిత అటవీ పరిరక్షణ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని భూమి అధికార్ ఆందోళన (బిఎఎ) డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లును వీలైనంత త్వరగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ భూమి అధికార్ ఆందోళన్‌లో భాగమైన దాదాపు 50 సంఘాలు జూన్ 30న దేశవ్యాప్త నిరసనను నిర్వహించనున్నాయి. దేశంలోని ఖనిజాలు అధికంగా ఉన్న అటవీ ప్రాంతాలను కార్పొరేట్లకు ఇవ్వడమే ఈ బిల్లు లక్ష్యమని పేర్కొంది. మంగళవారం నాడిక్కడ ఏఐకెఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్ (ఏఐకెఎస్), విక్రమ్ సింగ్ (ఏఐఎడబ్ల్యుయు), ప్రేమ్ సింగ్ (కిసాన్ మహాసభ), సత్యవాన్ (రైతు కార్మిక సంఘం), రోమా మల్లిక్ తదితరులు మాట్లాడారు. "ప్రతిపాదిత బిల్లు అటవీ నిర్వచనాన్నే మార్చేసింది. అటవీ హక్కుల చట్టం, అటవీ రక్షణ చట్టం, పెసా చట్టం, జాతీయ అటవీ విధానానికి విరుద్ధమైన నిబంధనలను ఈ బిల్లు కలిగి ఉంది. రైల్వే ట్రాక్‌లు, పబ్లిక్ రోడ్‌లకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాలు, అంతర్జాతీయ సరిహద్దుల నుండి 100 కిలో మీటర్ల పరిధిలోని అడవులు, నియంత్రణ రేఖలకు అటవీ రక్షణ నిబంధనల నుండి మినహాయింపు ఉంది. అదేవిధంగా, జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక సంస్థలు, నిర్మాణాల కోసం అడవులను సేకరించవచ్చు" అని నేతలు తెలిపారు.

"అటవీ హక్కుల చట్టం ప్రకారం అడవులపై అధికారం గ్రామసభలకే ఉంటుంది. గ్రామసభల అనుమతితో మాత్రమే అటవీ భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకోవాలి. కానీ కొత్త బిల్లుతో మైనింగ్, ఇతర అవసరాల కోసం కార్పొరేట్లకు అటవీ భూములను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. దీంతో ఆదివాసీలు తదితరులను పూర్తిగా అడవులకు దూరం చేయనున్నారు" అని నాయకులు విమర్శించారు.

దిక్కుతోచని రైతన్న

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడంతో ధర్నా విరమించారు.

మల్హర్‌లో గాలివాన బీభత్సం

హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో వడగండ్ల వానతో పంటలు తీవ్రంగా నష్టపోయాయి. శాయంపేట మండల కేంద్రంలో పీఏసీఎస్ మక్కల కొనుగోలు కేంద్రంలో వెయ్యి బస్తాల వరకు తూకం వేసి రవాణా కొరతతో వదిలేశారు. లారీల కొరతతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ వేల సంఖ్యలో ధాన్యం బస్తాలు నిల్వలు పేరుకుపోయాయి. మంగళవారం ఉదయం వీచిన గాలి దుమారం.. భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు గత్యంతరం లేక ధాన్యం సంచుల చుట్టూ నీరు జాలు వారకుండా మట్టితో కట్టలు కట్టి, నీటిని ఎత్తి పారబోశారు. చెన్నారావుపేట మండల పరిధిలో అకాల వర్షాలకు రైతులు నిండా మునిగిపోయారు. మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రం మార్కెట్ యార్డులో ఐకేపీ కొనుగోలు కేంద్రంలోనూ ధాన్యం తడిసి ముద్ద అయింది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో కొయ్యూర్, రుద్రారం, కొండంపేట, ఎడ్లపల్లి, తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల గ్రామాల్లో వరి, మామిడి, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి పోసిన ధాన్యం కుప్పలు, అరబోసిన మిర్చి తడిసింది. మామిడి కాయలు రాలాయి. వరద తాకిడికి మిర్చి, వరి ధాన్యం కొట్టుకు పోయింది. పెద్ద తూండ్ల, అడ్వాలపల్లి, గాదంపల్లి గ్రామాల్లో మిర్చి, ధాన్యం తడిసి వరదలో కొట్టుకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. గణపురం మండలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్ర నిర్వాహకులు కాంటాలు పెట్టినప్పటికీ లారీలు రాకపోవడంతో వర్షానికి తడిసింది. ధాన్యం చుట్టూ నీరు నిలిచింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మంథనిలో ధర్నా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. వర్షానికి ధాన్యం రాశులు.. కాంటా వేసిన వడ్ల బస్తాలు తడిశాయి. మంథని-పెద్దపల్లి రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. సుమారు 20 రోజులు కావస్తున్నా మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు జరగడం లేదని, సక్రమంగా కాంటాలు పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన రైతులు కోరుట్ల, వేములవాడ రహదారిపై బైటాయించి ధర్నా నిర్వహించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు తుది రాతపరీక్ష ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల తుది రాత పరీక్ష ఫలితాలను తెలంగాణా పోలీసు నియామకమండలి మంగళవారం విడుదల చేసింది. మొత్తం పోస్టులకు గాను 84శాతం మంది అర్హత సాధించినట్టు తెలిపింది. కానిస్టేబుల్ సివిల్, ట్రాన్స్‌పోర్టు, ఎక్సైజ్ పోస్టులకు 98,218 మంది అర్హత సాధించినట్టు తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. కానిస్టేబుల్ ఐటీ అండ్ కమ్యునికేషన్‌కు 4,564మంది, ఎస్సై సివిల్ 43,708 మంది, ఎస్సై ఐటీ అండ్ కమ్యునికేషన్‌కు 729 మంది, డ్రైవర్, ఆపరేటర్ కానిస్టేబుల్ పోస్టులకు 1,779 మంది, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు 1,153 మంది, పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఎస్సై పోస్టులకు 463 మంది, పోలీస్ కానిస్టేబుల్ మెకానిక్‌కు 283 మంది చొప్పున అర్హత సాధించినట్టు రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. మంగళవారం రాత్రి నుంచి అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలు వెబ్‌సైట్‌లో పెడతామని రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది.

ఫైనల్ కీ, ఓఎంఆర్ షీట్లను తమ వెబ్‌సైట్‌లో ఉంచాక అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో చెక్ చేసుకోవచ్చని పేర్కొంది. జూన్ ఒకటో తేదీ ఉదయం 8గంటల నుంచి జూన్ 3వ తేదీ రాత్రి 8గంటల వరకు అభ్యర్థులు రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రీ కౌంటిగ్ లేదా రీ వెరిఫికేషన్ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000, ఇతరులకు రూ. 3000 ఫీజు నిర్ణయించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో వివరాల తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తామని బోర్డు తెలిపింది.

సమయమివ్వండి.. సమస్యలు పరిష్కరిస్తాం

ఐకేపీ వీఓఏల సమ్మె డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఎర్రబెల్లి

- మంత్రి హామీ మేరకు సమ్మె విరమిస్తున్నాం : ఐకేపీ ఉద్యోగుల సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రభుత్వానికి కొంత సమయమివ్వండి..ఐకేపీ వీఓఏల డిమాండ్లను పరిశీలిస్తున్నాం. సాధ్యమైనమేరకు పరిష్కరిస్తాం. మంత్రిగా మీకు హామీనిస్తున్నాను. సమ్మె విరమించి విధుల్లో చేరండి' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సెర్ప్ ఉద్యోగులు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, రూ.26 వేల కనీస వేతనమివ్వాలనీ, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలనీ, తదితర డిమాండ్లపై తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో వీఓఏలు 44 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ఆ యూనియన్ ప్రతినిధుల బృందంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చర్చలు జరిపారు. చర్చల్లో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్వీ. రమ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎం.నగేష్, కోశాధికారి సుమలత, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. చర్చల సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి స్పందిస్తూ వీఓఏలు రాష్ట్రంలో గ్రామ మహిళా సమాఖ్యల ద్వారా పొదుపు సేకరణ, అనేక సంక్షేమ కార్యక్రమాల్లో అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని ప్రశంసించారు. కనీస వేతనాల పెంపుదలపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందనీ, తన వంతు సహకారం, ప్రయత్నం తప్పనిసరిగా చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. సెర్ప్ నుండి గుర్తింపు కార్డులు, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాల చెల్లింపు, అర్హులైన వీఓఏలను సిసిలుగా ప్రమోషన్స్, ఎస్‌హెచ్‌జీ, వీఏ లైవ్ మీటింగ్స్ రద్దు, జాబ్ చార్ట్‌తో సంబంధం లేని ఆన్‌లైన్ పనులు రద్దు తదితర కోర్కెలను సంబంధిత సీఈఓతో మాట్లాడి పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. జూన్ 2 నుంచి ప్రతిష్టాత్మకంగా జరగనున్న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో వీఓఏలు భాగస్వామ్యం కావాలని కోరారు.

నేటి నుంచి విధుల్లోకి వీఓఏలు..

మంత్రి హామీ మేరకు వీఓఏల సమ్మెను విరమిస్తున్నట్టు తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ అనుబంధం) ప్రకటించింది. వీఓఏలు బుధవారం నుంచి విధుల్లో చేరాలని పిలుపునిచ్చింది. సమస్యల పరిష్కారం కోసం కొంత సమయం ఇవ్వండి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కొద్దికాలం వేచిచూసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొంది. మంగళవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ సిటీ కార్యాలయంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎం.నగేశ్ మాట్లాడుతూ..తామేం గొంతెమ్మ కోరికలు కోరట్లేదనీ, అన్నీ న్యాయసమ్మతమైనవేనని చెప్పారు. తమ పరిధిలో ఉన్న డిమాండ్లన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారని తెలిపారు. కనీసవేతనం, ఉద్యోగభద్రత విషయంలోనూ సాధ్యమైనంత మేరకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారన్నారు. న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. 44 రోజులుగా అనేక కష్టాలకోర్చి సమ్మెను జయప్రదం చేసిన ప్రతి ఒక్క ఐకేపీ వీఓఏకు విప్లవ జేజేలు తెలిపారు. సమ్మెకు మద్దతుగా నిలిచిన గ్రామ సమాఖ్యలకు ధన్యవాదాలు తెలిపారు. సమ్మెకాలంలో సహకరించిన సీఐటీయూ కమిటీకు, ప్రజాసంఘాలకు, సమ్మెకు విస్తృత ప్రచారాన్ని కల్పించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మిషన్ భగీరథ ఇంజనీర్లు, అధికారులను ముఖ్యమంత్రి కార్యదర్శి, మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సభర్వాల్ ఆదేశించారు. జూన్ 18న నిర్వహించే 'మంచినీళ్ల పండుగ' కోసం ఏర్పాట్లు ఘనంగా చేయాలని సూచించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్లు, అన్ని జిల్లాల ఎస్.ఈలతో దశాబ్ది ఉత్సవాలపై స్మితా సభర్వాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల కోసం హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలకు ఇన్‌ఛార్జిలను స్మితా సభర్వాల్ నియమించారు. జూన్ 18 నాడు మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలని చెప్పారు. నాడు మంచినీళ్ల కోసం పడ్డ కష్టాలను, నేడు మిషన్ భగీరథతో అవుతున్న తాగునీటి సరఫరాను గ్రామస్థులకు వివరించాలని కోరారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులను వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(డబ్ల్యూటీపీ)కు తీసుకుపోయి నీటిశుద్ధి ప్రక్రియను చూపించాలని చెప్పారు. నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎన్ని గ్రామాలకు సరఫరా అవుతున్నాయన్న అంశాలను వారికి వివరించాలని ఆదేశించారు. ఈ సంబరాల్లో గ్రామస్థులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఇక జూన్13వ తేదీన నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం సంబరాల్లో మిషన్ భగీరథ మహిళా ఇంజినీర్లు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. భగీరథ ప్రధాన కార్యాలయంతోపాటు ఎస్.ఈ ఆఫీసుల్లో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని వివరించారు. అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించాలన్నారు. ఈ సమావేశంలో ఈఎన్సీ జి కృపాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్‌తో పాటు చీఫ్ ఇంజినీర్లు, అన్ని జిల్లాల ఎస్.ఈ, ఈఈలు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- జూన్ నుంచి గృహలక్ష్మి అమలు : ఆరోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, జూన్ నుంచి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని వైద్యారోగ్య ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో 150 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రాష్ట్రానికి కరువు వలసలు తప్ప ఏమీ ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. న్యూట్రిషన్ కిట్లతో ఆరోగ్యవంతులను చేస్తూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అనంతరం కేసీఆర్ కిట్ ఇచ్చి 102 ద్వారా ఇంటి వద్దకు చేర్చుతున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి ఇస్తున్నామని చెప్పారు. జూన్ నెలలో గృహలక్ష్మి పథకం ద్వారా సొంత స్థలం ఉన్న వాళ్లకు ఇల్లు కట్టుకునేందుకు నిధులు లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎంపీ పి.రాములు, జెడ్పీ చైర్మెన్ శాంతకుమారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మెన్ నరసింహ గౌడ్, రైతు సేవ సమితి జిల్లా కన్వీనర్ తోకల మనోహర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

- అందుబాటులో లేని డాక్టర్.. ప్రసవం చేసిన నర్సులు

నవతెలంగాణ-కోదాడరూరల్

ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం.. సమాచారం అందించినా రాకపోవడంతో చివరకు నర్సులే ప్రసవం చేశారు. కానీ.. శిశువు పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వాస్పత్రిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం కరివిరాల (పెరికగూడెం) గ్రామానికి చెందిన మానసకు పురిటి నొప్పులు రావడంతో సోమవారం కోదాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరిశీలించి వాతం నొప్పి అని చెప్పారు. మరలా మంగళవారం తెల్లవారుజామున నొప్పులు రావడంతో నర్సులు వైద్యురాలికి సమాచారం అందించారు. ఆమె రాలేనని చెప్పడంతో నర్సులే కాన్పు చేశారు. శిశువు పరిస్థితి ప్రమాదంగా ఉందని, ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని హడావుడి చేశారు. అయితే, అంబులెన్స్ డ్రైవర్ ప్రయివేట్ ఆస్పత్రికి రానన్నారు. ఇదే సమయంలో పరిస్థితి విషమించి శిశువు మృతిచెందింది. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాధితులు డాక్టర్లను నిలదీశారు. వైద్యులు అందుబాటులో ఉంటే శిశువు బతికి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని సముదాయించారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

- ఘటనా స్థలంలో ధర్నా



నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని కాలనీల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల మధ్య డంపింగ్‌యార్డ్ ఉండటం వల్ల దుర్వాసన, చెత్తాచెదారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యర్థాలను నిల్వ చేయడంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వెంటనే యార్డును తరలించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఏవో రాధకు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, సీనియర్ నాయకులు నూకల జగదీష్‌చంద్ర, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మూడావత్ రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశరాములు, శశిధర్‌రెడ్డి, ఎండి అంజాద్, గాయం వెంకటరమణా రెడ్డి, పాపారావు, ఫాతిమా భేగం, మున్ని, పాదూరి గోవర్ధన, బాబునాయక్, గోవింద్‌రెడ్డి, వాడపల్లి రమేష్, కరిమున్నిసా బేగం పాల్గొన్నారు.

పీఆర్సీ నూతన కమిటీని నియమించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులుసదానందంగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నూతన కమిటీని నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి సదానందంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది, జులై నుంచే కొత్త పీఆర్సీ అమలు కావాల్సి ఉందని చెప్పారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయ ఖాళీల మేరకు విద్యావాలంటీర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు. న్యాయపరమైన చిక్కులను పరిష్కరించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. మన ఊరు- మనబడి కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని చెప్పారు. అందుకనుగుణంగా పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను ఆర్థిక శాఖ మంజూరు చేయాలని కోరారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. అవసరమైతే ఐక్య ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, నాయకులు బి రవి, ఏవి సుధాకర్, ఎల్ఎం ప్రసాద్, బ్రహ్మాచారి, శ్రీధర్‌రావు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దేశంలోనే పెద్ద కుంభకోణం

- బీఆర్ఎస్ నేతలకు కోట్ల ఆదాయం : కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ దేశంలోనే పెద్ద కుంభకోణమని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్టు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ధరణి పోర్టల్ చిక్కులతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణిని అడ్డుపెట్టుకుని చేస్తున్న అక్రమాలపై కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ధరణి పోర్టల్‌తో 52 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 15 లక్షల ఎకరాల రైతులకు సంబంధించిన భూములు ఆన్‌లైన్‌లో ఎక్కలేదన్నారు. ధరణి పోర్టల్‌లోని లోపాలను మంత్రి హరీష్‌రావు ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించారు.

లారీ డ్రైవర్‌కు గుండెపోటు..

- వెనుక నుంచి కారును ఢీ • లారీ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

లారీ డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో రోడ్డుపై ఆగి ఉన్న కారును అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన నర్సింహులు(49) మంగళవారం ఉదయం ఆరాంఘర్ నుంచి కర్నూలు వెళ్తున్నాడు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రధాన రహదారి వద్దకు రాగానే లారీ డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. వెంటనే తన భార్యకు ఫోన్ చేసి తన గుండెలో కొంచెం నొప్పిగా ఉందని చెప్పాడు. అదే సమయంలో అతివేగంగా రోడ్డు పక్కనే ఉన్న కారును ఢీకొట్టాడు. దాంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గ పోరాటాలు, కార్మికవర్గ ఐక్యతే లక్ష్యంగా

సీఐటీయూ ఆవిర్భావం

- పెట్టుబడిదారి విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకం పోరాటాలు: రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్
- సంఘం జెండాను ఆవిష్కరించిన ఉపాధ్యక్షులు ఎస్వీ రమ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంఘాలు పాలకవర్గాల తొత్తులుగా పనిచేయడాన్ని జీర్ణించుకోలేక, వర్గపోరాటాలు, కార్మికవర్గ ఐక్యతే లక్ష్యంగా 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తెలిపారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జమీస్తాన్‌పూర్‌లో రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భూపాల్ మాట్లాడుతూ 'ఐక్యత-పోరాటం' నినాదంతో ఏర్పడిన సీఐటీయూ దేశంలోఇప్పటి వరకు అనేక సమ్మెలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టిందని అన్నారు. ప్రారంభంలోనే రైల్వే సమ్మె మొదలుకుని, తద్వారా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేకవిధానాలకు నిరసనగా రెండురోజులపాటు సమ్మె నిర్వహించడంలో సీఐటీయూ కృషి ఎంతో ఉందన్నారు.1991లో పీవీ నరసింహారావు హయాంలో నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ లాంటి కేంద్ర కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో గొప్ప విజయం సాధించిందని చెప్పారు. నరేంద్రమోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ సంపదను తాకట్టు పెట్టిందని అన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. రూ.60లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను రూ.6లక్షల కోట్లకు పెట్టుబడిదారులకు అర్పించిందని అన్నారు. కనీస వేతనాలు పెంచకపోవడంతోపాటు ధరలను విపరీతంగా పెంచిందని అన్నారు. ప్రజలపై తీవ్రమైన భారాలను మోపి కార్పొరేట్లకు రాయితీలు ప్రకటించిందని తెలిపారు. నిరుద్యోగం, దారిద్ర్యాన్ని పెంచిపోషించిందని, వీటన్నింటిని మరుగపడేయడానికి మతం, కులాల పేరుతో ఘర్షణలు సృష్టించిందని విమర్శించారు.

రాజ్యాంగాన్ని తుంగలోతొక్కిందని, ప్రజాస్వామ్యాన్ని మంట గలిపిందని చెప్పారు. పెట్టుబడిదారి విధానం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడమే కార్మికుల తక్షణ కర్తవ్యమని, అందుకు అన్ని కార్మిక సంఘాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, సునీత, నగేష్, నాయకులు రాజ్‌కుమార్, భారతి, సుమలత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న మీరాకుమార్ రాక

- తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హాజరు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ హైదరాబాద్‌కు రానున్నట్టు టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. టీపీసీసీ ఆధ్వర్యంలో వేడుకలను పెద్దఎత్తున ఘనంగా నిర్వహించనున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఐదు గురుకులాల్లో ఒకే కాల నిర్ణయ పట్టికను అమలు చేయాలి

- సీఎస్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఐదు రకాల గురుకుల విద్యాసంస్థల్లో ఒకే కాల నిర్ణయ పట్టికను అమలు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారిని మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యా సంస్థలు, ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ గురుకులాలు, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ గురుకులాలున్నాయని వివరించారు. అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలో 80 మంది విద్యార్థులు రెండు సెక్షన్లుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కొన్నింటిలో ఇంటర్ తరగతులను కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఐదు రకాల గురుకుల విద్యాసంస్థల్లో కాల నిర్ణయ పట్టిక ఒకే రకంగా లేదని తెలిపారు. ఒకే రకమైన కాల నిర్ణయ పట్టికను అమలు చేయాలని కోరారు. ఇంటర్ తరగతులు బోధించే అధ్యాపకుల వేతన స్కేలు వేర్వేరుగా ఉన్నట్టుగా తన దృష్టికి వచ్చిందని వివరించారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో ఇంటర్ బోధిస్తున్న అధ్యాపకుల వేతన స్కేలు సమానం చేయాలని పేర్కొన్నారు. ఐదు రకాల గురుకుల విద్యాసంస్థల్లో ఒకే రకమైన నిబంధనలుండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'డీకోడెడ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సబిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడ్మిషన్లపై సమగ్ర సమాచారంతో ప్రముఖ విద్యావేత్త, రచయిత ఎన్ సుధీర్‌రెడ్డి రచించిన 'కాలేజ్ అడ్మిషన్స్ డీకోడెడ్' అనే పుస్తకాన్ని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆవిష్కరించారు. అడ్మిషన్లపై సమగ్ర సమాచారంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపయోగపడేలా పుస్తకాన్ని రచించిన సుధీర్‌ను మంత్రి అభినందించారు. ఇది అందరికీ ఒక దిశ చూపుతుందంటూ ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రచయిత సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంసెట్‌తోసహా వివిధ పోటీ పరీక్షలకు హాజరైన వారు తదుపరి చేరాల్సిన కోర్సులు, కళాశాలలు లాంటి వివరాలతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవటానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఎన్ చెన్నారెడ్డి, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లతో రికార్డ్ : మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువగా రికార్డ్ స్థాయిలో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటి వరకు కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాదాపు రూ.10,200 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని ఎనిమిది లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్టు చెప్పారు. ఇందుకోసం రైతు చెంతనే ఉండే విధంగా ఏడు వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు పూర్తయిన వెంటనే రైతుల అకౌంట్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

అవినీతి వీసీ రాజీనామా చేసి వెళ్లిపోవాలి

- అవినీతి నుంచి దృష్టి మరల్చేందుకు వివాదాలు : టీయూలో వీసీ చాంబర్‌ను విద్యార్థి సంఘాల ముట్టడి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అవినీతి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని టీయూలో వీసీ చాంబర్‌ను పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, బీవీఎం విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ముట్టడించారు. వీసీని ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు జన్నారపు రాజేశ్వర్, వేణు రాజ్, విట్టల్ మాట్లాడారు. యూనివర్సిటీలో విద్యార్థులు ఫీజులు కట్టిన డబ్బులను వీసీ విచ్చలవిడిగా ఖర్చు చేసి, యూనివర్సిటీ ఖజానా ఖాళీ చేశారన్నారు. ఉద్యోగాల పేరుతో లక్షలాది రూపాయలు తీసుకొని అక్రమ నియామకాలు చేశారని, ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ఎన్నో అవినీతి ఆరోపణలు పక్కదోవ పట్టించడానికే వీసీ పలు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. యూనివర్సిటీకి రిజిస్ట్రార్ ఎవరో తెలియక విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీకి ఎవరు రిజిస్ట్రార్ అనేది తేల్చి, వీసీ అవినీతిపై విచారణ చేసి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో వీసీ కుర్చీ పైనే ఉండగా విద్యార్థులు టేబుల్స్ పైకి ఎక్కి వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు.. వీసీ ఛాంబర్‌లోకి వచ్చి విద్యార్థులను బయటికి పంపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, స్నేహిత, లక్ష్మి నారాయణ, మోహన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు నిఖిల్ రెడ్డి, సయ్యద్ అహ్మద్, సందీప్ రెడ్డి, శివ, రమణ, ఇంజిమ్ము, లక్కీ, ఉదయ్, లక్ష్మీకాంత్, బీవీఎం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ టెండర్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సీఎం కేసీఆర్‌కు బండి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఔటర్ రింగ్‌రోడ్డు టెండర్ల ప్రక్రియలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. ఓఆర్ఆర్‌పై ఏటా రూ.415 కోట్ల ఆదాయం వస్తున్నదనీ, ఏటా ఐదు శాతం పెంచుకుంటూ పోయినా 30 ఏండ్లకు రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రాష్ట్ర సర్కారు ఈ ఆలోచన చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు.

సంపాదకీయం


'శ్రీరంగనీతులు'

'డొక్కలో గుద్ది తల నిమరడం' మన ప్రధానికి తెలిసినంతగా మరెవరికీ తెలియదనుకుంటా..! ఇటీవల నీటి అయోగ్ సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలను బట్టి ఇది స్పష్టమవుతుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యతతో పని చేస్తేనే దేశ అభివృద్ధి అంటూ గొప్పగా

> తెలంగాణలో మాదిరిగా పంజాబ్‌లో కూడా శాసనసభ ఆమోదించిన ఆర్థిక బిల్లును ఆపే ప్రయత్నం చేశారు. దీనికి కూడా గవర్నర్‌ను పావులా వాడుకున్నారు. చివరికి పంజాబ్ ముఖ్యమంత్రి కూడా సుప్రీం కోర్టుకు వెళ్ళి ఆర్డర్ తెచ్చుకుంటే తప్ప ఆ బిల్లును ప్రవేశ పెట్టలేకపోయారు. ఇదీ ఇప్పుడు దేశంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిస్థితి. ప్రతి దానికి కోర్టుకు వెళ్తే తప్ప రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయి.

ప్రకటించారు. రాష్ట్రాల అభివృద్దే దేశాల అభివృద్ధి అని కూడా సెలవిచ్చారు. ఆయన చెప్పింది అక్షర సత్యం. మరి గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం చేస్తున్న పెత్తనం సంగతేంటి..? దీనికి ఢిల్లీ ప్రభుత్వం పడుతున్న కష్టమే తాజా ఉదాహరణ. మనది సమాఖ్య వ్యవస్థ. రాష్ట్రాల సమాహారం. ఇది రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులు, విధులను కూడా స్పష్టంగా విభజించారు. అవేమీ పట్టకుండా ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వాల గొంతును నొక్కేస్తున్నారు. దీనికి ఆయన సమాధానం ఏం చెబుతారు?

రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్న మోడీ నుంచి ఏది ఆశించినా అది ప్రజల అత్యాశే అవుతుంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్రంగా అణిచివేసే చర్యలే కనిపిస్తున్నాయి. వీసీల నియామకంలోనూ అది స్పష్టంగా కనిపించింది. తాము అధికారంలో లేని చోట గవర్నర్లను ఉపయోగించుకొని పెత్తనం చెలాయించడాన్ని బీజేపీ ఓ విధంగా అమలు చేస్తుంది. మన రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి గవర్నర్ ఏ విధంగా అడ్డుపడుతున్నారో అందరికీ తెలిసిందే. అలాగే కేరళలో పినరాయి విజయన్, ఢిల్లీలో కేజ్రీవాల్, తమిళనాడులో స్టాలిన్, బెంగాల్‌లో మమత ప్రభుత్వాలను గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు ఏ విధంగా సతాయిస్తున్నారో కూడా అందరికీ తెలిసిన విషయమే. వీటితో పాటు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రల్లోనూ గవర్నర్‌ల జోక్యం తీవ్రమయింది. వీసీల నియామకంలో ఇది మరింత రుజువవుతోంది. తమ హిందూత్వ ఎజెండాను యూనివర్సిటీల్లోకి తీసుకెళ్ళడానికి రోడ్ మ్యాప్ రూపొందించు కున్నారు. చివరకు కేంద్రం నియంతృత్వాన్ని భరించలేక ఛాన్సలర్‌గా గవర్నర్ స్థానంలో ముఖ్యమంత్రులే ఉండేలా కొన్ని రాష్ట్రాలు నిర్ణయం తీసుకునే పరిస్థితి వచ్చింది.



ఎక్కడో ఎందుకు తెలంగాణలో సైతం శాసనసభ అమోదించిన బిల్లును గవర్నర్ తొక్కిపెట్టడం, బిల్లులను క్లియర్ చేయకుండా జాప్యం చేయడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. దీని ఆంతర్యం ఏంటో, దీని వెనుక ఉన్నదెవరో కూడా బహిరంగ రహస్యమే. నిజంగా దేశ అభివృద్ధి కోరుకున్న ప్రధానే అయితే గవర్నర్లను అడ్డు పెట్టుకొని ఇలా సమాంతర ప్రభుత్వాలను నడుపుతాడా? ఇదేనా ప్రజాస్వామ్యమంటే. ఇదేనా సమాఖ్య వ్యవస్థ అంటే. ఇదేనా రాజ్యాంగ విలువలను కాపాడటమంటే..?

ఢిల్లీలో అధికార పంపిణీపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టమైన తీర్పును ఇచ్చింది. అయినా మోడీ సర్కారు ఆర్డినెన్స్ తీసుకొచ్చి దాన్ని ధిక్కరించడం ఎంతటి దుర్మార్గం. ఢిల్లీ ముఖ్యమంత్రికి కనీసం విద్య, వైద్య శాఖల కార్యదర్శులను, కనీసం ఉపకార్యదర్శులను కూడా బదిలీ చేయలేని స్థితి కల్పించారు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంకెళ్ళు వేశారు. దీనిపై కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించగా, ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పని చేయనీయకుండా చేయడం నియంతృత్వమని కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అయినా మన ప్రధాని మాత్రం అడ్డదారిలో ఆర్డినెన్స్ తేవడం ఎంతటి బరితెగింపు. కేంద్రం బీజేపీయేతర రాష్ట్రాలపై ఎంతగా కక్ష కట్టిందో దీన్ని బట్టే తెలుస్తోంది. మన ప్రధానికి కోర్టులన్నా, కోర్టు తీర్పులన్నా ఎంతటి గౌరవం ఉందో కూడా అర్థమవుతోంది.

తెలంగాణలో మాదిరిగా పంజాబ్‌లో కూడా శాసనసభ ఆమోదించిన ఆర్థిక బిల్లును ఆపే ప్రయత్నం చేశారు. దీనికి కూడా గవర్నర్‌ను పావులా వాడుకున్నారు. చివరికి పంజాబ్ ముఖ్యమంత్రి కూడా సుప్రీం కోర్టుకు వెళ్ళి ఆర్డర్ తెచ్చుకుంటే తప్ప ఆ బిల్లును ప్రవేశ పెట్టలేకపోయారు. ఇదీ ఇప్పుడు దేశంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిస్థితి. ప్రతి దానికి కోర్టుకు వెళ్తే తప్ప రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్‌భవన్‌లన్నింటిని బీజేపీ కార్యాలయాలుగా మార్చేసుకుంటున్నారు. ఈ మొత్తం పరిశీలించినప్పుడు ఓ విషయం స్పష్టం. నీటి అయోగ్‌లో మోడీ గారి మాటలన్నీ కేవలం "శ్రీరంగనీతులే" అని.

ఏకపక్ష ఆంక్షలతో దేశాలను సాధిస్తున్న సామ్రాజ్యవాదం!



ఎం. కోటేశ్వరరావు
8331013288

'కొట్టవద్దు, తిట్టవద్దు, పొమ్మనకుండా పొగబెట్టు' ఎలా దారికిరారో చూద్దాం అన్నట్లుగా ఆర్థిక ఆంక్షలను ఆయుధాలుగా చేసుకొని అమెరికా, పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు, వాటి తొత్తులు అనేక దేశాల మీద దాడులు చేస్తున్నాయి. అవి ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న ఆర్థిక, విధాన పరిశోధనా కేంద్రం (సిఇపిఆర్) "ఆర్థిక ఆంక్షల మానవీయ పర్యవసానాలు" అనే శీర్షికతో ఒక అధ్యయనాన్ని ప్రచురించింది. మానవహక్కులు, ప్రజాస్వామ్యం వంటి పెద్ద కబుర్లు చెప్పే పశ్చిమ దేశాల దుర్మార్గాన్ని అది ఎండగట్టింది. ఆంక్షలలో రెండు రకాలు, ఐరాస విధించేవి ఒక తరగతి. ఇవి సొంత పౌరుల పట్ల లేదా ఇతర దేశాల మీద కాలుదువ్వే పాలకులను దారికి తెచ్చేందుకు సమి ష్టిగా విధించేవి. ఐరాసతో నిమిత్తం లేకుండా కర్ర ఉన్నవాడిదే గొర్రె అన్నట్లుగా తమకు లొంగని దేశాలు, సంస్థలు, వ్యక్తుల మీద ఏకపక్షంగా అమెరికా, దాని మిత్రదేశాలు విధించేవి రెండవ కోవకు చెందినవి. కేవలం కమ్యూనిస్టులుగా ఉన్నందుకు, ప్రపంచమంతటా కమ్యూనిజాన్ని అరికట్టే మొనగాడిగా ఉన్న తమకు కూతవేటు దూరంలోనే ఒక సోషలిస్టు దేశం ఉనికిలోకి రావటాన్ని సహించలేని అహంతో అమెరికాలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ అమానవీయ ఆంక్షలను క్యూబా మీద అమలు జరుపుతున్న సంగతి తెలిసిందే. 1992 నుంచీ ప్రతి ఏటా 2020లో కరోనా కారణంగా తప్ప వాటిని ఖండిస్తూ ఐరాస సాధారణ అసెంబ్లీలో తీర్మానం పెట్టటం దాన్ని అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేకించటం, అమెరికా ఒత్తిడిని తట్టుకోలేక కొన్ని దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండటం

> అన్ని దేశాల మీద ప్రకటిస్తున్న ఆంక్షల లక్ష్యం కూడా లొంగదీసుకోవటమే. అణుపరీక్షలు జరుపుతున్నదనే కారణంతో ఇరాన్ మీద భద్రతా మండలి విధించిన ఆంక్షలు కొన్ని కాగా దానితో నిమిత్తం లేకుండా అమెరికా, ఇతర దేశాలు విధించినవి మరికొన్ని, అణు కార్యమం నిలిపివేతకు అంగీకరించిన ఇరాన్‌తో దానికి ప్రతిగా స్పందించాల్సిన అమెరికా ఏకపక్షంగా ఒప్పందం నుంచి వైదొలిగింది. తమ భద్రతకు ముప్పుతెచ్చే ఎత్తుగడలో భాగంగా ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోవద్దన్న రష్యా వినతిని ఖాతరు చేయకుండా ముందుకు పోతుండటంతో తప్పనిసరై సైనిక చర్యకు దిగిన పుతిన్‌పై ఆంక్షలు విధించి దేశ ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి జనాన్ని వీధుల్లోకి తెచ్చి పుతిన్ సర్కార్‌ను గద్దెదింపాలని అమెరికా చూసింది.

తప్ప మిగిలిన దేశాలన్నీ ఖండించినా అమెరికా ఖాతరు చేయటం లేదు.

ఐరాస విధించేవి తప్ప భద్రతా మండలి అనుమతి లేని మిగిలిన ఆంక్షలన్నీ చట్టవిరుద్ధమైనవే. 'దేశమంటే మట్టి కాదు, మనుషులు' అని చెప్పిన మహాకవి గురజాడ ప్రకారం అనేక దేశాలను అనేకంటే అక్కడి పౌరుల జీవితాలను అతలాకుతలం చేస్తున్న ఈ దుర్మార్గాలను నిరోధించే సత్తా ఐరాసకు లేదు. 1960 దశకం నాటికి ప్రపంచంలోని నాలుగు శాతం దేశాలు ఐరాస, అమెరికా, ఐరోపా సమాఖ్య ఆంక్షలకు గురికాగా ప్రస్తుతం 54 దేశాలు లేదా 27శాతానికి చేరాయి. వీటి జీడీపీ నాలుగు నుంచి 29శాతానికి పెరిగింది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఇటీవలి పరిణామాలను చూస్తే ఒబామా ఏలుబడిలో సంస్థలు లేదా వ్యక్తుల మీద ఏడాదికి 544 కొత్త ఆంక్షలు విధిస్తే అవి ట్రంప్ కాలంలో 975, వర్తమాన జోబైడెన్ ఇప్పటి వరకు సగటున 1,151గా ఉన్నాయి. దీర్ఘకాలంగా అమల్లో ఉన్నవాటిలో క్యూబా మీద 1960 దశకం నుంచి అమలు జరుగుతుంటే ఇరాన్ మీద 1979, ఆఫ్ఘనిస్తాన్ మీద 1999 నుంచి అమల్లో ఉన్నాయి. ఐరాస మానవహక్కుల మండలి 2014లో ఆమోదించిన తీర్మానంలో ఏకపక్ష ఆంక్షలు పౌరుల మీద చూపుతున్న ప్రతికూల ప్రభావాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నట్లు పేర్కొన్నది. ఆ తరువాత తీవ్రత, సంఖ్య రీత్యా ఇంకా పెరిగాయి తప్ప తగ్గలేదు.


ఔషధాల దగ్గర నుంచి అన్నింటి మీద అమెరికా విధించిన ఆంక్షల వలన క్యూబా అపార నష్టానికి గురైంది. ఒక దశలో వ్యవసాయ పరికరాలైన ట్రాక్టర్ల వంటి వాటికి కూడా డీజిల్, పెట్రోల్ దొరక్క గుర్రాలతో సాగు చేసుకోవాల్సి వచ్చింది. క్యూబా మీద ఆంక్షల వలన తమకు జరిగిన నష్టం గురించి అమెరికా సంస్థలు కూడా గగ్గోలు పెట్టాయి. ఎవడిగోల వాడిది. క్యూబా పాలసీ ఫౌండేషన్ అనే సంస్థ 2002లో వేసిన అంచనా ప్రకారం ఏటా అమెరికా ఆర్థిక వ్యవస్థకు 360 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. తరువాత అక్కడి కార్పొరేట్ల వత్తిడి మేరకు ఆంక్షలను సడలించటంతో 2000-2006 కాలంలో అమెరికా వార్షిక ఎగుమతులు 60లక్షల నుంచి 35 కోట్ల డాలర్లకు పెరిగాయి. అయినప్పటికీ తమకు ఏటా 120 కోట్ల డాలర్ల మేర నష్టం జరుగుతున్నట్లు 2009లో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొన్నది. ప్రారంభం నుంచి తమకు 753 బి. డాలర్ల నష్టం జరిగిందని క్యూబా సర్కార్ చెప్పింది. అమెరికాకు ఏటా 484 కోట్ల డాలర్ల మేర, క్యూబాకు 68.5కోట్ల డాలర్ల మేర నష్టం జరిగినట్లు క్యూబా పాలసీ ఫౌండేషన్ అంచనా వేసింది. భిన్నమైన అంశాల ప్రాతిపదికన చెప్పే ఈ అంచనాలు ఒకదానికి ఒకటి పొసగవు. ఉదాహరణకు 2015లో అల్ జజీరా ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం ఆంక్షలు ప్రారంభమైన 55 సంవత్సరాలలో క్యూబాకు 1.1లక్షల కోట్ల నష్టం జరిగింది.

ఇరాన్ మీద విధించిన ఆంక్షల కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన అత్యవసర ఔషధాల జాబితాలోని 32తో సహా 73ఔషధాలకు అక్కడ కొరత ఏర్పడింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తలసరి ఆదాయం దారుణంగా తగ్గింది. 2021లో అమెరి కాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం తాలిబాన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అదే అమెరికా, ఐరోపా సమాఖ్య 960 కోట్ల డాలర్ల విలువగల ఆఫ్ఘాన్ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయి. ఇది ఆ దేశ జీడీపీలో సగం. ఆంక్షల కారణంగా విదేశాల నుంచి ఏటా వచ్చే 80 కోట్ల డాలర్ల మేర నిలిచిపోయాయి. వెనెజులా మీద 2017లో విధించిన ఆంక్షల కారణంగా 2020 నాటికి దేశ దిగుమతులు 91శాతం తగ్గాయి. దాదాపు పూర్తిగా దిగుమతుల మీదనే ఆహారం సమకూర్చుంటున్న వెనెజులా దిగుమతులు 78శాతం పడిపోయాయి. చమురు ఎగుమతులపై ఆంక్షల కారణంగా జీవన ప్రమాణాలు తగ్గి శిశు, సాధారణ మరణాల రేటు పెరిగింది. తమ ఆంక్షల కారణంగా ఇబ్బందులు పడిన జనం ఇరాన్, వెనెజులా పాలకులపై తిరుగుబాటు చేసే విధంగా పురికొల్పటమే లక్ష్యమని అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి మైక్ పాంపియో గతంలో చెప్పాడు. ప్రపంచ భద్రత, ప్రజాస్వామ్యం, మానవహక్కుల పేరుతో ఇలాంటి దుర్మార్గమైన

> దాలరు పెత్తనం తగ్గుతుందని అనేక మంది చెబుతున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న పరిస్థితి చూస్తే అది అంత తేలిక కాదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. వివిధ దేశాల రిజర్వుబాంకుల్లో దాలరు నిల్వలు 2021 డిసెంబరులో 7,085.92 బిలియన్ డాలర్లుంటే 2022 ఆగస్టులో 6,652.32 బి.డాలర్లకు మాత్రమే తగ్గాయి. ఇదే కాలంలో మొత్తం రిజర్వుబాంకుల ఆస్తుల్లో చైనా యువాన్ నిల్వలు నామమాత్రం నుంచి 6.2శాతానికి పెరిగాయి. అందువల్లనే అమెరికా నిమ్మకు నీరెత్తినట్లు ఉంది, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. సామ్రాజ్యవాదులు, దానితో చేతులు కలుపుతున్న శక్తుల తీరు తెన్నులను చూస్తే తమకు లొంగని దేశాల మీద ఆంక్షలను రోజు రోజుకు పెంచటాన్ని గమనించాము.

ఎత్తుగడలను అమలు చేస్తున్నారు. ఆంక్షలు ప్రకటించిన ఏ దేశంలోనైనా జనాన్ని ఇబ్బంది పెట్టటం తప్ప వీటిని సాధించలేదు. అవి సమర్థించే అనేక దేశాల్లో వాటి జాడే కనపడదు. సోషలిస్టు బాట నుంచి వైదొలిగేట్లుగా లేదా తనకు అనుకూలంగా మార్చుకొనేట్లు క్యూబా మీద అమలు జరుపుతున్న ఆంక్షల ప్రభావం ఏమాత్రం లేదని విలియం లియోగ్రాండే అనే విశ్లేషకుడు చెప్పాడు. ప్రాణాలైనా ఇస్తాంగానీ అమెరికాకు లొంగేది లేదన్న కమ్యూనిస్టుల ప్రత్యేకత ఇది.

అన్ని దేశాల మీద ప్రకటిస్తున్న ఆంక్షల లక్ష్యం కూడా లొంగదీసుకోవటమే. అణుపరీక్షలు జరుపుతున్నదనే కారణంతో ఇరాన్ మీద భద్రతా మండలి విధించిన



ఆంక్షలు కొన్ని కాగా దానితో నిమిత్తం లేకుండా అమెరికా, ఇతర దేశాలు విధించినవి మరికొన్ని. అణు కార్యమం నిలిపివేతకు అంగీకరించిన ఇరాన్‌తో దానికి ప్రతిగా స్పందించాల్సిన అమెరికా ఏకపక్షంగా ఒప్పందం నుంచి వైదొలిగింది. తమ భద్రతకు ముప్పుతెచ్చే ఎత్తుగడలో భాగంగా ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోవద్దన్న రష్యా వినతిని ఖాతరు చేయకుండా ముందుకు పోతుండటంతో తప్పనిసరై సైనిక చర్యకు దిగిన పుతిన్‌పై ఆంక్షలు విధించి దేశ ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి జనాన్ని వీధుల్లోకి తెచ్చి పుతిన్ సర్కార్‌ను గద్దెదింపాలని అమెరికా చూసింది. వాణిజ్య పోరు పేరుతో చైనాను తన దారికి తెచ్చేందుకు అంతకు ముందే పూనుకుంది. వివిధ సందర్భాలలో మనతో సహా అనేక దేశాలను బెదిరించటం చూస్తున్నదే. ఉక్రెయిన్ మీద మిలిటరీ దాడులు జరుపుతున్నదనే కారణంతో రష్యాకు చెందిన సంస్థలు, వ్యక్తుల మీద ఆంక్షలు విధించారు. రష్యా ఐటి, ఇంజనీరింగ్ వంటి రంగాలకు అవసరమైన వస్తువులు, సేవల ఎగుమతుల మీద బ్రిటన్ నిషేధం విధించింది, 70శాతం సెమీ కండక్టర్ల ఎగుమతులు నిలిచాయి. అమెరికా, ఇతర నాటో దేశాల చమురు, గ్యాస్ ఎగుమతుల నిషేధం, చమురు ధరలపై ఆంక్షల గురించి తెలిసిందే. దేశాల వారీ చూస్తే అమెరికా 374, కెనడా 156, బ్రిటన్ 95, ఐరోపా సమాఖ్య 44, స్విట్జర్లాండ్ 42, ఆస్ట్రేలియా 28 చొప్పున కొత్త ఆంక్షలు విధించాయి. ఇరాన్ మీద కొత్తగా 115 ఆంక్షలు ఈ దేశాలు విధించాయి. హిరోషిమాలో ఇటీవల జరిగిన జి7 దేశాల శిఖరాగ్ర సమావేశానికి ముందు పలు ఆంక్షలకు తెరతీశారు. వాటి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. ఇప్పటికే అమలు జరుపు తున్న ఆంక్షల వలన రష్యా ప్రభావితం అవుతున్నది. చమురును అరవై డాలర్లకు మించి కొనకూడదన్న ఆంక్ష వలన గానీ రాయితీ ధరలకు వివిధ దేశాలకు అమ్ముతున్నకారణం కావచ్చు ప్రస్తుత రష్యా చమురు సగటు ధర 58.62 డాలర్లు ఉంది. ఆర్మీనియా నుంచి అది దిగుమతి చేసుకున్న ఎలక్ట్రానిక్స్ 3,700 శాతం పెరిగాయి.వివిధ దేశాల మీద 2023 ఫిబ్రవరి 22 నాటికి విధించిన ఆంక్షల సంఖ్య గురించి స్టాటిస్టా సమాచారం ఇలా ఉంది.

దేశం పేరు	మొత్తం	2022, ఫిబ్రవరి	2022 ఫిబ్రవరి తరువాత
రష్యా	14,081	2,754	11,327
ఇరాన్	4,191	3,616	575
సిరియా	2,644	2,598	46
ఉ.కొరియా	2,133	2,052	81
బెలారస్	1,154	788	366
వెనెజులా	651	-	-

చైనా మార్కెట్‌లో మరింతగా తన వస్తువులను అమ్ముకొనేందుకు, దిగుమతులను అడ్డుకొనేందుకు, చైనాకు అధునాత సాంకేతిక పరిజ్ఞానం అందకుండా చూసేందుకు అమెరికా ఆంక్షలను అమలు జరుపుతోంది. 2008లో రెండు కొత్త ఆంక్షలను విధించగా తరువాత 2018నాటికి వాటిని 59కి పెంచింది. తరువాత నాలుగు సంవత్సరాలలో 29,300,89,36 కొత్తగా విధించింది. వీటిలో ఇటీవలి కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల ఎగుమతుల మీద విధించిన ఆంక్షలు తీవ్రమైనవి. తద్వారా చైనా ఆర్థిక రంగాన్ని కుదేలు కావించాలని చూస్తున్నది. 2023తొలి మూడు మాసాలలో విధించిన ఆంక్షలను పరిగణలోకి తీసుకుంటే పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షల సంఖ్య 36,500 దాటింది. తాము విధించిన వాటితో పాటు ప్రతిగా తమ మీద విధించిన ఆంక్షలతో పశ్చిమ దేశాలు కూడా కొంత మేరకు ప్రభావితం అవుతాయి. వాటి తీవ్రత పెరిగి తమ లాభాలు, అసలుకే ముప్పు వచ్చేంత వరకు కార్పొరేట్ సంస్థలు రంగంలోకి రావు. డాలరు పెత్తనం తగ్గుతుందని అనేక మంది చెబుతున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న పరిస్థితి చూస్తే అది అంత తేలిక కాదని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. వివిధ దేశాల రిజర్వుబాంకుల్లో డాలరు నిల్వలు 2021 డిసెంబరులో 7,085.92 బిలియన్ డాలర్లుంటే 2022 ఆగస్టులో 6,652.32 బి.డాలర్లకు మాత్రమే తగ్గాయి. ఇదే కాలంలో మొత్తం రిజర్వుబాంకుల ఆస్తుల్లో చైనా యువాన్ నిల్వలు నామమాత్రం నుంచి 6.2శాతానికి పెరిగాయి. అందువల్లనే అమెరికా నిమ్మకు నీరెత్తినట్లు ఉంది, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. సామ్రాజ్యవాదులు, దానితో చేతులు కలుపుతున్న శక్తుల తీరు తెన్నులను చూస్తే తమకు లొంగని దేశాల మీద ఆంక్షలను రోజు రోజుకు పెంచటాన్ని గమనించాము. రానున్న రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఆయుధ యుద్ధాలకు బదులు ఆంక్షల దాడులతో జనాలకు ఇబ్బందులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఐరాస వీటిని నిరోధించలేదని ఇప్పటికే తేలిపోయింది. అందువలన యుద్ధాలనే కాదు ఆంక్షలనూ వద్దంటూ జనం వీధుల్లోకి రావాల్సిన అవసరం ఉంది. •




'నో స్మోకింగ్ ప్లీజ్...'

సిగరెట్ తాగకు రా... ధూమపానం మానరా..! కాశిగా... అని ఎన్ని సార్లు ప్రాధేయపడి ఉంటానో లెక్క లేదు. నేను ఇంటర్ చదివే రోజుల్లో నా ఆప్త మిత్రుడు ఎస్ కాశీ వరప్రసాద్‌ను ఆత్మీయంగా అడుక్కునే వాణ్ణి. ఇంటరయ్యాక కాశీ కానిస్టేబుల్ ఆయ్యాడు. ఓ పదేళ్ళ తర్వాత సికింద్రాబాద్ తిరుమలగిరి చౌరస్తా మీదుగా మా ఊరు మేడ్చల్ జిల్లా కేశవరం వెళ్తున్నాను. అక్కడ ఎడమ పక్క ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఉంది. దానికి సమీపంలో ఉన్న పాన్ డబ్బాలో మా అమ్మకు ఇష్టం అని క్రీన్ వక్కపొడి కొంటున్న. ఇంతలో వీపుపై దెబ్బ పడింది. ఎవడ్రా అని వెనుతిరిగి చూస్తే... కళ్ళల్లో నీళ్ళు ఆగలేదు. ఇంకెవరు ఇంటర్ దోస్తు దీక్షితులు. ఏరా ఎలా ఉన్నావన్నా... ఏముంది, రాంగ్ రూట్లో వచ్చే వాళ్లకు నేను చలానా వేస్తే... పైవాడు నాకు చలానా వేశాడు రా అన్నాడు. అంటేచ అర్థం కాలేదు రా అన్నా. అదేరా... నువ్వు ఊకే నస పెట్టేవాడిని కదా! దమ్ము కొట్టకు రా అని, నేను వినలేదు ఇప్పుడు కూడా సిగరెట్‌ల కోసమే వస్తె నువ్వు కలిశావన్నాడు. కానీ అప్పుడు నేను బాగానే ఉన్నాను, ఇప్పుడు టికెట్ తీసుకుని "వెళ్ళడానికి" రెడీగా ఉన్నా. క్యాన్సర్ అనే వీసా, అనారోగ్యం అనే పాస్ పోర్టుతో అన్నాడు అంతే సరదాగా. నాకు నమ్మ బుద్ధి కాలేదు. ఏ నిజం కాదు కదు నువ్వు అబద్దం చేపుతున్నావు అని సందేహించా. సరే మళ్లీ కలుద్దాం అని చెప్పి నాకు ఇష్టం అని ఓ మీనాక్షి పాన్ కట్టించి నోట్లో పెట్టి మరీ ఆలింగనం చేసుకున్నాడు. ఏడుపును ఆపుకోలేక దుఃఖాన్ని దిగమింగుకోని కేశవరం వచ్చేశా. మరో ఏడాది ఇట్టేగడచి పోయింది. ఓ రోజు మాతో పాటే ఇంటర్ బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కాలేజీలో చదివిన స్నేహితుడు, బంధువు గద్దె వెంకటనరసింహ వద్దకు వెళ్ళా. "మాచన" కాశి గాన్ని చూసొచ్చావా? అన్నాడు. వెంటనే ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పేరిట వైద్యానికి అంత సులువుగా లొంగని క్యాన్సర్‌తో పోరాటం చేసిచేసి అలసి సొలసి ఊపిరాడక పొగాకు పగకు బలి కాబోతున్న ఆప్తమిత్రుడు అంపశయ్యపై కనబడ్డాడు. పొగకు చిక్కి శల్యమై రఘు జీతం నుంచి రిటైర్‌మెంట్ కాకముందే... జీవితం నుంచి రన్ అవుట్ అవుతున్నా...రా అన్నాడు. 'నీకేం కాదురా' అన్నా వినడే. నీతో పాటు డిగ్రీ చదివి ఉంటే నీ నస భరించలేక సిగరెట్ మానేసే వాణ్ణి అన్నాడు. నాదో చివరి కోరిక తీర్చరా అన్నాడు. చెప్పరా... నా కాలేయం ఇవ్వనా అన్నా... చచ్చే వానికి నీ కాలేయం ఎందుకు గానీ, నీకు చదువుకు సాయం చేశా అన్నవే... అందుకు బదులుగా నాకోసం సమాజానికి సాయపడు. నాకు పదేపదే చెప్పావు కదా! సిగరెట్ మాను అని, అదే మాట రోజూ ఒక్కరికో ముగ్గురికో చెప్పు... చెప్తా అని మాట ఇస్తే... చాలు తృప్తిగా "వెళ్ళి పో..తా" అన్నాడు. సరే అని చేతిలో చెయ్యి వేసి... మనసా వాచా కర్మనా ప్రమాణం చేస్తున్నా. ఇకపై మరే మిత్రుడు స్మోకింగ్ మూలంగా తన స్నేహితున్ని కోల్పోకుండా నాకు చేతనైన మేరకు చెపుతూనే ఉంటా అని ప్రతిజ్ఞ చేశా. అని మిత్రుని ఆత్మకు ఆత్మీయంగా సమర్పించి. వచ్చేశా ఓ రెండు వారాలు నిద్ర పట్టలేదు, అన్నం తిందాం అంటే ఆకలి కాదే. వాణ్ణి తలచుకుంటే గుండె తరుక్కుపోయేది. కాలేజీకి వెళ్తే లాక్కెళ్లి టిఫిన్ పెట్టించేవాడు. ఆకలిగా లేదురా అంటే ఇడ్లీ చట్నీతో అమ్మ లా తినిపించే ఒకే ఒక్క మిత్రున్ని పొగాకు పొట్టన పెట్టుకుంది అన్న వాస్తవం కలచి వేసింది. మైత్రి అనేదే తెలియని నాకు స్నేహ మాధుర్యం ఇలా ఉంటుంది అని, చెప్పిన నేస్తం పోయాక ఓ ఆర్నెళ్లు మతి పోయింది. ఎవరైనా సిగరెట్, పొగ, తాగుతూ కనిపిస్తే అతనే కనిపించి, చెప్పరా అతనికి దమ్ము కొట్టొద్దు అని ప్రాధేయ పడ్డట్టు అనిపించేది. వెంటనే వెళ్ళి 'సార్... దయచేసి చేతులు జోడించి ప్రార్థిస్తున్నా దమ్ము కొట్టకండి ప్లీజ్' అని ప్రార్థించే వాణ్ణి. ఈ కృషి ఇలా ఉండగా... కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ వాళ్ళు నా సమాజ సేవా తపన గమనించి ఒపీనియన్ లీడర్‌గా 2009లో ప్రోత్సహించారు. ఈశాన్య భారతం చూసి వచ్చే అరుదైన అవకాశం దక్కింది. ఆ టూర్ నుంచి వచ్చాక సాక్షి పాత్రికేయుడు నా ఇంటర్వ్యూ రాశాడు. ధూమపానం, గుట్కా నిషేధం అతని లక్ష్యం అని ఆ వార్త కథనం. పొగాకుపై పోరు ప్రస్థానం మరింత బాట వేసింది. నేను ఎక్కడ కనిపించినా అడిగే వాళ్ళు 'బాబూ ఎన్నో జీవితాల్లో వెలుగు నింపుతున్నావు. నువ్వు కారణ జన్ముడివి' అని ఆశీర్వదించే వాళ్లు. నా పెళ్లి అయ్యేటప్పుడు కూడా మధ్యవర్తిగా ఉన్న మా మామ అంబటి లక్ష్మీ నారాయణ ఓ స్లోగన్‌తో నన్ను ప్రమోట్ చేసేవారు. అబ్బాయికి ఏ అలవాట్లు లేవు. వాడికి మీ పిల్ల నచ్చడమే గొప్ప అని చెప్పే పెళ్లి కుదిర్చాడు. ఏంది... ఏ అలవాట్లు లేవు అనేది అది నీ క్వాలిఫికేషన్ లా... ఉందే అంటే అవును... నేను ఇంతే అని చెప్పా. వెడ్డింగ్ కార్డులో కూడా 'మాచన సూచన' అని ఓ మాటను అచ్చు వేయించా. నా పెళ్లికి వచ్చే వాళ్లకు పొగాకు ధూమపానం అలవాటు ఉంటే రావద్దు అని. అదేంటి అని నాకు కాబోయే శ్రీమతి అడిగింది. 'మతి ఉన్నోడు దమ్ము కొట్టడు. ధూమపానంకు ప్రాణం బలి పెట్టడు. అమ్మా నాన్నలకు పుత్రశోకం పెట్టడు' అన్నా. నా అభిప్రాయం తప్పు అని భావిస్తే... వీడు నాకు కరెక్ట్ కాదు అనుకుంటే... నా బదులు వెరొకర్ని పెళ్లిచేసుకో అని చెప్పా. జనం కోసం నువ్వు ఆలోచించడమే నాకు బాగా నచ్చింది అని మూడు ముళ్లు వేయించుకుంది. మీ ఆయన ఏమ్ చేస్తారమ్మ అని వారి తరపు చుట్టాలు అడిగితే. పొగాకుపై పోరాటం చేస్తాడు అని గర్వంగా చెప్పింది. అదే స్ఫూర్తితో నేటితరానికి నేను చెప్పేదొకటే 'నో స్మోకింగ్ ప్లీజ్'.

(నేడు ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం)

- మాచన రఘునందన్

కౌటిల్య రాజదండకు ప్రజాస్వామ్యం దండా?



సెంగోల్ సెంగోల్!
నేను ఒంగోల్‌ను అడుగుతున్నా చెప్పు!
నిన్ను చేతబుచ్చుకున్న మోడీశ్వరుడు
నందీశ్వరుడు కాడు గదా చెప్పు?

సెంగోల్ సెంగోల్!
నేను ఒంగోల్‌ను ఆందోళన చెందుతున్నా చెప్పు!
ఇది లౌకిక హేతువాదాలపై
ఆధ్యాత్మిక హింస కాదని చెప్పు?

సెంగోల్ సెంగోల్!
నేను ఒంగోల్ ను ప్రశ్నిస్తున్నా చెప్పు!
ఇది ప్రజాస్వామ్యంపై
రాజరికం ప్రతిష్ట కాదని చెప్పు?

సెంగోల్ సెంగోల్!
నేను ఒంగోల్‌ను నిలేస్తున్నా చెప్పు!
ఇది ద్రావిడీశ్వరునిపై
ఉత్తరాది ఆర్యేశ్వరుని ఆధిక్యత కాదని చెప్పు!


సెంగోల్ సెంగోల్!
నువ్వు దక్షిణాదివైనా
కౌటిల్య రాజదండకు అలంకృతవయ్యావు
ఒంగోల్ నిన్ను ఎప్పుడో నిరాకరించింది సెంగోల్!

సెంగోల్ సెంగోల్!
లంకేశ్వరిని కాటేసిన గుర్తులకు
హిజాబులను నిషేధించిన గాయాలకు
కన్నడనాడు కసి తీర్చుకుంది
కిందబడ్డా మీదేనన్నట్టు పరివారం
నిను పూతమందుకుంది!

సెంగోల్ సెంగోల్!
మఠంలోనో గుళ్ళోనో
మ్యూజియంలోనో వుంటే వుండు
కానీ, ప్రజాస్వామ్య క్షేత్రంలో నీకు తావు లేదు
నేను ఒంగోల్‌ను చెబుతున్నా!
రాకు సెంగోల్! వెళ్లు సెంగోల్!


- కృపాకర్ మాదిగ

దండించేందుకా రాజదండం?



కె. శాంతారావు
9959745723

- ఏమేవ్! ఎక్కడ చచ్చావే... పేపర్లో, టీవీల్లో రాజదండంతో మన ప్రధాని మోడీగారి ఆ రాజవైభోగం చూస్తుంటే... వళ్ళు పులకరిస్తున్నది సుమా! నీవేంటి అసలు ఇదేమీ పట్టనట్టు ఇంటి పని, వంటపని అంటూ అలా అఘోరిస్తే ఎలా..?
- భావం - భాష తెలియని మీకూ, మీలాంటి వారికి మీ గొడవ. అది మా బోటి ప్రజలకు ఎందుకండీ..?
- ఆ... ఇది మా గొడవా..? మాకు భావం - భాష తెలియదా? ఎంతమటన్నావ్. శుభమా అని దేశంలోని అత్యున్నత పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టాను వేదపండితులు, వేదమంత్రాలు, హోమ గుండాల మధ్య ప్రధాని ప్రారంభిస్తే అది నీకు వేళాకోళంగా ఉందా..?
- కాకపోతే ఏమిటి? నా పనేదో నామానాన నేను చేసుకుంటూ ఉంటే ఎక్కడి చచ్చువే అంటూ ఆ పలకరింపు ఏమిటి? నేను చచ్చినదాన్నా..?
- ఆ... అదేదో ఊతపదం. దాన్ని పట్టుకుని బట్టతలకు మోకాలుకు ముడివేస్తావేమిటి?
- ముడి వేస్తున్నది మీరు. మీది ఊతపదం కాదు, ఆధిపత్యం. ఎదుటివారు ఏమన్నా, ఏం చేసినా పడి ఉంటారనే అహంభావం. రోజులు మారుతున్నాయనే స్పృహ అస్సలుండదు. ఎంత స్థాయిలో ఉంటే మాత్రం ఏం సుఖం. ఛాదస్త భూతం పట్టాక...
- ఎవరికీ నాకా... నా అధినాయకునికా..?
- ఇద్దరికీ. లేకపోతే ఏమిటండీ..? మన దేశ ప్రథమ పౌరురాలు అయిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పిలువక అదేం ప్రారంభమండీ..? ఇప్పుడు... మనది ప్రజాస్వామ్యదేశం. ఏదైనా ఓ చట్టం అమలుకావాలంటే పార్లమెంటు ఉభయ సభల ఆమోదంతో పాటు రాష్ట్రపతి సంతకం కూడా కావాల్నా... అక్కరల్లేదా..? ఉభయ సభల్ని ఉద్దేశించి మాట్లాడేదెవరండి. రాష్ట్రపతి కాక మరెవరున్నారు? అంతెందుకు మన భారత సైన్య త్రివిధ దళాల అధిపతి కూడా రాష్ట్రపతే కదా..! మరెందుకు పిలవలేదు? భర్తలేని మహిళగా వైధవ్యంతో ఉంది గనుక, మీరనుకునే ఆ శుభకార్యానికి రాకూడదని పిలవలేదా? చెప్పండీ..? ఇదంతా మీడియా కోడై కూస్తున్నా మీరు మాత్రం కిమ్మనరు. పైగా అదేదో గొప్పకార్యంలా ఊగిపోతారు పోతురాజులా?
- మళ్ళీ పోతురాజా..?
- సామెతలు ఊరికేరావండీ... తరతరాల అనుభవసారం. తిండికి తిమ్మరాజు.. పనికి పోతురాజు అంటే తిండి ఎక్కువ పని తక్కువ అని అర్థం.
- పన్నెండు వందల కోట్లు ఖర్చుపెట్టి పార్లమెంటు భవనం కట్టిస్తే అది గొప్పపని కాదా..?
- ఎవరి డబ్బు అది? ప్రజల డబ్బు. మీ సొంత డబ్బు కాదు కదా! సొంత డబ్బాకొట్టుకోవడానికి. గొప్ప పని అంటే ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ప్రజల్ని ఉత్సతులుగా తీర్చిదిద్దాలి. ఏ రోజు పత్రిక చూసినా ఎక్కడో ఓ చోట రైతుల ఆత్మహత్యలు, ఆడపిల్లలపై అత్యాచారాలు. అంతెందుకు? ఆ పార్లమెంటు భవనం ప్రారంభం రోజునే పాపం న్యాయం కోసం రోడ్డెక్కిన రెజ్లర్ల పోరాటాన్ని అత్యంత కర్కశంగా అణచివేసారే. కనీసం మీకు ఆడపిల్లలనే సానుభూతైనా ఉన్నదా... అరెరెరే...
- పార్లమెంటు భవనాన్ని ఓ పక్కన ఘనంగా ప్రారంభిస్తుంటే ఆ పక్కనే ఆందోళనలు చేయడం ఏమిటి? ప్రతిష్టపోదూ..?



- మీరూ... మీ ప్రతిష్ట మండిపోనూ... ఆందోళన చేయడం ప్రజాస్వామ్యపు హక్కండీ... అయినా వారేమైనా సామన్య మహిళలా... ఒలంపిక్స్‌లో మన భారత పతాకాన్ని అంతర్జాతీయంగా రెపరెపలాడించిన మల్లయోధులండీ... నెల రోజులుగా శిబిరం వేసుకుని నిరసన దీక్ష చేస్తుంటే... మీకు చీమకుట్టినట్టుగా కూడా లేదు. నేరం చేసినవాడు మాత్రం మీ పాలకుల అండతో దర్జాగా ఆ పార్లమెంటులోనే కూర్చుంటాడు. మా ఆడవాళ్ళు మాత్రం ఇలా రోడ్లపై పోలీసుల బూటుకాళ్ళ దెబ్బలు తినాలి.
- ఇదేంటి నీవు రెజ్లర్లతో కలసిపోతున్నావు?
- మీరు పాలకుల మోడీతో కలిసిపోతున్నప్పుడు నేను పోరాడే రెజ్లర్లతో కలసిపోవడం తప్పా..?
- ఆ... ఆ... అన్ని పోరాటాలు... నిరసనలతోనే తేల్చుకుంటారా ఏంటి?
- మరెలా..?
- కాస్త సర్దుబాట్లు, క్షమాపణలు చెప్పుకుంటూ ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయి గానీ...
- హమ్మయ్య, దారికొచ్చారు. అందుకే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ప్రాణత్యాగం చేస్తే... ఆ వీరుల్ని కాదని, ఎవరూ చెప్పని రీతిలో బ్రిటిష్ పాలకులకు క్షమాపణ చెప్పిన సావర్కర్ జన్మదినాన్నే పార్లమెంటు భవన ప్రారంభ రోజుగా మోడీ ఎంపిక చేసుకున్నారు. ఈ విషయాన్ని మీరు, మీ నోటితోనే ఇలా చెప్పారు. యద్భావం.. తత్ భవతి. భావాల కనుగుణంగానే పనులు. అందుకే రాజదండాన్ని కూడా అణచివేతకు చిహ్నంగా పట్టుకున్నారిప్పుడు.
- తప్పు చేసినవారిని రాజులు దండించరా ఏమిటి?
- అయ్యో! రాజులు కాలం పోయి చానాళ్ళయింది. జనం ప్రజాస్వామ్యంలోకి వచ్చారు. మీరింకా ఆ... ఆలోచనల్లోకి రాలేదు. ఏం చేస్తాం? కర్మ కర్మ అందుకే అన్నాడు ఐన్‌స్టీన్.... ముందుకు చూస్తూ వెనక్కి నడిచేవారు ఎప్పటికైనా వెళ్ళేది అజ్ఞాన గాథంలోకే అని. ఛాదస్తపు లోతులకూ అంతం ఉండదు సుమా. నా దౌర్భాగ్యం ఏమంటే... మీ అధినాయకులతో పాటు మీరూ అదేదారిలో నడవడం... •



చిన్నతనంలోనే పెండ్లి. నలుగురు పిల్లలకు తల్లి. మద్యానికి బానిసైన భర్త. అతను పెట్టే చిత్రహింసలు. పిల్లలకు తిండి పెట్టలేని దుస్థితి. ఇవన్నీ ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి. కానీ ఆశ కోల్పోలేదు. పిల్లల కోసం ఏదో చేయాలనే తపన. వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలనే కోరిక. వినూత్న ఆలోచనలకు నాంది పలికాయి. వ్యవసాయ వ్యవస్థాపకురాలిగా ఆమెను మార్చాయి. ఆమే కస్పూర్‌కు చెందిన దులోరిన్. ఈ మహిళా రైతు సాధించిన విజయాలేంటో మనమూ తెలుసుకుందాం...

గృహహింస నుండి బయటపడింది రైతుగా స్థిరపడింది

ముప్పై ఐదేండ్ల దులోరిన్ మార్కమ్, నిర్మల్ అనే వ్యక్తిని 16 ఏండ్ల వయసులో వివాహం చేసుకుంది. నూతన వధువు తన కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఛత్తీస్‌గఢ్‌లోని కస్పూర్ గ్రామానికి వచ్చింది. వరుసగా నలుగురు పిల్లలకు తల్లి అయ్యింది. భర్త మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ బాధ్యతల ఒత్తిడి ఆమెపై పడింది. వ్యసనం కారణంగా భర్త కూలి పనులు వెళ్లేవాడు కాదు. పైగా మత్తులో మునిగి భార్యను నిత్యం కొట్టేవాడు. ఆమె ఏడుస్తుంటే ఆనందించేవాడు. 2010లో నిర్మల్‌కు మానసిక ఆరోగ్యం క్షీణించింది. అందరూ అతన్ని "పిచి" అని పిలిచేవారు. "నేను నా భర్తను గొలుసులతో కట్టివేయాలి. లేకపోతే అతను మానసిక అనారోగ్యం కారణంగా నన్ను కొట్టేవాడు. అంతకన్నా నాకు వేరే మార్గం లేదు" అంటూ ఆమె తన బాధను పంచుకుంది. వైద్యం తర్వాత అతని ఆరోగ్యం కొంత మెరుగుపడింది. కానీ 2016లో పరిస్థితులు మరింత దిగజారాయి. ఆమెకు మరిన్ని కష్టాలు మొదలయ్యాయి.

వ్యవసాయం మెరుగుపరుకుంది

స్వయం సహాయ బృందం నిర్వహించే శిక్షణలో పాల్గొంది. అది ఆమెకు వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడంలో సహాయపడింది. సహజసిద్ధమైన ఎరువులు, జీవామృతం, బ్రహ్మాస్త్ర వంటి క్రిమిసంహారక మందుల తయారీ, వాడే విధానం గురించి తెలుసుకుంది. వాటిని తన సొంత పంటకు వినియోగించాలని నిర్ణయించుకుంది. అది వరి సాగులో ఎంతో ఉపయోగపడింది. ఆమెకే కాదు మిగిలిన వారికి కూడా మునుపెన్నడూ చూడని ఫలితాలను ఇచ్చింది. గతంలో కేవలం 36 క్వింటాళ్లు మాత్రమే పండే భూమిలో ఆ ఏడాది ఆమె భూమిలో 52 క్వింటాళ్ల వరి దిగుబడి వచ్చింది. అప్పటి నుండి దులోరిన్ తను సంపాదించిన ప్రతి అదనపు పైసాను పొదుపు చేసింది. తన పెద్ద కుమార్తెను 200 కి.మీ దూరంలో ఉన్న జగదల్‌పూర్‌లోని పాఠశాలలో చేర్పించింది. గత రెండేండ్ల తన కలను నెరవేర్చుకుంది. తన పిల్లలకు చదువు చెప్పించడంలో ఈ తల్లి ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ ఉండేది.



మార్పు తీసుకురావాలనే సంకల్పం

రాత్రిపూట భర్త చేతిలో దెబ్బలు తింటూనే పగలు ఎనిమిది మంది కుటుంబ సభ్యుల కడుపు నింపడం కోసం దులోరిన్ కష్టపడేది. తనకున్న కొద్దిపాటి భూమిలో వరిపంటను పండించేది. అలాగే దినసరి కూలీగా పని చేస్తూ జీవనం సాగించింది. కానీ ఆమె కష్టం కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. రోజంతా కష్ట పడి ఖాళీ కడుపుతో మంచంపై పడిపోయేది. 2020 ఆమె జీవితం ఓ మలుపు తిరిగింది. దులోరిన్ జీవితంలో కొంత మెరుగుదల ప్రారంభమయింది. ఆమె స్థానిక స్వయం సహాయ బృందంలో చేరింది. సామూహిక బలం, పురోగతి, సాధికారత కోసం ఆ బృందం పని చేస్తుంది. అప్పటి వరకు తాను పడిన కష్టాలతో ఉక్కిరిబిక్కిరి అయిన ఆమెకు కొంత ఊరట లభించింది. అతి తక్కువ కాలంలోనే విస్తృతమైన సంకల్పంతో నడిచే వ్యక్తిగా ఉద్భవించింది

కూరగాయలపై దృష్టి పెట్టి...

దులోరిన్ దూరదృష్టితో వరితో పాటు కూరగాయల సాగులో కూడా శిక్షణ తీసుకుంది. ఇది తనకు కొంత శ్రమ, ఖర్చుతో కూడుకున్నదని తెలుసు. కానీ ఇవన్నీ చేయడానికి ఆమెకు ఇంకా మూడు ఎకరాల భూమి ఉంది. అందుకే కొత్త సాగు పద్ధతులపై దృష్టి పెట్టింది. తన ఇంటి పక్కన ఉన్న చిన్న భూమిలో మిరప నారులను తయారు చేసి నాటింది. దీనికి ఆమె ప్రారంభ పెట్టుబడి రూ.1,800. అయితే రూ.9,600 సంపాదించింది. తర్వాత బీన్స్, పొద్దుతిరుగుడు విత్తనాలు కూడా నాటింది. ఏండ్ల తరబడి సాగుకు నోచుకోని భూమి ఇప్పుడు సారవంతమయింది. ఆమె తన జ్ఞానాన్ని తన వద్దనే ఉంచుకో లేదు. తన తోటి సభ్యులకు కూడా వీటిపై అవగాహన కల్పించింది. "నా పరిస్థితిని చూసి నా పిల్లలు ఎప్పుడూ చదువు మానేసి నాతో కలిసి పనికి వెస్తామని చెబుతుంటారు. కానీ నేను దానికి ఒప్పుకోను. నా పిల్లల చదువు కోసం నేను ఎంత కష్టమైనా చేస్తాను" అని ఆమె అంటున్నారు.

చేపల పెంపకం మొదలుపెట్టి...

ఆదాయం పెంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను చూసిన తర్వాత దులోరిన్ తన ప్రయత్నాలను ఆపలేదు. తన గ్రామంలో ఒక ఫామ్ పాండ్ ప్లాన్ చేయడాన్ని చూసింది. తను కూడా చేపల పెంపకం మొదలుపెట్టాలని భావించింది. వెంటనే తెలిసిన వారి భూమిని చెరువు తవ్వడానికి తీసుకుంది. ప్రధాన్ సిబ్బంది 2 కిలోల ఫింగర్లింగ్స్ (బేబీ ఫిష్) కొనుగోలు చేయడంలో ఆమెకు సహకరించారు. అలా పెంచిన చేపలను అమ్మి మంచి ఆదాయాన్ని పొందుతుంది. ఇవన్నీ ఆమె ఎవరి సహాయం లేకుండా తనే స్వయంగా నిర్వహిస్తుంది. నిర్మల్ ఇప్పటికీ దాదాపు రోజంతా గొలుసులతో కట్టి వేయబడి ఉంటాడు. వివిధ వ్యవసాయ పద్ధతులను నేర్చుకోవడానికి ఆమె ఇతర గ్రామాలకు వెళ్లేది. అక్కడ చూసి బిందు సేద్యం పద్ధతులను నేర్చుకుంది. దానితో కస్పూర్‌లోని 2.5 ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చింది.

శిక్షణ కోసం పిలుస్తున్నారు

పెండ్లి తర్వాత ఇంత సంపాదిస్తానని దులోరిన్ ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడు ఆమె వ్యవసాయ వ్యవస్థాపకురాలు. అన్ని గ్రామాల నుండి ప్రజలు తమ పంటలను మెరుగుపరచడానికి, వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడానికి శిక్షణ కోసం ఆమెను పిలుస్తున్నారు. "ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ శిక్షణ ద్వారా కూడా నేను కొంత డబ్బు సంపాదిస్తున్నాను" ఆమె గర్వంగా చెబుతుంది. సంపాదించడం మొదలుపెట్టిన తర్వాతనే కుటుంబ సభ్యులు తనను గౌరవించే వారని ఆమె అంటున్నారు.



చేపల చెరువు వద్ద...

ఆశ ఎప్పుడూ కోల్పోలేదు

భర్త మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం ఆమె తదుపరి లక్ష్యం. ఇప్పటివరకు ఆమె కోసం అతను ఏమీ పని చేయలేదు. ఆమె ప్రయత్నాలు, విజయాల్లో అతని భాగస్వామ్యం ఏమీ లేదు. కానీ దులోరిన్ ఎప్పుడూ ఆశ కోల్పోలేదు. అతనికి తగిన సహాయం, చికిత్స అందించి పూర్తిగా నయమయ్యేలా చూడాలని బలంగా కోరుకుంటుంది. భర్త విషయంలో కూడా ఆమె విజయం సాధించాలని నిశ్చయించుకుంది.



బరువు తగ్గాలంటే...

సాధారణంగా బరువు తగ్గాలంటే పూర్తిగా తిండి మానేయాలనుకుంటారు చాలా మంది. రోజూ మనం తీసుకునే ఆహారాన్ని ఒక క్రమపద్ధతిలో తీసుకుంటే శరీరంలో కొవ్వును తేలికగా కరిగించు కోవచ్చు. రోజుకు మూడుసార్లు తినే ఆహారాన్ని అయిదు లేదా ఆరు భాగాలుగా విడగొట్టి కొంచెం కొంచెంగా తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు పరిశోధకులు.

- పీచు అధికంగా ఉండే ఆహారం తీసుకున్నట్లయితే జీర్ణ ప్రక్రియ నెమ్మదిగా జరిగేలా చేస్తుంది. దాని వల్ల చాలాసేపు కడుపు నిండుగా ఉంటుంది. అందుకే భోజనం చేసిన ప్రతిసారి ఐదు గ్రాముల పీచు ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు పోషకాహార నిపుణులు.
- పొట్టుతో సహా ఏవైనా చిరుధాన్యల్ని ఒక కప్పు అయినా తప్పనిసరిగా తినాలట. అలాగే ఒక కప్పుడు గింజలను తీసుకోవాలి. దీని వల్ల సుమారు ఐదు గ్రాముల పీచు పదార్థం లభిస్తుంది. కాబట్టి వీటిని ఉదయం టిఫిన్ తినటానికి ముందు తినటం మంచిది.
- ఆపిల్, నారింజ, అరటిపండు, జామలలో ఏదో ఒకటి, పల్లీలు, క్యారెట్, కీర వంటివి మధ్యాహ్న ఆహారంలో చేర్చాలి. భోజనానికి ముందు క్యారెట్, కీరా భోజనం తర్వాత పండు తింటే సుమారు 4 గ్రాముల దాకా పీచుపదార్థం లభించినట్టే. ముడి బియ్యంలో కూడా పీచుపదార్థం లభిస్తుంది. కాబట్టి తినగలిగే వాళ్ళు ముడిబియ్యం అన్నం తినటం మంచిది.
- ఆకుకూరలలో ఇనుము సమృద్ధిగా లభిస్తుందని మనందరికి తెలుసు. ప్రపంచం మొత్తం మీద 'రక్తహీనత' భారతీయ స్త్రీలలోనే చాలా ఎక్కువ అని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. 'ఇనుము' లోపం దీనికి ప్రధాన కారణం. అయితే ఈ సమస్య తీవ్రమై ఇతర దుష్ప్రభావాలు జరిగే దాకా గుర్తించటం లేదని పేర్కొంటున్నారు.

నకిలీ కరెన్సీ హల్‌చల్

ముంబయి : దేశంలో నకిలీ కరెన్సీ నోట్లు హల్‌చల్ చేస్తున్నాయి. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2,25,769 దొంగ నోట్లు పట్టుబడ్డాయి. ఇందులో అత్యధికంగా రూ.500 నోట్లు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2022-23నకు సంబంధించి ఆర్‌బీఐ తన వార్షిక రిపోర్ట్‌ను మంగళవారం విడుదల చేసింది. దీనిలో నకిలీ కరెన్సీ, నగదు చెలామణీ, వృద్ధిరేటు, కరెన్సీ ముద్రణ వ్యయం, ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ తదితర వివరాలను వెల్లడించింది. ఆ అంశాలు.. "అన్ని నోట్ల కంటే రూ.500 నోట్లలోనే ఎక్కువ నకిలీలు చలామణీలో ఉన్నాయి. 2022-23లో మొత్తం 91,110 నోట్లను గుర్తించారు. ఇంతక్రితం ఏడాది రూ.500 దొంగ నోట్లతో పోల్చితే.. 14.4 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. అదేవిధంగా 78,699 రూ.100 నోట్లు, 27,258 రూ.200 నోట్లు, 9,806 రూ.2వేల నోట్లను గుర్తించింది. స్థూలంగా రూ.10, రూ.100, రూ.2000 డినామినేషన్లలో గుర్తించిన నకిలీ నోట్లు 11.6శాతం తగ్గాయి. 2021-22లో బ్యాంకింగ్ రంగంలో గుర్తించినవి మొత్తం 2,30,971 నకిలీ కరెన్సీ నోట్లు కాగా, 2022-23 సంవత్సరంలో 2,25,769 నోట్లకు మాత్రమే తగ్గింది. మొత్తం నకిలీ కరెన్సీ నోట్లలో ఆర్‌బిఐ వద్ద 4.6 శాతం, ఇతర బ్యాంకుల్లో 95.4 శాతం చొప్పున గుర్తించడం జరిగింది' అని రిజర్వ్ బ్యాంక్ తన రిపోర్ట్‌లో తెలిపింది.

డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నగదు చలామణీనే ఇప్పటికీ

రారాజులా కొనసాగుతోంది. '2022-23లో కరెన్సీ నోట్ల చలామణి విలువ 7.8శాతం పెరిగింది. ఇదే సమయంలో నోట్ల సంఖ్య 4.4శాతం పెరిగింది. చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీ నోట్ల విలువలో రూ.500, రూ.2,000 నోట్ల విలువే 87.9 శాతం. ఇది 2021- 22లో 87.1 శాతంగా ఉంది. 2023 మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న నోట్లలో సంఖ్యాపరంగా రూ.500 నోట్లే ఎక్కువ. వీటి వాటా 37.9 శాతం. తర్వాత రూ.10 నోట్లు 19.2 శాతం ఉన్నాయి. మొత్తం 5,16,338 లక్షల రూ.500 నోట్లు చలామణిలో ఉన్నాయి. వీటి విలువ రూ.25,81,690 కోట్లుగా ఉంది. రూ.2,000 నోట్లలో 4,55,468 లక్షలు చలామణిలో ఉన్నాయి. వీటి విలువ రూ.3,62,220 కోట్లుగా ఉంది. 2021-22తో పోలిస్తే చలామణిలో ఉన్న రూ.2 వేల నోట్ల సంఖ్యలో 1.3 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. రూ.10.69 కోట్ల హోల్‌సేల్ ఈ-రూపీలు, రూ.5.70 కోట్ల రిటైల్ ఈ-రూపీలో చలామణీలో ఉన్నాయి. నోట్ల ముద్రణ కోసం 2022- 23లో రూ.4,682.80 కోట్లు వ్యయం అయ్యింది. ఇంతక్రితం ఏడాది ఇది రూ.4,984.80 కోట్లు ఖర్చు అయ్యింది' అని ఆర్‌బీఐ వెల్లడించింది.

రూ.2.30 లక్షల కోట్ల బంగారం నిల్వలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో భారత వృద్ధి పెరగనుందని ఆర్‌బీఐ వార్షిక రిపోర్ట్‌లో అంచనా వేసింది. కమోడిటీ ధరలు, ద్రవ్యోల్బణం తగ్గుతున్నందున్న జీడీపీకి మద్దతు లభించనుందని పేర్కొంది. 2022-23లో అధిక ఆదాయం ద్వారా ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ 2.5 శాతం పెరిగి రూ.63.45 లక్షల కోట్లకు చేరింది. ఇది ఇంతక్రితం ఏడాది రూ.61.90 లక్షల కోట్లుగా ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ ఆదాయంలో 47.06 శాతం వృద్ధి చోటుచేసు కోగా.. వ్యయం 14.05శాతం పెరిగింది. మిగులు నిధులు 188 శాతం వృద్ధితో రూ.87,416 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం 2021-22లో రూ.30,307 కోట్ల మిగులు నిధులు చోటు చేసుకున్నాయి. మిగులు నిధుల నుంచే కేంద్రానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ఆర్‌బీఐ వద్ద మొత్తం బంగారం 760.42 మెట్రిక్ టన్నుల నుంచి 794.63 మెట్రిక్ టన్నులకు చేరింది. విలువ పరంగా 17.20 శాతం పెరిగి రూ.2,30,733.95 కోట్లకు చేరింది. ఇది 2022 మార్చి ముగింపు నాటికి రూ.1,96,864.38 కోట్లుగా ఉంది.

లోక్‌సభ పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

కలిగిన ఆయా రాష్ట్రాలు 35శాతం జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయని వివరించారు. జాతీయ ఆర్థికాభివద్ధికి, దేశాభివద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్న ఈ రాష్ట్రాలు అసంబద్ధమైన లోక్‌సభ డిలిమిటేషన్ విధానంతో భవిష్యత్తులో తమ ప్రాధాన్యత కోల్పోకూడదని అభిప్రాయపడ్డారు. తమ ప్రగతిశీల విధానాలకు లబ్ధి పొందాల్సిన చోట తీవ్రమైన అన్యాయానికి గురవుతున్న ఆయా రాష్ట్రాలు తమ వాణిని వినిపించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా జరుగుతున్న అన్యాయంపై నాయకులు, ప్రజలు గళమెత్తాలని పిలుపునిచ్చారు.

కేంద్ర ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

రాఘవ్ చద్దాలతో కూడిన బృందం సమావేశమైంది. ఢిల్లీలో పరిపాలనా సేవల నియంత్రణపై కేంద్రం ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్‌కు సీపీఐ(ఎం) తమ మద్దతు తెలిపింది. అనంతరం కేజ్రీవాల్‌తో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఏచూరి మాట్లాడారు. ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక అధికారాలను రద్దు చేసేందుకు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తామని తెలిపారు. 'కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను మేం ఖండిస్తున్నాం. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఇది కోర్టు ధిక్కారమే. కేంద్ర ప్రభుత్వం ఫెడరలిజంపై దాడి చేస్తున్నది. పార్టీలో అంతర్గత సమస్యలను పక్కనబెట్టి రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ముందుకు రావాలని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఏచూరి అన్నారు. 'రాష్ట్రాల హక్కులపై అనేక దాడులు జరుగుతున్నాయి. ఆర్డినెన్స్ తీసుకురావడం ఒక దౌర్జన్య మార్గం. దీనికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. బీజేపీయేతర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు మోడీ ప్రభుత్వం ఎంతకైనా తెగించవచ్చు' అని ఏచూరి చెప్పారు.

ఇప్పటికైనా నిరంకుశ ప్రభుత్వాన్ని అడ్డుకోకపోతే ఫాసిస్టుగా తయారవుతారని కూడా ఏచూరి గుర్తుచేశారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఢిల్లీకి ఏం జరిగిందో రేపు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, వామపక్ష పాలిత కేరళ, ఇతర ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లోనూ జరగవచ్చని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మూల స్తంభాలపైన, దాని సమాఖ్య నిర్మాణంపైన దాడి చేస్తున్నదనీ ఆయన అన్నారు.

సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం : కేజ్రీవాల్

దేశ రాజధాని ప్రజలకు అండగా ఉంటానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కేంద్రం ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఢిల్లీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ(ఎం) నిర్ణయించిందని కేజ్రీవాల్ తెలిపారు. సీపీఐ(ఎం) మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ అంశంపై అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి తమకు మద్దతు ఇస్తాయని ఆశిస్తున్నామన్నారు. రాజ్యసభలో బీజేపీకి మెజారిటీ లేదని, ప్రతిపక్షాలు ఏకమైతే బిల్లు ఆమోదం పొందదని స్పష్టంచేశారు. తనను కలిసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధంగా ఉన్నారా? అనేది సమస్య కాదనీ, ఇది ప్రజాస్వామ్య సమస్య అని కేజ్రీవాల్ అన్నారు. 'కేజ్రీవాల్‌ను మర్చిపోవాలని, అయితే ఢిల్లీ ప్రజల పక్షాన నిలబడాలని నేను వారికి విజ్ఞప్తి చేస్తున్నాను, బీజేపీతో ఉంటారా? ఢిల్లీ ప్రజలతో ఉంటారా? వారు నిర్ణయించుకోవాలి' అని తెలిపారు. ఈ విషయమై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌లను కలిశానని చెప్పారు. ఈ ఆర్డినెన్స్ తనకు మాత్రమే సంబంధించినది కాదని ఢిల్లీ ప్రజలకు, దేశం మొత్తానికి సంబంధించినదని కేజ్రీవాల్ తెలిపారు.

హింసకు కేంద్రమే కారణం

(మొదటిపేజీ తరువాయి)

మీతీల ప్రాణాలు, ఆస్తులను పరిరక్షించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడింది. ఈ మేరకు ఎంఎస్‌ఏడీకి చెందిన విద్యార్థులు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మెమొరాండం సమర్పించారు. రాష్ట్రంలో సుస్థిర శాంతి స్థాపనకు కృషి చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో పెచ్చరిల్లుతున్న హింసాకాండ నేపథ్యంలో అమిత్ షా సోమవారం సాయంత్రం మణిపూర్ చేరుకొని గవర్నర్‌తో, రాష్ట్ర మంత్రులతో సమావేశమయ్యారు. కేంద్ర భద్రతా దళాల పర్యవేక్షణలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ఉద్దేశపూర్వకంగా జాతి ఘర్షణలను ప్రేరేపించాయని విద్యార్థులు ఆరోపించారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని ముక్కలు చేసేందుకు ఈ శక్తులు కుట్ర పన్నాయని మండిపడ్డారు. ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల వలలో పడవద్దని రాష్ట్ర ప్రజలను కోరారు. మణిపూర్ ఐక్యత, సమగ్రతలకు భంగం కలిగించేందుకు జరుగుతున్న మతపరమైన ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. నెల రోజులుగా రాష్ట్రం హింసతో అట్టుడుకుతుంటే కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పైగా జాతుల మధ్య హింసను ప్రేరేపించిందని చెప్పారు. రాష్ట్రంలో సాయుధ సిబ్బంది తగిన సంఖ్యలో ఉన్నప్పటికీ హింస చల్లారలేదని గుర్తు చేశారు. విధి నిర్వహణలో సాయుధ దళాలు ఘోరంగా విఫలమయ్యాయని, ఇప్పటికే రెండు జాతులకు చెందిన 40 వేల మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు.

ఆకలి చావుల నుంచి అభివృద్ధి వైపు...

(మొదటిపేజీ తరువాయి)

నేడు అభివృద్ధిలో దూసుకుపోతోంది. 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటాల ఫలితాలు ఒక్కొక్కటి ప్రజలకు చేరువవుతున్నాయి. దశాబ్ది ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యే విధంగా కార్యక్రమాలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

14 ఏండ్ల సుదీర్ఘ పోరాట అనుభవాలు ఏంటి ? రాష్ట్ర ఏర్పాటు ఫలితాలు వస్తున్నాయా ?

రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన 14 ఏండ్ల ఉద్యమం, చేసిన త్యాగాల ప్రతిఫలాలు మన కండ్లముందే కనిపిస్తున్నాయి. ఎంతో మంది యువత బలిదానాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అనుభవంతో సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలేమిటి ? వ్యవసాయ రంగాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే కోణంలో పరిశోధనాత్మక చర్చలు చేసి పరిష్కారాలు కనుగొన్నారు. సాగు సక్రమంగా జరగాలంటే సాగునీరు కావాలి. అందుకే ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేశాము. గోదావరి మీద కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి, కృష్ణా నది మీద పాలమూరు-రంగారెడ్డి పథకానికి శ్రీకారం చుట్టాము. మూడేండ్లలో కాళేశ్వరాన్ని పూర్తి చేశాం త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ద్వారా నీటిని పంటపొలాలకు మళ్లిస్తాము. గతంలో కాలువలలో మోటార్లు వేసి నీటిని మళ్లించడంపై ఆంక్షలుండేవి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే శిస్తును రద్దు చేయడంతోపాటు మోటార్లపై వున్న నిషేధాన్ని ఎత్తివేశాము. 26 వేల చెరువులను, కుంటలను పునర్నిర్మాణం చేయడం ద్వారా ప్రాజెక్టులు ఎత్తి పోతల పథకాల పరిధిలో వున్న కాల్వలకు అనుసంధాన్ని చేసి సాగునీటిని ఇచ్చాము.

వలసలు, ఆకలి చావులు ఆగాయా ?

వర్షాలు లేక, సాగు నీరు రాక, బోరు బావుల్లో నీరు లేక సాగు కుంటుపడేది. విద్యుత్తు సక్రమంగా వుండకపోవడం వల్ల పంటలు ఎండిపోయేవి. దీనితో ఇక్కడ రైతులు సాగును వదిలి ముంబయి, మహారాష్ట్ర, దుబాయ్ వంటి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసలు వెళ్లేవారు. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మస్థైర్యం కోల్పోయిన రైతులకు భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యంగా సాగుకు పెట్టుబడి కోసం రైతుకు ఇబ్బందులు లేకుండా రైతుబంధు కింద ఎకరాకు 10 వేలు అందిస్తున్నారు. ఏ కారణం చేతనైనా రైతు చనిపోతే రైతు భీమా ఏర్పాటు చేశారు. అన్నం పెట్టే రైతు యాచించే స్థాయి నుండి శాసించే స్థాయికి రావాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు 65 వేల 190 కోట్లు నేరుగా రైతుల ఖాతాలలోకి బదిలీ చేయడం జరిగింది. ప్రభుత్వమే పూర్తిగా ప్రీమియం చెల్లించే రైతుబీమా పథకం మూలంగా రైతు ఏ కారణం చేత మరణించినా పది రోజులలోపు ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుంది. 2018 ఆగస్టు 15న ప్రారంభించిన ఈ పథకం కింద ఇప్పటి వరకు 1,02,124 మంది రైతు కుటుంబాలకు రూ. 5106.20 కోట్ల బీమా పరిహారం అందించాం.



ఉచిత విద్యుత్తు, సాగునీటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం బోరుమోటార్ల మీదనే ఆధారపడింది. అందుకే వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు అందించాలని నిర్ణయించి 2018 జనవరి 1 నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. మొత్తం తెలంగాణలో 26 లక్షల పైచిలుకు వ్యవసాయ మోటార్లకు ఉచిత కరెంటు పథకం విజయవంతంగా అమలవుతూ ఐదేండ్లు పూర్తి చేసుకున్నది. దేశంలోనే కాదు ప్రపంచంలోనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ట్రాన్స్‌కో, డిస్కం వ్యవస్థలను పటిష్టం చేసేందుకు రూ.37,911 కోట్లు ఖర్చు చేశారు. ట్రాన్స్‌కోలో అతిముఖ్యమైన 400 కేవీ సబ్‌స్టేషన్లను 2 నుంచి 23కు పెంచారు. 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 99కి, ఈహెచ్‌టీ లైన్ల పొడవును 16,379 సర్క్యూట్ కిలోమీటర్ల నుంచి 27,573 సర్క్యూట్ కిలోమీటర్లకు పెంచారు. డిస్కంల పరిధిలో 33 కేవీ సబ్‌స్టేషన్లను 2,138 నుంచి 3,190కి పెంచగా, ఎల్టీ లైన్ల పొడవును 4.89 లక్షల కిలోమీటర్ల నుంచి 6.67 లక్షల కిలోమీటర్లకు పెంచారు. రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 7,778 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా.. గత డిసెంబరు నాటికి దాన్ని 18,829 మెగావాట్లకు చేర్చారు. పులిచింతలలో 30 మెగావాట్ల నాలుగో యూనిట్, కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్లాంట్, 270 మెగావాట్ల సామర్థ్యంతో ఉండే నాలుగు యూనిట్ల భద్రాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్ (1,080 మెగావాట్లు)ను నిర్మించి ప్రారంభించాం. దీనికి సింగరేణి 1,200 మెగావాట్లు జత చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి 74 మెగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్తును 5,117 మెగావాట్లకు తీసుకుపోయాం. యాదాద్రిలో 4,000 మెగావాట్లు సహా మరో 8,705 మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. రాష్ట్రంలో వినియోగించే విద్యుత్తులో 33 శాతం వ్యవసాయానికే వినియోగిస్తుండడం వ్యవసాయం పట్ల, రైతాంగం పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

సాగు విస్తీర్ణం పెరిగిందా?

సాగునీరు, ఉచిత కరంటు, రైతుబంధు, రైతుభీమా పథకాలతోనే ఆగిపోకుండా సకాలంలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నకిలీ విత్తనాలపై తొలిసారి పీడీ యాక్టు ప్రయోగించి రైతులు నష్టపోకుండా అరికట్టడం, పంటల నమోదు, పత్తి సాగు, పప్పు గింజలు, నూనె గింజల సాగు వైపు రైతులను ప్రోత్సహించడం, రైతులు పండించిన పంటలను వందశాతం కనీస మద్దతుధరకు సేకరించడం వంటి చర్యలతో తెలంగాణ ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలిచింది. 2014 నాటికి కోటీ 31 లక్షల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం 2022-23 నాటికి అది 2 కోట్ల 20 లక్షల ఎకరాలకు పెరిగింది. 2014-15 నాటికి 68 లక్షల టన్నులు మాత్రమే ఉన్న వరి ధాన్యం ఉత్పత్తి 2022-23 నాటికి రికార్డు స్థాయిలో సుమారు 2.70 కోట్ల టన్నులకు చేరుకున్నది. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు రూ. లక్షా 27 వేల కోట్లతో, 699.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, రూ.10,719 కోట్లతో ఇతర పంటలను సేకరించడం జరిగింది. కేసీఆర్ మార్గనిర్దేశనంలో నేడు తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా నిలిచింది.

సాగునీటి, ఇతర పథకాల కోసం ఇంతవరకు ఎన్ని కోట్లు ఖర్చు చేశారు :?

సాగునీటి ప్రాజెక్టుల కోసం ఇప్పటివరకు సుమారు రూ.1.59 లక్షల కోట్లు, విద్యుత్ మౌళిక సదుపాయాల కోసం రూ. 37,911 కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయానికి 24 గంటల కరంటు కోసం ఏటా రూ.10,500 కోట్లు ఖర్చు పెట్టాం. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు రెండు విడతలలో రూ.17,351.47 కోట్లు రుణమాఫీ, రూ. 5349 కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటలు పునరుద్ధరించి, 8.93 టిఎంసి ల సామర్థ్యంతో 15.05 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, ప్రతి 5 వేల ఎకరాలకు ఒక ఏఈఓ, ఒక్కొక్కటి రూ.22 లక్షల వ్యయంతో రూ. 572 కోట్లతో 2601 రైతు వేదికల నిర్మాణం, రూ. 928.68 కోట్లతో 39.98 లక్షల క్వింటాళ్ల రాయితీపై వివిధ రకాల పంటల విత్తనాలు సరఫరా, 2014-15 నాటికి 39.01 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాంలు 73.80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు, వ్యవసాయయాంత్రీకరణలో భాగంగా, ఇప్పటివరకు మొత్తం రూ.963.26 కోట్లను వెచ్చించి 6.66 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చడం ఇలా మొత్తం వ్యవసాయరంగం సమగ్ర స్వరూపం మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన ఖర్చు రూ.4.50 లక్షల కోట్లు .

వ్యవసాయ రంగం ద్వారా అనుబంధ రంగాలు ఎలా అభివృద్ధి చెందుతాయి ?

ప్రధానంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అనుబంధ రంగాలైన మిల్లులు, ఆహార ఉత్పత్తి సంస్థలు, ఆహార అమ్మకాలు కొనుగోళ్లు చేసే రంగాలలో ఉపాధి లభిస్తుంది. వ్యవసాయం వర్ధిల్లాలి, అందరి ఆకలి తీర్చే రైతన్న ఆనందంగా వుండాలి అనేది ముఖ్యమంత్రి ఆకాంక్ష. 60 ఏండ్ల ఆకాంక్ష తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాదు, కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా ప్రపంచానికి దిక్సూచిలా నిలుపగలిగిన అరుదైన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్. అశోకుడు చెట్లు నాటించెను, కాకతీయులు చెరువులు నిర్మించెను అన్నది మనం చదువుకుంటున్న చరిత్ర. భవిష్యత్తులో ఈ రాష్ట్రంలో నీళ్లన్నా, చెరువన్నా, పంటన్నా ముఖ్యమంత్రి కేసీఆరే గుర్తుకు వస్తారు.

ముస్తాఫానగర్‌లో 'మీ కోసం పోలీస్'

నవతెలంగాణ-గంభీరావుపేట :

గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సిఐ మొగిలి గ్రామ ప్రజలతో 'మీకోసం పోలీస్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉద్యోగ ప్రకటనలు చూసిమోసపోవద్దని, ఎవరైనా బాధితులు సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, వీపీఓ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది శంకర్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీ.ఐ.మొగిలి

పశుమిత్రులకు కనీస వేతనం చెల్లించాలి

నవతెలంగాణ - కరీంనగర్ : పశుమిత్రలకి కనీస వేతనం నిర్ణయం చేయాలని జిల్లా డీఆర్‌డీఏ ఆఫీస్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ పశుమిత్రల వెట్టిచాకిరీ రద్దు చేసి, కనీస వేతనం జీఓ60 ప్రకారం రూ.15600 ఇవ్వాలని, ఎస్ఈఆర్ పి డిపార్ట్మెంట్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పోరాటం ద్వారానే సాధ్యం అవుతాయన్నారు. మేడే స్ఫూర్తితో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2500మంది ఆడపడుచులు 8ఏండ్లుగా మూగజీవాలకు ఉచితంగా పశుమిత్ర కార్మికులు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వీరికి 8ఏండ్లుగా ఒక రూపాయి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుదని తెలిపారు. చాలామంది చదువుకున్న పేద మహిళలు, నైపుణ్యం గల వృత్తిని చేపట్టి ఒక రూపాయి వేతనం పొందకపోవడం చాలా దుర్మార్గం అన్నారు. వీరిని సెర్ప్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల గుర్తించాలని, కనీస వేతనం నిర్ణయం చేయాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్, గ్లోజులు, మెడికల్ కిడ్స్, ప్రయాణ ఖర్చులు, కృత్రిమ గర్భధారణ శిక్షణ అందరికీ ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి ఎలక్ట్రిక్ బైకులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అందరికీ పనులు కల్పిస్తున్న కెసీఆర్ పశుమిత్రులకి కనీస వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్త ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షులు జాడి లలిత, నాయకులు భూమా అనూష, లక్ష్మి, రేణుక, లిఖిత, కల్పన, రమ, స్వప్న, పద్మ, పూజ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వడం వల్లనే ఈ దశాబ్ది ఉత్సవాలు

- రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కావస్తున్నా ప్రజల ఆకాంక్షలు నెరవేరక పోవడం బాధాకరం
- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ :

తెలంగాణ కళ సాకారమై దశాబ్దం కావస్తున్నా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలను గుర్తించి 60ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, సోనియా గాంధీది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి నిధులు రాలేదని పదే పదే చెప్పే మంత్రి గంగుల కమలాకర్‌కు మన నిధులు మనకు రావడానికి కారణం కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వడం వల్లనే అని చెప్పలేక పోతున్నారన్నారు. తెలంగాణ ఏర్పడి దశాబ్దం కాలం గడుస్తున్నా ఇప్పటికీ యువకులకు ఉద్యోగాలు రాలేదు,విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వలేదు, కాంట్రాక్ట్ అవుట్ సోర్స్ ఉద్యోగులు పర్మినెంట్ కాలేదు, ఉద్యోగస్తులకు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదు. మరోవైపు టీఎస్‌పీఎస్ నోటిఫికేషన్ ఇచ్చి పేపర్లు లీకేజీచేసి నిరుద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతీశారన్నారు. బిసి, మైనారిటీ నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. మిగులు బడ్జెట్ తో ఏర్పడిన రాష్ట్రాన్ని అయిదు లక్షలకోట్ల అప్పులు చేసి చివరికి జీతాలు పెన్షన్లు ఎప్పుడు పడతాయని ఎదురు చూసే పరిస్థితి తీసుకు వచ్చిన ఘనత ఈ బిఆర్ఎస్ ప్రభుత్వానిది అని నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు.అకాల వర్షాలతో రైతు నష్టపోతే ఇంతవరకు నష్ట పరిహారం చెల్లించకపోగా సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు.ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫల మైందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో ఎండి తాజ్,శ్రవణ్ నాయక్,గుండాటీ శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ అఖిల్,దన్న సింగ్,జీడీ రమేష్,షేక్ షేహెన్ష,ఎండి చాంద్, పొరండ్ల రమేష్,ముక్క భాస్కర్,షబానా మహమ్మద్,ఊరడి లత,నెన్నెల పద్మ,లయక్,నలిమొద్దిన్,బొబ్బిలి విక్టర్, నదిమ్,కీర్తి కుమార్,సీరాజ్,మామిడి సత్యనారాయణ రెడ్డి,ఇమామ్,జీలకర రమేష్,కమల్,అజ్మత్,కొట్టే ప్రభాకర్,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ కాలనీలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ :మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో గ్రామ సర్పంచ్ మీసాల అంజయ్య ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భం గా వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నుస్తులాపూర్ సహకార సంఘం చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి అక్బర్, ఉప సర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు పారునంది జలపతి, ఈజీఎస్ ఏపీవో రాజు, ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్, ఐకెపి సిసిలు రవి, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, వార్డు సభ్యులు అలువాల సంపత్, అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు కిన్నెర అంజి, దళిత సంఘ నాయకులు తూర్పాటి అజయ్,అల్వాల అనిల్, బూడిద రాజయ్య,బూడిది ఎల్లయ్య జితేందర్, అనిల్, మహేష్, రాజు అజయ్, శ్రీను,సాగర్,నరేష్, పవన్ పాల్గొన్నారు.

మహిళలు హెల్త్ డైరీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మహిళలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి హెల్త్ డైరీ యాప్ ను అందరూ డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి సూచించారు. కరీంనగర్ రూరల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ సెక్టార్ పరిధిలో ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ యాప్‌లో గర్భిణీ, బాలింతలు, కిషోర బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా ఉన్నాయని చెప్పారు. గర్భిణీలు బాలింతలు మరియు పిల్లల యొక్క బరువులు,ఆహారపు అలవాట్లు పోషకాహారం,వ్యక్తిగత పరిశుభ్రతల గురించి వివరించారు. పోషణలోపంతో బాధపడుతున్న పిల్లల వివరాలు వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. బాలామృతం పిల్లలకు ఇస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాలామృతం ప్లస్ యొక్క విశిష్టత గురించి తెలియజేశారు. సిడిపిఓ సబితా కుమారి మాట్లాడుతూ పోషల లోపం ఉన్న పిల్లల పెరుగుదల గురించి వివరించారు. అంగన్వాడీలో అందించే సేవలు అందరు వినియోగించు కోవాలని పిల్లల్లో లోప పోషణ తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద, ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, ఏసిడిపిఓ అరవింద,డిఐవో సాజీద, మెడికల్ ఆఫీసర్ ప్రణవ్, డాక్టర్ సుశ్రుత, సూపర్వైజర్ శ్రీలత, పద్మ, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు,రోమిలా ,బ్లాక్ కోఆర్డినేటర్ రవీందర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ చిలుక రవీందర్

నవతెలంగాణ - చొప్పదండి :రాజ్యాంగంలో పొందు పరిచిన పౌరహక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్పంచ్ గుంట రవి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ చిలుక రవీందర్ విచ్చేసి మాట్లాడుతూ అంటరానితనాన్ని విడనాడి కులమతాలకు అతీతంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగిరెడ్డి వెంకట్ రామ్‌రెడ్డి, నయాబ్ తహసీల్దార్(ఎపిక్) కళావతి, ఆర్ఐ అరుణ్ కుమార్, ఏఎస్ఐ రాజయ్య, కార్యదర్శి కిషోర్, వైద్య, అంగన్‌వాడీ, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

ప్రతి ప్రభుత్వ కార్యక్రమ విజయవంతంలో ఆర్పీల పాత్ర కీలకం

- కంటి వెలుగు విజయవంతానికి కారకులు రిసోర్స్ పర్సన్స్
- ఆర్పీల గౌరాన్ని పెంచింది తెలంగాణ ప్రభుత్వం
- పిల్లల బంగారు భవిష్యత్తువు కెసిఆర్ ప్రభుత్వం రావాలి
- బీసీ సంక్షేమం, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్ :

ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమం విజయవంతంలో రిసోర్స్ పర్సన్ ల పాత్ర కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళ రిసోర్స్ పర్సన్స్, వివో లకు తన సొంత ఖర్చుతో చీరలు పంపిణీ చేసిన మంత్రి గంగుల కమలాకర్. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళ దినోత్సవం పురస్కరించుకొని సోదరుడిగా ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు221మందికి ఇందులో 169 మంది మహిళా రిసోర్స్ పర్సన్స్,52 వివో లకు చీరలను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు విజయవంతంలో రిసోర్స్ పర్సన్స్‌ల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు రిసోర్స్ పర్సన్స్‌కు రూ.200 గౌరవ వేతనం ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రూ.4000 పెంచిందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని, రిసోర్స్ పర్సన్స్‌ల గౌరవాన్ని తెలంగాణ ప్రభుత్వం పెంచిందన్నారు. సమైక్య పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నోచక ఆమడ దూరంలో నిలిచిందని, వారి పాలనలో గుంతల రోడ్లు ఉండేవని, తలాపున మానేరు ఉన్న తాగునీటి కోసం ట్యాంకుల వద్ద బిందెలతో నిలబడ్డారని, కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు ఉండేవన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక స్వయం పాలనలో ఈ కష్టాలన్నింటికీ కెసిఆర్ చెక్ పెట్టారని, నగరంలో కోట్లాది రూపాయల వెచ్చించి సుందరమైన రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కరీంనగర్లో ప్రతి నిత్యం నేటి సరఫరా చేసి తాగునీటి సమస్యకు పరిష్కారం చేశామన్నారు. సమైక్య పాలనలో కరీంనగర్ ఎలా ఉంది 8 సంవత్సరాల స్వయం పాలనలో కరీంనగర్ ఎలా ఉందో ఒకసారి ఆలోచించాలని మంత్రి తెలిపారు. మన పిల్లల భవిష్యతు బాగుండాలంటే కెసిఆర్ ప్రభుత్వం రావాలన్నారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ కు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప రాణి హరి శంకర్, ఎంపీపీ టి.లక్ష్మయ్య, కొత్తపెల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జడ్పిటిసి పిట్టల కరుణ, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళా రిసోర్స్ పర్సన్స్, వివోలకు చీరలు పంపిణీ చేసిన మంత్రి గంగుల కమలాకర్

మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ - కరీంనగర్ :

కార్మిక నేత ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు కామ్రేడ్ వేణుగోపాల్‌రావు 60వర్ధంతి సందర్భంగా కట్టరాంపూర్‌లోని సుగుణాకర్‌రావు భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ అధ్వర్యంలో 'మతోన్మాదం-కార్మికవర్గంపై ప్రభావం-మన కర్తవ్యం' అనే అంశంపై సెమినార్ ఐసీఈయు డివిజన్ అధ్యక్షులు జీ. రవీంద్ర నాథ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సెమినారు ముఖ్య వక్తగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ మతోన్మాదం కార్మికుల మధ్య అనైక్యతను సృష్టిస్తుందని, దానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని,కార్మికులు కష్టపడి పనిచేసినా కనీసం కుటుంబం గడిచే పరిస్థితులు దిగజారుతున్నాయన్నారు. మరోవైపు శతకోటీశ్వరులు మరింత ధనవంతులు అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు కనీస వేతనాలు కోసం పోరాటాలకు రాకుండా, ప్రజలలో ప్రభుత్వాలపై తిరుగుబాటు రాకుండా మత చిచ్చు రేపి ప్రజలను, కార్మికులను చిల్చుతూ పబ్బం గడుపుకుంటుందని బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన క్రీడాకారులు నెలల తరబడి న్యాయం కోసం పోరాడుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశ ప్రథమపౌరురాలు రాష్ట్రపతిని నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి ఆహ్వానించకపోవడం మనుధర్మ శాస్త్రంలో భాగమేనన్నారు. బీజేపీ మతతత్వ విధానాలపై కార్మికులు పోరాడితేనే మనహక్కులు సాధించుకోగలమని పిలుపునిచ్చారు. రాజకీయాల కోసం మతాన్ని వాడుకొని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. లేబర్ కోడ్ లను రద్దు చేసిన ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ప్రతి కార్మికుడు పని ప్రదేశాలలో, నివాస ప్రాంతాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సెమినార్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, రైతు సంఘం నాయకులు ఎం.వాసుదేవరెడ్డి, జిల్లా కోశాధికారి జి.రాజేశం, ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, జి.సత్యం, సహాయ కార్యదర్శులు పున్నం రవి, ఐసీఈయు డివిజన్ కార్యదర్శి ఆర్ వెంకటరమణ, నాయకులు వామన్‌రావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వి.శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య

అర్హులైన జర్నలిస్టులందరికి నివేశన స్థలాలు కేటాయించాలి

- టీయూడబ్ల్యుజే- ఐజేయూ

నవతెలంగాణ - కరీంనగర్ :

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యుజే- ఐజేయూ) జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాశాఖ అధ్యక్షులు తాడూరు కరుణాకర్ అధ్యక్షతన స్థానిక ప్రెస్‌భవన్‌లో కరీంనగర్ పట్టణంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ మాట్లాడుతూ 18సంవత్సరాల కిందట77 మందికి ఇండ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి మళ్లీ ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, దాంతో యూనియన్ ఆధ్వర్యంలో నివేశన స్థలాల కోసం పలుమార్లు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మొదటి దఫాగా 81 మందికి, రెండవ దఫాగా 20 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తాడూరు కరుణాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సలహాలు, సూచనలు కూడా పరిగణలోకి తీసుకుంటాం. జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు యూనియన్ ఆధ్వర్యంలో ఎంతో కృషి చేశామన్నారు. అయితే జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అందరికీ ఇళ్ల స్థలాలు రాకపోవచ్చన్నారు. ఇండ్ల స్థలాలు రానివారి కోసం కూడా యూనియన్ పోరాడుతుందని, ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బల్మూరి విజయసింహారావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎలగందుల రవీందర్, జిల్లా కోశాధికారి ఎన్. సందీప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వొద్దమల్ల విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శులు ఎంఏ అసద్, పోతురాజు ప్రభుదాస్, టి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లాడి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి యు రవీందర్, కోశాధికారి సతీష్, సంయుక్త కార్యదర్శి హెచ్ సంపత్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తోజు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగం రాజు, కే రఘు, మోసిన్ మొహియొద్దీన్, సిరాజ్ మసూద్, అఖ్లీల్ పాషా, ఎంఎ మన్నన్, ఆర్ మహిధర్, నిజనిర్ధారణ కమిటీ జిల్లా కన్వీనర్ డి శ్రీనివాస్, దాడుల నివారణ కమిటీ కో-కన్వీనర్ టి సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కో-కన్వీనర్ కే రవీంద్రాచారి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

పని పూర్తి చేసినప్పుడు కలిగే ఆనందం వేరు

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- తిమ్మాపూర్ గ్రామంలో పలు సంఘ భవనాలు ప్రారంభం

నవతెలంగాణ - తిమ్మాపూర్ :


పని మొదలు పెట్టినప్పుడు కలిగే సంతోషం కంటే ఆ పనిని పూర్తి చేసినప్పుడే చాలా ఆనందం కలుగుతుందని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో మూడున్నర కోట్లతో నిర్మించిన సిసి రోడ్లు, రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి, రసమయి చేసిన అభివృద్ధిపై ప్రజలు చర్చించాలని కోరారు. గ్రామంలో ప్రతి కులానికి సంఘ భవనాన్ని నిర్మాణం చేసుకున్నట్లు చెప్పారు. ఆడబిడ్డలు పాలకులుగా ఉన్న గ్రామానికి భారత దేశం అవార్డును అందజేసిందని పేర్కొన్నారు. గోదావరి నీళ్లతో ప్రతి ఊరు తడుస్తున్నదని చెప్పుకొచ్చారు. పార్టీలకు అతీతంగా సబ్బండ సకల కులాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రైతును కన్న బిడ్డలా చేసుకుంటున్న గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. తిమ్మాపూర్ చెరువును మినీ ట్యాంక్ బండ్ గా మరుస్తాననీ, ఇందుకోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పనిచేసిన బిడ్డలను ఆశీర్వదించండి కోరారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. యువకుల కోసం జిమ్, పిల్లల కోసం పార్క్ ను ఏర్పాటు చేస్తామన్నారు.రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినంక గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రసమయిని లక్ష మెజార్టీ తో గెలిపించాలని కోరారు.సర్పంచ్ నీలమ్మ రాజయ్య మాట్లాడుతూ.. దాదాపు రూ. 3కోట్ల 90లక్షల నిధులు మంజూరు చేసి, అభివద్ధి పనులు చేశామని, గ్రామస్తుల అందరి సహకారంతోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపిపి ల్యాగల వీరారెడ్డి, సర్పంచ్ దుంద్ర నీలమ్మ రాజయ్య యాదవ్ ,ఎంపిటిసి మమత, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి రెడ్డి సంఘం అధ్యక్షులు ఎడ్ల చిన్న జోగిరెడ్డి కేడిఆర్ యువసేన అధ్యక్షులు వావిలాల విజయ్ రెడ్డి, నాయని వెంకట్ రెడ్డి, ఎడ్ల బుచ్చిరెడ్డి,ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, అంజిరెడ్డి, మల్లారెడ్డి, మాతంగి లక్ష్మణ్, మాతంగి అంజయ్య, బొర్ర శ్రీనివాస్, రాజేందర్, దేవేందర్, సాగర్ ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపిటిసిలు పాల్గొన్నారు.


రెడ్డి సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


కుల వివక్ష నిర్మూలనకు కృషి చేయాలి

నవతెలంగాణ - గంగాధర :

కుల వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ పంపరి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధురా నగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ వేముల లావణ్య-అంజి అధ్యక్షతన సివిల్ రైట్స్ డే జరిగింది. ఈ సందర్భంగా డీటి చంద్రశేఖర్ మాట్లాడుతూ కుల వివక్ష వీడి గ్రామస్తులు ఐక్యంగా ఉంటే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలోని పలు అంశాలపై గ్రామస్తులతో అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మ్యాక వినోద్, ఎంపీఓ జనార్ధన్ రెడ్డి, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు ద్యావ శ్రీనివాస్, ఆత్మ ఛైర్మన్ తూం మల్లారెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సీనియర్ నాయకులు ద్యావ సంజీవ్, గంగాధర నగేష్, ఆర్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ జైపాల్ రెడ్డి, పంచాయితీ సెక్రటరీ రాజు, నాయకులు పెంచాల చందు, వార్డ్ మెంబర్స్ గుంటి సంజీవ్, గంగాధర వేణు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.


సివిల్ రైట్స్ డేకు హాజరైన సర్పంచ్, అధికారులు


పదో వార్డు బీఆర్ఎస్ నూతన కమిటీ ఎన్నిక


బీఆర్ఎస్ నూతన కమిటీతో కొలిపాక శ్రీనివాస్

నవతెలంగాణ - హుజూరాబాద్ :పట్టణంలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం హుజురాబాద్ టౌన్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, పదో వార్డ్ కౌన్సిలర్ గోవింద స్వప్న - భాస్కర్ అధ్వర్యంలో నూతన పదవ వార్డు బీఆర్ఎస్ వార్డు అధ్యక్షులుగా కొలుపుల మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గోసుకుల శ్రీనివాస్, కార్యదర్శిగా కట్కూరి రాజేష్, సంయుక్త కార్యదర్శి తడగోని అనిల్ కుమార్, కోశాధికారిగా కొలుపుల సతీష్, కార్యవర్గ సభ్యులు గువ్వల ఎల్లయ్య, తడుగోని ఎల్లయ్య, సామల శ్రీనివాస్ రెడ్డి, యాల వీరారెడ్డి పల్లె సత్యనారాయణ స్వామి, సొల్లేటి మునిరాజం పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్1 ప్రిలిమనరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి

- గ్రూప్ 1ప్రిలిమినరి పరీక్ష రాస్తున్న అభ్యర్థులు 16829 - పరీక్షా కేంద్రాలు 34
- జూన్ 11న ప్రిలిమినరీ పరీక్ష
- జిల్లా కలెక్టర్ ఆర్‌వి కర్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్ వి కర్ణన్


నవతెలంగాణ - కరీంనగర్ :

జిల్లాలో టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెంట్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 11ఆదివారం రోజు జరిగే గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 16829 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వీరి కోసం 34పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయలని విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలు ఉండేల సరి చూసుకోవాలని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్, శిక్షణా జాయింట్ కలెక్టర్ నవీన్ నికోలస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రాజ్యలక్ష్మి, తహసీల్దార్లు కనుకయ్య, సుధాకర్, నారాయణ, చీఫ్ సూపరింటెంట్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం

నవతెలంగాణ - హుజూరాబాద్ : హుజరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నందు నిర్వహించిన కంటి వెలుగు శిబిరము విజయవంతమైనదని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో దాదాపు 200 మందికిపైగా కంటి పరీక్షలు చేయించుకున్నారని దాదాపు 60 మందికి దగ్గర చూపు అద్దాలు పంపిణీ చేశామని ఆయన చెప్పారు. 20మందికి గ్లాసెస్‌కు సిఫారసు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ ప్రజలతోపాటు తెలంగాణ ఆర్టీసీ డిపో మేనేజర్, హుజురాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు వివిధ శాఖల సిబ్బంది ప్రభుత్వాసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలను చేయించుకున్నారు. శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ఏఎస్ఎం వనిత ఆప్తాలజీ ఆఫీసర్స్ రగోతం రెడ్డి, జలందర్ జిల్లా హెల్త్ ఎడ్యు కేటర్ పంజాల ప్రతాప్ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ చీకట్ల రమేష్ హెల్త్ ఎడ్యుకే టర్ రవీందర్ అశోక్ రేష్మ సబ్ యూనిట్ ఆఫీసర్ మల్లయ్య ఎల్ డి కంప్యూటర్ భవాని డాటా ఎంట్రీ ఆపరేటర్స్ వేణు సంపత్ శివ రాజులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన తిమ్మాపూర్ యువకులు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంచంద్రం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండల కేంద్రం లో జరిగిన బహుజన సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇంద్రాల రాజు, రజక సంఘము సభ్యులు, బొర్ర కుమార్, గంగిపెల్లి రాజేష్, అలవాల వినోద్‌లు మండల అధ్యక్షులు గుర్రం సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని భరించలేకనే బహుజన సమాజ్ పార్టీలో చేరుతున్నటు ప్రకటించారు. తెలంగాణలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన చంద్ర శేఖర్‌రావు బీసీ కుల ఘనన చేపట్టడం లేదని, జనాభా దమాషాన బీసీలకు ఎమ్మెల్యే ఎంపీ సీట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతుందని నిషాని రామచంద్రం అన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఇన్‌చార్జిలు ఇగోళ్ళ వెంకన్న గౌడ్, కుమ్మరి సంపత్, అసెంబ్లీ అధ్యక్షులు బోనగిరి ప్రభాకర్, ఉపాధ్యక్షులు మాతంగి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి నిషాని రాజమల్లు, మండల ఉపాధ్యక్షులు ఒద్దిరాల అభిలాష్, ప్రధాన కార్యదర్శి అంబాల షతీష్, కార్యదర్శి అలవాల శ్రీనివాస్, ఎస్ డి సి కొమ్మగల్ల సాయి కష్ణ సెక్టార్ ప్రెసిడెంట్ కంది పోచయ్య, నేదునూరు సెక్టార్ ప్రెసిడెంట్ కనకం రఘు, వినోద్, రవి రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌ను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ - సైదాపూర్ : బొమ్మకల్ గ్రామంలో మంగళ వారం ఆర్టీసీ కండక్టర్ రిటైర్మెంట్ సందర్భంగా వేల్పూరి శ్రీనివాస్ ఆర్టీసీ డ్రైవర్ ఆధ్వర్యంలో తనతోటి కార్మికుని రిటైర్మెంట్ అయినందున అతన్ని శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టి ప్రకాష్ రెడ్డి మాజీ ఎంపీటీసీ వేముల నారాయణ ఏరుకొండ శ్రీనివాస్ ఏలూరు తిరుపతిరెడ్డి ఏలూరి సంజీవరెడ్డి యుగంధర్ విక్రమ్ రాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT JUDGE: YADADRI DIST AT BHONGIRI
O.S.NO. 75 OF 2021

BETWEEN:
B. Naveen Kumar and Another ...Plaintiffs
AND
Mandala Himavanth Reddy and 17 others ...Defendants

To,
Yadagiri Sathaiah, S/o.Rajaiah,
Aged about 50 years, Occ:Employee,
R/o.QR.NO.T2- 522, Udaynagar,
Godavarikhani, Ramagundam Mandal,
Karimnagar District, T.S.

Take notice that the above named Plaintiffs have instituted the above Original Suit against you and other Respondents for the relief of perpetual injunction and to declare documents as null and void and not binding on the plaintiffs. That you being Defendant no.8 namely Yadagiri Sathaiah keeping out of the way for the purpose of avoiding service and the Hon'ble court permitted the Plaintiffs to serve the notices/Summons by way of paper publication as substituted service and posted for Your appearance before this Hon'ble Court in person on the **14/06/2023 at 10.30 am**. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

// **By Order of the Court**//

Sd/-
V.VENKAT SRINIVAS
G.LINGAIAH
ADVOCATES
Office : 37/311, Rammohan Towers, HUDA Complex, Saroornagar, Hyderabad-35. Ph: +91- 9666994444
Counsel for Plaintiffs

CHANGE OF NAME

My name changed as **DONDESENA SUKANTI TO NIRUPAMA DONDASENA**, DOB changed as **01.01.1986 to 01.04.1990**, FATHER'S name changed as **ADAM DONDESENA TO RADHAMOHAN DONDASENA**, MOTHER'S name changed as **DOROTI DONDESENA TO DHARATRI DONDASENA.** **Address:** 14 - 1 - 98, SACRED HEART COMVENT, RAMAGUNDAM, GODAVARIKHANI, Ramagundam, KARIMNAGAR, TELANGANA - 505209.

సింగిల్ విండో చైర్మన్ ఢిల్లీ పర్యటన

నవతెలంగాణ-రాయికల్

రైతులు వినియోగించే ఎరువులు ఉత్పత్తి, అధిక దిగుబడి, పంట రక్షణ చర్యలు వినియోగించే పద్ధతులపై ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి హాజరయ్యారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుండి సదస్సుకు హాజరైన రైతులకు ఇఫ్కో కంపెనీ ద్వారా యూరియా, నానో యూరియా వంటి రసాయన ఎరువులను సబ్సిడీపై రైతులకు అందిస్తూ అధిక దిగుబడికి తోడ్ప డుతున్న సింగల్ విండో చైర్మన్లు సదస్సుకు హజరైనట్టు రాయికల్ సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి తెలిపారు. ఇఫ్కో ఖండాల యూనిట్ ఫ్యాక్టరీలను దర్శించారు.రైతులు అధిక దిగుబడి సాధించేందుకు ఎరువుల సామర్థ్యం,రవాణా, నిలువ, వినియోగం,రైతుల రక్షణ చర్యలు, నూతన పంట విధానాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లాలకు చెందిన మార్కెఫెడ్ చైర్మన్ మారు గంగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డి ఉన్నారు.



జాతీయ సదస్సుకు హాజరైన చైర్మన్ మల్లారెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

బీర్పూర్ మండలం అచునూరి తండాలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఆదివాసుల ఇళ్లు కాలిపోగా, మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్‌రెడ్డి కాలిపోయిన ఇళ్ల స్థలాలను స్థానిక ఎంపీపీ మసర్తి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌలుకు తీసుకొని, పత్తి సాగు చేసుకున్నామని, ఇంట్లో నిల్వ చేసిన పత్తితోపాటు రూ..4.50 లక్షలు డబ్బులు సైతం కాలి బూడిద అయ్యాయని ఎమ్మెల్సీ ఎదుట బోరున విలపించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10వేల నగదు అందజేశారు. కొలుముల దామోదర్ యాదవ్ కెనడా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ద్వారా మరో రూ.10వేల సాయం అందించారు. స్థానిక మండల అధికారితో ఫోన్‌లో మాట్లాడి, అగ్ని ప్రమాద సంఘటన పత్రాలు అందజేయాలని సూచించారు. బాధిత కుటుంబాలు తాత్కాలికంగా ఉండేందుకు అవసరమైన సామాగ్రి అందజేయడంతో పాటు, ఇంటి ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ జితేందర్, సింగిల్ విండో చైర్మన్ నవీన్‌రావు, ఎంపీటీసీ రంగులక్ష్మణ్, ఆడేపు మల్లేశ్వరి తిరుపతి, వెయ్య కిరణ్, పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలి

- రైతు స్వరాజ్య వేదిక, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య

నవతెలంగాణ-జమ్మికుంట

కౌలు రైతుల రక్షణ కోసం చట్టం తీసుకురావాలని రైతు స్వరాజ్ వేదిక, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరపు తిరుపతయ్య అన్నారు. మంగళవారం రైతు స్వరాజ్య వేదిక, మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక చాణక్య డిగ్రీ కళాశాల ఆవరణలో కౌలు రైతుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావే శానికి వివిధ గ్రామాల నుంచి సుమారు 100 మంది కౌలు రైతులతో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, తెలం గాణ హమాలీ కార్మిక సంఘం, దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ ప్రజా ఫ్రంట్, రైతు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శనిగరపు తిరుపతయ్య మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమా, బ్యాంకు రుణాలు, ఇతర సబ్సిడీలు కౌలు రైతులకు కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధరలు అమలు చేయాలని, వ్యవసాయం గిట్టుబాటు అయితేనే కౌలు రైతులు వ్యవసాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. కౌలుదారులను ప్రభుత్వం రైతులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. త్వరలో కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం హైదరా బాదులోని ఇందిరాపార్కు వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ముక్క ఐలయ్య, గోసిక మధు, తెలంగాణ హమాలీ కార్మిక సంఘం నాయకులు గుంటి సామ్రాజ్యం, బీఎస్పీ నాయకులు మారపల్లి మొగిలి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు అంజి, రైతు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతయ్య

ఘనంగా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి, ఏఐ సీసీ కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, రేపల్లె హరికష్ణ, పీసీసీ మైనారిటీ సెక్రెటరీ మొయిజొద్దిన్, పీసీసీఎస్ ఆర్‌ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా, కమాల్, నక్క జీవన్, రఘువీర్ గౌడ్ పాల్గొన్నారు.

పెగడపల్లి:పెగడపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి కర్నాటక రాష్ట్ర ఇంచార్జి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబూ 54 వ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, మాజీ అధ్యక్షుడు ఆకుల విష్ణు,నంచర్ల సర్పంచ్ గోలి మహేందర్‌రెడ్డి, లింగాపూర్ సర్పంచ్ ఈరెల్లి శంకర్, లింగాపూర్, పూసాల తిరుపతి, ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, తడగొండ రాజు, ప్రధాన కార్యదర్శి చాట్ల విజయ భాస్కర్, గోగూరి సతీష్‌రెడ్డి, సురకంటి సత్యనారాయణరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ తోట మల్లేశం, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అరికట్ల సంజీవ్, టౌన్ యూత్ అధ్యక్షుడు వడ్లూరి ప్రవీణ్ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జమ్మికుంట:పట్టణంలోని గాంధీచౌరాస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం స్థానిక గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. నాయకులు పొనగంటి రవీందర్, సలీం, కసుబోజుల వెంకన్న, సతీష్ రెడ్డి, ఎగ్గని శ్రీనివాస్, ఎండీ. సజ్జు , మడిపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పెగడపల్లిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



జమ్మికుంటలో కేక్ తినిపిస్తున్న నాయకులు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మల్లాపూర్

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తమ వయసుని సైతం పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన వెంపేట్ నర్సారెడ్డి, సూతరి కృష్ణమ్మచారి, కోటగిరి ఆనంద్‌గౌడ్, మానల శ్రీనివాస్, పెంటపర్తి అశోక్ పుంద్ర తిరుపతి, తదితరులను తోటి విద్యార్థులు అభినందించారు.

అవతరణ దశాబ్ది ఉత్సవాలు అట్టహాసంగా చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-రాయికల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశబ్ది ఉత్సవాలను అట్టహాసంగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళ వారం మున్సిపల్ కార్యాలయంలో జూన్ 2 నుండి జూన్ 22 వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశబ్ది ఉత్సవాల కార్యక్రమాలపై మున్సిపల్ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని వార్డుల్లో జూన్ 2న జాతీయ జెండా ఆవిష్కరణ, జూన్ 3న తెలంగాణ రైతు దినోత్సవం, జూన్ 8న ఊరూర చెరువుల పండుగ, జూన్ 15న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం, జూన్ 19న తెలంగాణ హరితోత్సవం,జూన్ 22న అమరుల సంస్మరణ దినోత్సవాన్ని వార్డుల్లో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి,మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు మ్యాకల కాంతా రావు, తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల అనురాధ రమేష్ ,వల్లకొండ మహేష్,కన్నక మహేందర్,మారంపెల్లి సాయికుమార్,అన్వరి బేగం, మున్సిపల్ మేనేజర్ వెంకట్,పిఆర్ఏఈ ప్రసాద్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఒక్కో ట్రాక్టర్ లోడ్‌లో 2 నుంచి 3 క్వింటాళ్లు దోపిడీ
- రైస్ మిల్లర్లతో ఎమ్మెల్యే కుమ్మక్కయ్యారు..

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ నిషాని రామచంద్రం

నవతెలంగాణ-గన్నేరువరం

రైతులు పండించిన వేసవి కాలం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. మండల కేంద్రంలో బీఎస్పీ మండల కమిటీ సమావేశం నిర్వహించి, అనంతరం మార్కెట్ యార్డ్‌లో వడ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మొలకెత్తిన, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఒక పక్క వర్షాలు పడుతుంటే ఇంకా కలాల నిండా వడ్ల బస్తాలు ఉన్నాయి అంటే రైతుల పట్ల స్థానిక ఎమ్మెల్యే బాలకిషన్ ఎంత నిర్లక్ష్యంగా ఉన్నాడో అర్థమవు తుందని అన్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కి 2 నుండి 3 క్వింటాళ్ల వడ్లను మిల్లర్లు దోచుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కో బస్తా మీద కనీసం వడ్లను తరలించడానికి లారీలు దొరకడం లేదని అధికా రులు సమాధానం ఇస్తున్నారని, ఇసుకను తరలించడానికి లారీలు ఎక్కడివని అయన ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే మిల్లర్లతో కుమ్మక్కు అయ్యాడని నిషాని ఆరోపించారు. ఈ సమావేశం లో అసెంబ్లీ ఇంచార్జ్ లు ఇగోళ్ళ వెంకన్న గౌడ్, కుమ్మరి సంపత్, అసెంబ్లీ అధ్యక్షులు బోనగిరి ప్రభాకర్, ఉపాధ్యక్షులు మాతంగి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షులు బామాండ్ల ఎల్లయ్య, మహిళ కో కన్వినర్ ప్రమీల పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆధ్యాత్మిక శోభ.. ఆకట్టుకునే డిజైన్

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన నంది కమాన్ చౌరస్తా
- చిత్రాలను ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసిన మంత్రి కే.టి.ఆర్
- గుడ్ జాబ్ కలెక్టర్ అంటూ ప్రశంసలు

నవతెలంగాణ-వేములవాడ

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కొలువై ఉన్న వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారి లోని నంది కమాన్ చౌరస్తా, కొండగట్టు వెళ్లే దారిలోని సాయి రక్ష జంక్షన్‌ను జిల్లా కలెక్టర్ మార్గదర్శనం మేరకు మున్సిపల్ అధికారులు సుందరంగా ముస్తాబు చేశారు. ఇటీవలే అభివృద్ధి చేసిన నంది కమాన్ కూడలి ఫొటోలను మంత్రి కే.తారకరామారావు తన ట్విట్టర్ ఖాతాలో మంగళవారం పోస్ట్ చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సరికొత్త ఆధ్యాత్మిక శోభ నంది జంక్షన్ మీకు స్వాగతం పలుకుతోంది అంటూ మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్ , ఫేస్ బుక్‌లో ఫొటోలను పోస్ట్ చేశారు. గుడ్ జాబ్ కలెక్టర్ అనురాగ్ జయంతి అంటూ మంత్రి అభినందించారు.



వేములవాడ కూడళ్లల్లో..

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలో శివనగర్ కాలనీలోని శివ గాయత్రి ఆశ్రమంలో చనిపోయిన అనాథ వృద్ధుడికి ఆశ్రమ నిర్వహకులు సూరజ్ శివ్ శంకర్ ఆధ్వర్యంలో పట్టణ ముస్లీం అధ్యక్షుడు అబ్దుల్ బారి, సిద్ధిక్ ముఖ్తి, ఎం.డి.రహీం సదర్, షంషోద్దీన్ అమీనాబాద్ కమ్మరి మసీద్ పెద్దలు ముస్లీం సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఎర్రగొండెపాలెం పట్టణానికి చెందిన పీర అహ్మద్ (70) రెండేండ్ల క్రితం ఆశ్రమంలో చేరాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందాడు. అబ్దుల్ రషీద్, ఇమ్రాన్, ఆసిఫ్, ఇలాల్, షేక్ ఇర్ఫాన్, సయ్యద్ సోయల్, ఇమ్రాన్, హైమద్ ఖాన్, ముస్లీం పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ముస్లింలు

దశాబ్ది ఉత్సవాలు జరిగే ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-జగిత్యాల

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో చేపట్టబోయే కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా జూన్ 4న ఆదివారం - సురక్షా దినోత్సవం సందర్భంగా కొత్త బస్టాండ్ నుండి టవర్ సర్కిల్, చౌరస్తా మీదుగా జరిగే పెట్రోలింగ్ కార్స్, బ్లూ కోల్ట్స్, వెహికిల్స్‌తో ర్యాలీ ప్రదేశాలను, మున్సిపల్ పార్కు దగ్గర ఏర్పాటు చేసి సభ ప్రాంగణం, అదే రోజు సాయంత్రం సుమంగళి గార్డెన్‌లో జరిగే కార్యక్రమానికి సంబం ధించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాశ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, రూరల్ సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఆర్‌ఐలు వామనమూర్తి , నవీన్, ట్రాఫిక్ ఎస్.ఐ రామ్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవానికి తరలిరావాలి

- చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి సుంకే దీవెన

నవతెలంగాణ-చొప్పదండి

నేడు కరీంనగర్‌లోని పద్మానగర్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్యాలయ శంకుస్థాపన మహోత్సవానికి చొప్పదండి పట్టణంలోని మహిళలను అధిక సంఖ్యలో తరలిరావాలని చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి సుంకే దీవెన కోరారు. వెంకటేశ్వర స్వామి ఆలయ భూమి పూజ సందర్భం గా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పిలుపు మేరకు మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే సతీమణి సుంకే దీవెన పట్టణంలోని మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ భూమారెడ్డి, కౌన్సిలర్లు మాడూరి శ్రీనివాస్, కొత్తూరి స్వతంత్ర భారతి, జ్యోతి, చంద్రశేఖర్ గౌడ్, జహీరుద్దీన్, గుర్రం మంగ, రాజయ్య పాల్గొన్నారు.



మహిళలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ- హుజూరాబాద్

హుజూరాబాద్ పురపాలక సంఘం ఎదుట మున్సిపల్ కార్మికులు ఉద్యమ తెలంగాణ మున్సిపల్ వర్క్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జెండాను మున్సిపల్ అధ్యక్షుడు ఎండీ అజ్జు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ ఎప్పుడు కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. కార్మికులు అందరూ సంఘంలో ఐక్యంగా ఉండి పోరాటాలు చేసి హక్కులను సాధించుకోవాలని, ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎండి అజ్జు ప్రధాన కార్యదర్శి తూముల కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు ఆర్ సరోజన,కమిటీ సభ్యులు, ప్రశాంత్, కిరణ్, రాజిరెడ్డి, అంజి, రంజిత్, జిల్లా రాజేష్, రాజ్ కుమార్, నరసయ్య, మురారి, కుమార్, మొండయ్య కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం బీసీలదే..

నవతెలంగాణ-జమ్మికుంట

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని బిజెపి ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బిజెపి మండల బిసి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ నేతృత్వంలో రానున్న ప్రభుత్వం బీసీలదే అని, తొమ్మిదేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం బీసీలను అనుగదొక్కుతూ, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నార న్నారు. 4 శాతం ఉన్న వారి సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు గాండ్ల సంపత్, పొనగంటి రవికుమార్, పీజేఆర్ ఆకుల కిషన్, ఉడుగుల మహేందర్, న్యాలకంటి రవి, దేవులపల్లి నవీన్, పొనగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

వృద్ధులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-రాయికల్

పీఆర్‌టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాళ్ళ అమర్ నాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఇటిక్యాల నివేదిత వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రమేష్, కుంబాల శ్రీనివాస్, మండల అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తాటి పాముల రమేష్, అసోసియేట్ అధ్యక్షులు కడకుంట్ల అభయ్‌రాజ్, జిల్లా కార్యదర్శులు అంతడుపుల గంగారాజం, మాచర్ల మహేష్, ఉషకోల రాము పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి

- జడ్పీటీసీ కంఠం భారతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సహాయ సహకారాలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ కంఠం భారతి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో మురుగు కాలువ నిర్మాణం, పుప్పాల సంఘ భవన నిర్మాణానికి జడ్పీ నుంచి విడుదలైన రూ.6 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అడిగిన వెంటనే వరాలిచ్చే ఎమ్మెల్యే మన కుండగా మనకు ఇంకా దిగులు లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, ఉపసర్పంచ్ కోటి దేవరెడ్డి, మాజీ సర్పంచులు కంఠం రమేష్, పుప్పాల నర్సయ్య, సింగిల్ విండో డైరెక్టర్ అశోక్‌గౌడ్, గోపి రాజేందర్, భూమేష్, పుప్పాల సంఘ సభ్యులు పాల్గొన్నారు



భూమి పూజ చేస్తున్న జడ్పీటిసి

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మల్లాపూర్:

కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగారావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళ వారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..జువ్వాడి నర్సింగరావు పార్టీలు మారుతున్నట్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలు తీవ్రంగా ఖండించారు. జువ్వాడి నర్సింగరావు పెరు ప్రతిష్ఠాలకు భంగం చేస్తున్నారు. అదేవిధంగా జువ్వడి బ్రదర్స్ అనుచరులు డాక్టర్ బెజ్జరపు శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డిపై విష ప్రచారాన్ని మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ మండల అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుంకేట నారాయణ, పుంద్ర సోమరెడ్డి, మరిపెల్లి మల్లయ్య, ఏనుగంటి నరేష్, సిరికొండ రాజాం, నుతిపెల్లి రాజాం ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగ వైకల్యం కలిగిన వికలాంగులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాను సారం ఆలింకో డాక్టర్ల పర్యవేక్షణలో 19 వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేసినట్టు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి నరేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసింది. వికలాంగుల అభివృద్ధి సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం నిత్యం అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరేష్, సీనియర్ సహాయకులు చంద్ర మోహన్, ఆలింకో డాక్టర్స్ ఆధార్ సింగ్, స్వస్తిమయీ, ప్రకాష్, ఎఫ్ఆర్‌ఓలు కొండయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొండయ్య యాదవ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

యాదవ హక్కుల పోరాట సమితి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తుల కొండయ్య యాదవ్‌ను నియమిస్తూ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొక్కెర మల్లేష్ యాదవ్ నియమించారు. జిల్లాలో యాదవ హక్కుల పోరాట సమితి విస్తరణలో భాగంగా యువజన విభాగ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టామని మల్లేష్ యాదవ్ పేర్కొన్నారు. తన నియామకానికి కషిచేసిన ప్రతిఒక్కరికి కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్ యాదవ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బల్కం మలేష్ యాదవ్, వేములవాడ శ్రీనివాస్ యాదవ్, రాములు యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

కాంగ్రెస్ పార్టీని వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నట్టు చేస్తున్న ప్రచారం తప్పని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈనెల 29న ముత్యంపేట చక్కర ఫ్యాక్టరీ ఎదుట జువ్వాడి నర్సింగరావు దిష్టిబొమ్మ దహనం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దూర్చార్యులకు పాల్పడిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఎస్సై ఉమాసాగర్‌కు ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

నవతెలంగాణ-పెగడపల్లి

మిల్లర్లతో కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వం రైతులను దొచుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ అన్నారు. పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వరి ధాన్యం రైతులను ఆదుకోవాలని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, నంచర్ల సర్పంచ్ గోలి మహేందర్‌రెడ్డి, లింగాపూర్ సర్పంచ్ ఈరెల్లి శంకర్, ఉపాధ్యక్ష ప్రధాన కార్య దర్శులు సంధిమల్లారెడ్డి, తడగొండ రాజు, చాట్లవిజయ్ భాస్కర్, గొగూరీ సతీష్ రెడ్డి, కదారి తిరుపతి, మాజీ అధ్యక్షుడు ఆకుల విష్ణు, సింగిల్ విండో డైరెక్టర్లు సత్తిరెడ్డి, తోట మల్లేశం, మద్దెల సుధీం పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొనుగోలు కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-జగిత్యాల :

సారంగాపూర్ మండలంలోని నాగునూరు, లచ్చకపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బీజేపీ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి మంగళవారం సందర్శించారు. 20 రోజుల క్రితం ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ సగం ధాన్యం కూడా పూర్తి కాలేదన్నారు వెంటనే కొనుగోలు పూర్తి చేయాలని, ఎలాంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్ కుమార్, సారంగాపూర్ బీజేవైఎం మండల అధ్యక్షుడు ధీటి వెంకటేష్, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి దామెర జలెందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు ఏలేటి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలో చేసిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ లోక బాపురెడ్డి, పాడి పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, కథలాపూర్ జడ్పీటీసీ నాగం భూమయ్య కలిసి కోరారు.



మంత్రితో కథలాపూర్ నాయకులు

భారత దేశానికి గర్వకారణం

8గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన శివనారాయణ్ జ్యువెలర్స్



నవతెలంగాణ - కరీంనగర్ : నగరంలోని అగ్రశ్రేణి వారసత్వ ఆభరణాల సంస్థ శివ నారాయణ్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎనిమిది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్స్ సాధించింది. చరిత్రలో ఇటువంటి ఘనతను సాధించిన మొదటి భారతీయ ఆభరణాల వ్యాపార సంస్థగా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రముఖులు, సెలబ్రిటీలు హాజరు కాగా, భారీ వేడుకను చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే, శివనారాయణ మహోన్నత వారసత్వాన్ని ప్రశంసించడానికి సరైన వేదికగా ప్రతిబింబించే తాజ్ ఫలక్‌నూమా ప్యాలెస్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో బాలీవుడ్ ఫ్యాషన్ ఐకాన్ దిశా పటానీ, శివనారాయణ్ అత్యున్నత ఆభరణాలను ధరించి ర్యాంపై ప్రదర్శించారు. దివినుంచి భువికి వచ్చిన దేవకన్యలా ఆమె ర్యాంప్ పై నడిచి వస్తుంటే, ఆభరణాలు సంక్లిష్టత మా త్రమే కాకుండా హస్తకళ నైపుణ్యం, వాటి గాంభీర్యత సైతం అంతే గొప్పగా ప్రదర్శితమయ్యాయి. ఈ కార్యక్రమంలో మరో ఆకర్షణీయమైన అంశంగా అపూర్వమైన ఎక్స్‌పీరియన్షియల్ జోన్ నిలిచింది. ఈ ప్రతిష్టాత్మక విజయం పట్ల సంస్థ ఎండీ తుషార్ అగర్వాల్ మాట్లాడుతూ 8గిన్నిస్ వరల్డ్ ఉందన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇల్లంతకుంట :జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి శ్రావణ పెల్లి మల్లేశం అన్నారు. మంగళవారం బహిరంగ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈసమావేశంలో జుట్టు మల్లేశం, తాళ్లపల్లి సదానందం, మల్లయ్య బత్తుల శంకర్, రాజశేఖర్, రాజేందర్, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల వెంకటి, అంతగిరి బాలపోచయ్య, సీనియర్ నాయకులు ఓగ్గు రమేష్, జమాల్, మచ్చ రాజేశం, బడుగు లింగం, గూడ నరేందర్, సిరికొండ నాగరాజు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శేఖర్, దాసు, న్యాత బాబు పాల్గొన్నారు.

కొనరావుపేట :

మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చేపూరి గంగాధర్ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరోజు పాషా, కాంగ్రెస్ నాయకులు అజిమ్ పాషా, పెంతల శ్రీనివాస్, రవి, సదానందం పాల్గొన్నారు.

మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు



తడిసిన వరి ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-రుద్రంగి : బీఆర్ఎస్ ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కైందని బీఎస్పీ మండల ఇన్‌చార్జి కట్కూరి శంకర్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం మార్కెట్ యార్డ్‌లోకి వరి ధాన్యాన్ని తీసుకురాగా, నెల రోజులు దాటిన కొనుగోలు చేయడం లేదన్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వరి ధాన్యం బస్తాలు తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్‌లో కనీసం రైతులకు వసతులు కలిపించకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరీని స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న ఆర్థిక సాయం రూ.10వేలు ఇంత వరకు ఇవ్వకపోవడం చూస్తే రైతుల మీద ప్రభుతానికి ఉన్న ఉన్న ప్రేమ ఎంతో అర్థమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దర్శనం గంగాధర్, వేములవాడ నియోజకవర్గ కోశాధికారి దయ్యాల ఉదయ్, మండల ప్రధాన కార్యదర్శి దేశవేని భూమేష్, మండల కోశాధికారి సుంచు అనిల్ కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు కాదాసు మహేందర్, సెక్టార్ కార్యదర్శి పోసు తిరుపతి, నాయకులు కట్కూరి రమేశ్ పాల్గొన్నారు.

వరిధాన్యం తరలించడంలేదని ధర్నా



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

నవతెలంగాణ-చందుర్తి : వరి ధాన్యం తరలిం చడంలేదని మాల్యాల గ్రామానికి చెందిన 50 మంది రైతులు మంగళ వారం కోరుట్ల -వేములవాడ రహదా రి పై ధర్నా చేపట్టారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినదిం చారు. రోడ్డుపై గంట పాటుగా ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతారాయం కలిగింది. ఎస్సై రమేష్ ఘటన స్థలానికి చేరుక . తహసీల్దార్‌తో మాట్లాడి రోజుకు ఐదు లారీలను పంపించే దిశగా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు.

బాధితుడికి మొబైల్ అందజేత



మొబైల్ అందజేస్తున్న ఎస్సై

నవతెలంగాణ-చందుర్తి : మండలంలోని మూడపల్లి గ్రామానికి చెందిన సంటీ సురేష్ తన సెల్ ఫోన్‌ను తన మెడికల్ షాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ట్రెస్ చేసి ఆ మొబైల్‌ను బాధితునికి ఎస్ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. మొబైల్ పోతే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

దేశానికి దిక్సూచిగా తెలంగాణ అభివృద్ధి

- పండగలా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



నవతెలంగాణ - సిరిసిల్ల

వివక్షకు గురై, అభివృద్ధిలో అట్టడుగున ఉన్న తెలంగాణ, ప్రత్యేక రాష్ట్రం ఎర్పడిన పదేండ్లల్లో దేశానికి దిక్సూచిగా మారిందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూన్ 2నుండి జూన్ 23వరకు దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సలహాలు జరుగుతున్నాయని అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో పండగ వాతావరణంలా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. "తెలంగాణ వచ్చేదా సచ్చేదా" అన్న ఆంధ్రుల మాటల నుండి తెలంగాణ సాధించుకున్నామని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు 2001 నుండి 2014 వరకు కెసిఆర్ నాయకత్వంలో అలుపెరుగని సుదీర్ఘ పోరాటం చేసి, ఎన్ని అడ్డంకులు వచ్చినా తొలగించుకుంటూ చివరికి ప్రాణ త్యాగానికి సిద్ధపడి ఆమరణ నిరాహార దీక్షతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారన్నారు.

పదేళ్లలో అభివృద్ధిలో అగ్రస్థానంలో తెలంగాణ

10సంవత్సరాలలోనే తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి చెందిందని, నీళ్లు, నిధులు, కరెంటు, సమస్యలతో కొట్టుమిట్టాడిన తెలంగాణ రాష్ట్రం నేడు రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు, తాగునీరు, అందించామన్నారు. రెండు నదుల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి కోటి ఎగరాలకు నీరు అందించగలిగామని, వరి ధాన్య ఉత్పత్తిలో భారతదేశంలోని తెలంగాణ మొదటి స్థానంలో ఉందని వినోద్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రంలో 1000కి పైగా గురుకులాలు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో 1000కి పైగా గురుకుల పాఠశాల కళాశాలలను ఏర్పాటు చేశామని, తద్వారా పేద నిరుపేద విద్యార్థులందరికీ లబ్ధి చేకూరి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేశామన్నారు. వెనుకబడిన విద్యార్థుల విదేశీ విద్య కోసం స్కాలర్‌షిప్లు అందిస్తున్నామన్నారు.

వచ్చే పదేండ్లలో అభివృద్ధికి ప్రణాళిక..

గడిచిన 10ఏండ్ల అభివృద్ధి కాకుండా రాబోయే 10సంవత్సరాల అభివృద్ధి కోసం ఎంతో ముందు చూపుతో కేసీఆర్ రూపకల్పన చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రైమ్ రేట్ చాలా తగ్గిందని రాష్ట్రంలో గ్రౌండ్ లెవెల్స్ విపరీతంగా పెరిగాయని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో ఊహించని అభివద్ధి జరుగుతుందని రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సిరిసిల్లలోనే ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్స్ తీసుకువచ్చామని వివరించారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందని జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, ఇలా ఎన్నో కళాశాలలు తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జరిగిన అభివృద్ధిపై ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు.

ఈసారి పారదర్శకత ఎంత?

- త్వరలో 'సెస్' ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు
- నియమకాలలో నిబంధనలు అమలుపై అనుమానాలు!



సిరిసిల్లా సెస్ కార్యాలయం

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

రాజన్న సిరిసిల్లా జిల్లాలో మొత్తం 13మండాలలోని 255గ్రామాలకు ప్రస్తుతం 100మంది లైన్ మెన్‌లు, 150మంది హెల్పర్లు, ఉన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో పట్టణం అభివృద్ధి చెందడంతో, పరిశ్రమలు, భారీ యంత్రాల వినియోగం, నివాసాల విస్తరణ వల్ల విద్యుత్ వినియోగం పెరిగింది. వీటి దృష్ట్యా పట్టణ పరిధిలో మరికొంత మంది టెక్నికల్ సిబ్బంది అవసరం ఎర్పడుతుందని సెస్ చైర్మన్ చిక్కలరామరావు పత్రిక సమావేశంలో తెలిపారు. కార్యనిర్వహణలో భాగంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి త్వరలో సెస్ కార్యాలయం భర్తీ చేయబోతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియమకాలలో నిబంధలు పాటిస్తారా? లేదా? అనే అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. పత్రికముఖంగా సెస్ చైర్మన్ తెలిపిన ఔట్ సోర్సింగ్ నియమకాల భర్తీ విషయంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే గతంలో సెస్‌లో జరిగిన పలు అవినీతి ఆరోపణలు ఈ మధ్యకాలంలో సెస్ మాజీ ప్రతినిధి ప్రభాకర్‌రావు హైకోర్టును ఆశ్రయించి ప్రస్తుత సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అప్పటి వైస్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌లకు నోటీస్‌లు పంపడం, వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని ఆలోచిస్తే నియమకాలలో పారదర్శకత ఎంత ఉంటుదోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీలోనే అవకతవకలు జరిగిన నేపథ్యంలో నియమకాలంటేనే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఇక సెస్‌లో భర్తీ చేయబోయే నియమకాలు పారదర్శకంగా చేపట్టి సెస్ చైర్మన్ నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ముకాకుండా చూస్తారా? లేదో వేచి చూడాలి.

పాదర్శకంగా నియమకాలు చేపడతాం : సెస్ చైర్మన్ చిక్కల రామారావు, సిరిసిల్ల



నిబంధనల ప్రకారం స్కిల్ టెస్ట్ పెట్టి నియమకాలు చేపడతాం. రాత పరీక్షలను గతంలో మాదిరిగానే ఉస్మానియాకు బాధ్యతలు అప్పగిస్తాం. ప్రతి అభ్యర్థి పది పాసై ఐటిఐ పూర్తి చేసి ఉండాలి.

నియమకాల్లో పైరవీలకు తావివ్వకుండా చూడాలి : మాజీ సెస్ ప్రతినిధి భీయ్యంకార్ శ్రీనివాస్



సెస్ అంటే అవినీతికి, అక్రమాలకు అడ్డాగా మారిందని ప్రజలు అసహ్యాహించుకునే పరిస్థితికి వచ్చింది. ప్రస్తుత పాలకవర్గం తీసుకొబోతున్న పోస్ట్‌ల భర్తీలో ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా ప్రతీదీ పారదర్శకంగా నిర్వహించాలి. ఔట్ సోర్సింగ్ పోస్ట్‌ల ఎంపికైన రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లు పకడ్బందీగా నిర్వహించి అభ్యర్థుల మెరిట్ ఆధారంగానే భర్తీ చేపట్టాలి.

జూన్ 4న సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభ

- సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ కరీంనగర్ :

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు జూన్ 4న కొత్తగూడెంలో జరుగు సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభకు సీపీఐ శ్రేణులు భారీగా తరలి రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ కో హటావో దేశ్ కో బచావో అనే నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు గత నెల 14వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా ఇంటి ఇంటికి సీపీఐ,పల్లె పల్లెకు సీపీఐ ప్రజల వద్దకు సీపీఐ అనే నినాదంతో బీజేపీ పరిపాల వైఫల్యాలను ఎండగడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలను అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలకు వివరించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో సీపీఐ ప్రజా గర్జన పేరుతో పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభ విజయవంతం కోసం కరీంనగర్ జిల్లా నుండి అధిక సంఖ్యలో సీపీఐ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మీ, బత్తుల బాబు,బోయిని తిరుపతి, నాగెల్లి లక్ష్మారెడ్డి, గొడిశెల తిరుపతి గౌడ్,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు,పంజాల శ్రీనివాస్, బ్రామండ్ల పెల్లి యుగేందర్, బూడిద సదాశివ,ముద్రకోల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

రైతు ఆర్థిక స్థితిని మెరుగుపరచాలి

- పి.సుగుణాకర్‌రావు, అధ్యక్షులు, కిసాన్ జాగరణ్

నవతెలంగాణ - కరీంనగర్ :

దేశంలోని రైతాంగ ఆర్థిక స్థితి మెరుగుపడందే దేశ అభివృద్ధి జరగదని అలాగే వివిధ వృత్తుల వారీగా రైతు ఆర్థిక స్థితి బాలేదని ఈ పరిస్థితి మారుటకు రైతాంగం కూడా అధునాతన పద్ధతులను అవలంభిస్తూ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తాత్కాలిక సహకారం కాకుండా రైతాంగ ఆర్థిక స్థితి మెరుగుపరచకునేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని అప్పుడే రైతు ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని ఈరోజు కరీంనగర్‌లోని కృషి భవన్‌లో కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో జరిగిన రైతులతో ముఖాముఖి అనే కార్యక్రమంలో కిసాన్ జాగరణ్ అధ్యక్షులు పి.సుగుణాకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రంగాల లాగా వ్యవసాయ రంగంలో కూడా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంచాలని అట్టి పరిజ్ఞానం రైతుల చెంతకు చేర్చాలని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి పంటకు లాభసాటి ధర, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లితే పరిహార చెల్లింపులు ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు. సమాజంలో మిగతా రంగాల్లో వారిగా రైతు ఆర్థిక స్థితి మెరుగుపరుచుటకు మరింత ప్రోత్సాహకాలు అందజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ పంట, ఆ పంటను విలువ ఆధారిత ఎక్కువ ధరకు అమ్ముకున్నప్పుడే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వానాకాల పంటలకు ఏ పంటలు వేయాలి అలాగే పంట మార్పిడి, అధికోత్పత్తి, అధిక ధరకు అమ్ముకోవడం ఎలాగో రైతులకు సవివరంగా వివరించారు. వ్యవసాయ రంగంలో రైతులు అడిగిన ప్రశ్నలకు ఈ సందర్భంగా ఆయన సమాధానం చెప్పారు. కేవీకే శాస్త్రజ్ఞురాలు ప్రశాంతి మాట్లాడుతూ రైతు తన పంటలకు వస్తు మార్పిడి, విలువ పెంపు చేసినప్పుడే రైతులు లాభపడతారని తెలిపారు. విత్తన శాస్త్రవేత్త వీరేష్ వేమారెడ్డి మాట్లాడుతూ ఒకే రకమైన పంటకు బదులుగా వివిధ పంటలు పండించడం వలన రైతుకు లాభం ఉంటుందని తెలిపారు. సిగ్నెట్ సీబిబిట ప్రతినిధి సుదేష్ శర్మ మాట్లాడుతూ అధిక ఉత్పత్తి గల వరి పంటలు, యాసంగిలో పంట మార్పిడి ద్వారా రైతులకు లాభం ఉంటుందని తెలిపారు. రైతులు పంటలతో పాటుగా చేపల పెంపకాన్ని కూడా చేపట్టినచో అధిక లాభాలు గడించవచ్చని మంజీర సంస్థ ప్రతినిధి అనామిక పటేల్ , కెవికె శాస్త్రవేత్త ప్రభాకర్ తెలిపారు. రైతులు కొత్త సాంకేతిక పద్ధతులైన డ్రోన్ వినియోగం గూరించి ఆ సంస్థ ప్రతినిధి ప్రదీప్ వివరించారు. రైతు పంట పొలాలలో వొడ్లు ఏర్పాటు, సస్య రక్షణ గూర్చి యారో ఫార్మ్ ప్రతినిధి చైతన్య వివరించారు. నాగార్జున ఫర్టిలైజర్స్ ప్రతినిధి గురువయ్య బయో ఫెర్టిలైజర్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ సమావేశంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆదర్శ రైతులు, ఇతర రైతు నాయకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్ జాగరణ్‌అధ్యక్షులు, పి సుగుణాకర్ రావు

కార్మికులకు అండ సీఐటీయూ జెండా

- కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ



సిరిసిల్ల పట్టణంలో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు.

నవతెలంగాణ - సిరిసిల్ల :

కార్మిక హక్కుల పోరాట సంఘం, ఐక్య ఉద్యమాల సారథి, సీఐటీయూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) 53వ. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సిరిసిల్ల పట్టణం బివైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం వద్ద, తంగళ్ళపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద జిల్లా నాయకులు నక్క దేవదాస్, గోవిందు లక్ష్మణ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. 1970 మే 30న ఐక్యత ! పోరాటం! అనే నినాదంతో కార్మిక వర్గాన్ని దోపిడీ నుండి రక్షించడం కోసం, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలానే లక్ష్యంతో సిఐటియు ఆవిర్భవించడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు గత 53 సంవత్సరాల కాలంగా దేశంలోని అన్ని రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలంలో వివిధ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూగా అనేక పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని రాబోయే రోజుల్లో కూడా మండలంలోని అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శీరామ్ సదానందం,ఎలిగేటి రాజశేఖర్,రమేష్ చంద్ర,సురేష్, ప్రభాకర్, వెంకట్రాజం, సిఐటియు మండల నాయకులు అన్నల్దాస్ గంగాధర్, గోరంతల రాజమల్లు, మర్కటి నర్సయ్య ,అవధూత హరిదాస్,సతీష్,వేణు, శ్రీనివాస్,విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ :



జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద సీఐటీయూ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బిక్షపతి, మండల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, హమాలీ సంఘం, భవన కార్మికులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీతోనే రాష్ట్రంలో రాజకీయ మార్పు



బిఎస్పిలో చేరుతున్న యువకులు.

నవతెలంగాణ- సిరిసిల్లటౌన్ : తెలంగాణ రాష్ట్ర బిఎస్పి చీఫ్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోనే రాష్ట్రంలో మార్పు మొదలైందని బీఎస్పీ రాజన్న సిరిసిల్లా జిల్లా ఇన్‌చార్జి బట్టు రాంచంద్రం అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా తడుకభాను, జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, ఇన్‌చార్జిగా అరుకల రమేష్ నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిరిసిల్ల పట్టణానికి చెందిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన 50మంది బీఎస్పీలో చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, ప్రచార కార్యదర్శి యారపు రాజబాబు, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు లింగంపల్లి మధుకర్, చెట్టిపల్లి నరేందర్, వెంగళాంజనేయుల, చౌదారపురాజు, మెర్గురాజు,మెర్గు శీను, గడ్డం కమలాకర్, గుంటుక రమేష్,నాగరాజు,ఆడెపు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలి



మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసి నాయకులు.

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విధి కుక్కల బెడద నుంచి నివారించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలో వీధి కుక్కల వల్ల పిల్లలు, వృద్ధులు తిరగలేని పరిస్థితి ఉందన్నారు. ప్రజల పన్నులతోనే ప్రభుత్వాన్ని నడుపుతున్న పాలకులకు ప్రజల సమస్య తీర్చాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యాక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జవేణు, రామచంద్రం ,సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ హఠాన్మరణం



నవతెలంగాణ- కొనరావుపేట : ఉపాధి హామీ పని చేస్తూ అస్వస్థతకు గురై ఓ కూలీ హఠాన్మరణం చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లేవెని చంద్రయ్య(55) ఉపాధి హామీ కూలీగా పని చేస్తున్నాడు. చంద్రయ్య రోజు మాదిరిగానే సోమవారం ఉదయమే గ్రామ శివారులోనే అల్లంతోట బోరుకు ఉపాధి హామీ పనిలో భాగంగా కాలువ పూడిక తీత పనికి వెళ్ళాడు. ఈ క్రమంలో పని చేస్తుండగా అస్వస్థతకు గురై ఒక్కసారిగా కిందపడి పోయాడు. గమనించి ఇంటికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కుమారులు భాస్కర్,సాయిలు ఉన్నారు.

టవర్ ఎక్కిన యువకుడు



నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన ధరసోత్ రవి మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కాడు. భూమి విషయంలో మంగళవారం ఉదయం ఆయన బంధువులు తనపై దాడికి పాల్పడ్డారని, భూ సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడి ధరంసోత్ రవిని కిందికి దించాడు. అతన్ని స్థానిక పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రెస్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించండి

కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే ఐజేయూ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: జిల్లా కేంద్రంలో ప్రెస్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, ఎమ్మెల్యే దాసరి మనోహరరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.అనంతరం సంపత్ మాట్లాడుతూ 2017లో స్థలం కేటాయించినప్పటికీ దేవాదాయ శాఖ నోటీసులతో అది నిలిచిపోయిందన్నారు. కలెక్టరేట్ సమీపంలోని సర్వే నం.129లో 10 గుంటల స్థలాన్ని కేటాయించినట్లయితే ప్రెస్ భవన్‌తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. తమ విజ్ఞప్తికి కలెక్టర్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంపత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నారాయణదాసు అశోక్, జిల్లా దాడుల కమిటీ కో కన్వీనర్ చంద్రమౌళి, కార్యవర్గ సభ్యుడు ఆరెళ్లి మల్లేషం, మండల అధ్యక్షులు వీరమల్ల విద్యాసాగర రావు, ఆకుల రమేష్, బెజ్జంకి నరేష్, కుమ్మరి ముకేష్, కలవేన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు


మంథనిలో...


8 ఇంక్లైన్ కాలనీలో...


కేక్ కట్ చేస్తున్న సూర సమ్మయ్య


కమాన్‌పూర్‌లో...


సుల్తానాబాద్‌లో...


రామగిరిలో...


కేక్ కట్ చేస్తున్న జనక్ ప్రసాద్


ముత్తారంలో...

నవతెలంగాణ-మంథని:
మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను మంథనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది పైగా యువజన కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో మంథని దత్తాత్రేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంథని ప్రభుత్వ వైద్యశాలలో ఫ్రూట్స్, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు అన్ని విభాగాల నాయకులు పాల్గొన్నారు.

సూరయ్యపల్లిలో...
మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు సందర్భంగా సూరయ్యపల్లి వార్డు సభ్యులు ఎరుకల సురేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మాతా శిశుసంక్షేమ ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, పాలు, బ్రెడ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ల.వెంకటి, రేపాక శ్రీనివాస్, జంజర్ల పెద్ద గట్టయ్య, మంథని కర్ణ కృష్ణ, చెరుకు తోట రమేష్, ఆర్ల లింగయ్య, జంజర్ల మల్లేష్, సూరయ్యపల్లి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..
మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను సుల్తానాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణ రావుతో పాటు కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, గోపాగాని సారయ్య గౌడ్, దన్నాయక్ దామోదర్ రావు, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, సమ రాజేశ్వర్ రెడ్డి, సాయిరి మహేందర్, ఆర్షణపల్లి వెంకటేశ్వర్ రావు, దుగ్యాల సంతోష్ రావు, ఎండీ రఫిక్, దున్నపోతుల రాజయ్య, చింతల రాజు, భూతగడ్డ సంపత్, తూముల సుభాష్, తాండూరి శ్రీమాన్, బొడ్డుపల్లి శ్రీనివాస్, పన్నాల రాములు, గంగుల వెంకటేష్, గన్నామనేని తిరుపతి రావు, పెద్దపల్లి దేవరాజు, కొరకంటి వెంకటేశ్వర్ రావు, అమెరుశెట్టి రాయలింగు, కుమార్ కిషోర్, మేకల పోచాలు, ఎండీ మొబిన్, సిద్ధ తిరుపతి, అమ్ముల రాయమల్లు, పుప్పాల శెంకర్, భేరి రవి, చొప్పరి రాజయ్య, నీర్ల శ్రీనివాస్, ఆర్కుటి సంతోష్, చెవుల తిరుపతి, ఎండీ నడదేం, ఎండీ అసిఫ్, శ్రీనివాస్ మధు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి:
రామగిరి మండల కేంద్రంలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను ఐఎన్‌టీయూసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట చంద్రయ్య, మంథని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నీరజ తులసిరామ్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, మడ్డి రాజకుమార్ తదితరులు హాజరయ్యారు.

ఆర్జీ-3 ఏరియా ఓసీపీలో..
ఐఎన్టీసీ నాయకులు, ఆర్ జి-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్జి-3 ఏరియాలోని ఓసీపీ లో నిర్వహించిన శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలకు ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ బి.జనక్ ప్రసాద్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇంచార్జి వికాస్ కుమార్ యాదవ్, ఆర్‌జీ-2 వైస్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ, మహేష్ బాబు, మార్కండేయ, సత్రం సమ్మయ్య, మర్రి ఓదెలు, తాళ్లపెల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి:
జూలపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీధర్ బాబు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మానుమండ్ల శ్రీనివాస్, కోరేపు సంపత్, ఈజపురి లింగ స్వామి, ముమ్మడి రవి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండీ ఫకీర్ మహమ్మద్, కొట్టే సంజీవ్, అమరగాని సాయి, నెరవట్ల రమేష్, మానుమండ్ల వేణు, ఎండీ దస్తగిరి, నెరువట్ల ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లైన్ కాలనీ:
8వ కాలనీలోని భవానీ గార్డెన్ లో మంగళవారం మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండేటి రాజేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే అక్బర్ అలీ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం 10వ తరగతిలో, ఇంటర్‌లో మెరిట్ సాధించిన ఉత్తమ విద్యార్థులకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రేశవేని కేశవులు, మహిళా అధ్యక్షురాలు బండారి సునీత సాంబయ్య, యాదగిరి తిరుపతి, దేవనపల్లి చక్రపాణి, మెతుకు అవినాశ్, లక్ష్మణ్ రావ్, మార్కండేయ, రజియా బేగం, మెరుగు రాజేశం పాల్గొన్నారు.

గోదావరిఖని క్రైం:
కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. అనంతరం కమాన్‌పూర్ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో చత్రపతి శివాజీ యువసేన వారు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రంగు సత్యనారాయణ గౌడ్, భూంపెల్లి రాజయ్య, ఆకుల ఓదేలు, కటకం నారాయణ, తొగరి అశోక్, అన్నపూర్ణ, శేవ్వ శంకరయ్య, లింగాల కుమార్, కొంతం శ్రీనివాస్ సయ్యద్ ఈక్బాల్, శ్రీమూర్తి, అబ్దుల్ రఫీక్ తదితరులు ఉన్నారు.

గోదావరిఖని:
పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు సూర సమ్మయ్య అధ్యక్షతన టోల్ గేట్ ఆవరణలో మంగళవారం ఈ వేడుకలను చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తలారి శంకర్, కేశోరామ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య యాదవ్, కన్నాల గ్రామ శాఖ అధ్యక్షుడు బూతుగడ్డల రమేష్, ఉప సర్పంచ్ రెడపక వసంత మల్లేశం, బన్లు నాయక్ తండ మాజీ ఉపసర్పంచ్ జ్యోతి శంకర్ తదితరులున్నారు.

గోదావరిఖని జనక్ భవన్‌లో...
గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఐఎన్‌టియుసి ఆర్జీ 1 బ్రాంచ్ ఉపాధ్యక్షులు సదానందం ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి జనక్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీపతి గౌడ్, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇంఛార్జి వికాస్ కుమార్ యాదవ్ తదితరులున్నారు.

ముత్తారం:
మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు.
అనంతరం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల ఆందోళన

ప్రధాన రహదారిపై ధర్నా, నిలిచిపోయిన ట్రాఫిక్


రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

నవతెలంగాణ- మంథని: ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంథని-పెద్దపల్లి రహదారిపై రైతులు ఆందోళన నిర్వహించి ధర్నా చేపట్టారు. సుమారు 20 రోజులు కావస్తున్నా మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు జరగడం లేదని, సక్రమంగా కాంటాలు పెట్టడం లేదని రైతులు ఆరోపించారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయక రైతులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ఆలస్యం కావడంతోనే నష్టపోతున్నామని వాపోయారు. మార్కెట్ యార్డు, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పూర్తి అయ్యే దాకా ధర్నా విరమించలేదని బీష్మించుకొని కూర్చున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు రైతులను శాంతింప చేసే ప్రయత్నం చేయగా రైతులు మంథని తహసీల్దార్ బండి ప్రకాష్, ఎస్ఐ వెంకటేశ్వర్‌తో వాగ్వాదానికి దిగారు. తహశీల్దార్ సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలను వివరించారు. తడిసిన బస్తాలను తీసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు. రైతులు చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాలో వివిధ గ్రామాల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మే 31న సదరం స్లాట్ బుకింగ్

ఆర్డీవో వి.శ్రీధర్

నవతెలంగాణ-పెద్దపల్లి, రామగిరి: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం మే 31న బుధవారం ఉదయం 11-35 గంటల నుండి మీ-సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి. శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికేట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికేట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, శారీరక వైకల్యం ఉన్నవారు జూన్ 1, 15 తేదీల్లో నిర్వహించే క్యాంప్ స్లాట్‌ల కోసం, దృష్టి లోపం ఉన్నవారు జూన్ 8 నాటి స్లాట్‌కు, మానసిక అంగ వైకల్యం, బుద్ధి మాద్యం ఉన్న వారు జూన్ 14వ తేదీ స్లాట్‌కు, వినికిడి లోపం ఉన్న వారు జూన్ 22 నాటి స్లాట్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారులు దివ్యాంగుల రసీదుతో పాటు వికలాంగత్వ పరీక్షా కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్‌ను తీసుకొని రావాలని పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

పెద్దపల్లి కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ

దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై అధికారులతో రివ్యూ మీటింగ్

నవతెలంగాణ-పెద్దపల్లి: ప్రణాళిక ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతి రోజూ నిర్వహించే కార్యక్రమాలను ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎటువంటి లోటు పాట్లు లేకుండా, ప్రశాంతంగా కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం కనబర్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రతి కార్యక్రమాన్ని తప్పనిసరిగా ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీ రికార్డు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, పీవో చంద్రమౌళి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీవోలు, ఏవోలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో



నవతెలంగాణ- సుల్తానాబాద్: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యంలో తరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రాజీవ్ రహదా రిపై బైఠాయించి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ రమణ రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలులొ జాప్యం జరుగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనో హర్ రెడ్డి రైతులను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపిం చారు. ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేసేంత వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. పోలీసులు దాసరి మనోహర్ రెడ్డికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సుల్తానాబాద్ మండల అధ్యక్షులు చిలుక సతీష్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని రైతులపై దాడిగా పరిగణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంతటి అన్నయ్య గౌడ్, మినుపా ల ప్రకాష్ రావు, గోపాగాని సారయ్య గౌడ్, దన్నాయక్ దామోదర్ రావు, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, సమ రాజేశ్వర్ రెడ్డి, సాయిరి మహేందర్, ఆర్షణ పల్లి వెంకటేశ్వర్ రావు, దుగ్యాల సంతోష్ రావు, ఎండీ రఫిక్, దున్నపోతుల రాజ య్య, చింతల రాజు, భూతగడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన


వంతెనకు శంకుస్థాపన చేస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-రామగిరి:
అడ్రియాల లాంగ్ వాల్ గనికి మంచి భవిష్యత్తు ఉందని, సింగరేణి యాజమాన్యం సంక్షేమానికి ఎప్పుడూ వెనుకాడదని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అడ్రియాల గనికి వెళ్లే దారిలో గల బొక్కల వాగుపై సుమారు రూ.6 కోట్ల 75 లక్షలతో,100 మీటర్ల పొడవుతో నూతనంగా నిర్మిస్తున్న వంతెన కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ఇప్పుడు ఉన్న స్టీల్ వంతెన నీటితో మునిగిపోవడంతో ఉద్యోగులకు ఇబ్బందిగా ఉందని, అందుకు గాను ఈ నూతన వంతెనను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టు నిర్దేశించిన సమయానికి ఈ వంతెన పూర్తి చేయాలని అన్నారు. గనికి నిర్దేశించిన లక్ష్యాలను అందరం కలిసికట్టుగా పని చేసి రక్షణతో సాధించుకోవాలని పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ, వంతెన నిర్మించడానికి అనుమతులను ఇచ్చిన ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ పొందనున్న ఆర్జీ3 జీఎం టి.వి.రావును డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, జీఎం ఏపీఏ కె.వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి తో పాటు ఇతర అధికారులు, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఏ జీఎం కె. వెంకటేశ్వర్లు, ఆర్జీ3 జీఎం టి.వి. రావు, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు టి.నాగేశ్వర రావు, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య, ఏరియా ఇంజనీర్ సీతారామం, ఎస్‌ఓటూ జీఎంలు డి.బైద్య, జి.రఘుపతి, ప్రాజెక్ట్ అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

నవతెలంగాణ-ముత్తారం:
మండలంలోని ఓడేడు గ్రామం బీసీ కాలనీలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి కోరారు. బీసీ కాలనీలో గత ఐదు నెలల నుంచి విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుంటే అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని, కాలనీలో బిల్లులు మాత్రం వసూలు చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు వస్తే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.
బీసీ కాలనీలో అదనంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కాలనీవాసులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని మంథని డీఈని కోరినట్లు తెలిపారు.

పెద్దాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం


మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని మంగళవారం పెద్దాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో తహసీల్దార్ జయశ్రీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారికి ప్రభుత్వం పలు సదుపాయాలు అందిస్తుందని, సబ్సిడీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 60 శాతం మహిళలకు రుణాలు అందిస్తుందని తెలిపారు. వాటి ద్వారా మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని సూచించారు. ఉన్నత విద్యను అందించే ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్సీ కులస్తులను దేవాలయాలకు రానివ్వకపోవడం లాంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. వారి వెంట ఆర్ఐ సదయ్య, వీఆర్ఏ మల్లేశం, గ్రామ ప్రజలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి కేసీఆర్ మెడలు వంచుతాం

మాజీ ఎమ్మెల్యే గుజ్జుల ధ్వజం

కలెక్టరేట్ ను ముట్టడించిన బీజేపీ శ్రేణులు



నవతెలంగాణ- పెద్దపల్లి టౌన్: వర్షాలు ప్రారంభమై ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా కొనుగోలు సెంటర్లలో నిల్వ చేసిన ధాన్యాన్ని ఇప్పటికీ పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకుండా రైతుల ఉసురు పోసుకుంటున్న సీఎం కేసీఆర్‌ను వదిలిపెట్టబోమని బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణా రెడ్డి ధ్వజమెత్తారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా పేరుతో మంగళవారం పెద్దపల్లి కలెక్టరేట్‌ను రైతులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణా రెడ్డి మాట్లాడుతూ, రైతులకు మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించినప్పటికీ, వాటిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. అంతకు ముందు వరి ధాన్యాన్ని కలెక్టరేటు ప్రధాన ద్వారం వద్ద పారబోసి రైతులు నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్య, మీసా అర్జున్ రావు, కౌశిక్ హరి, బల్మూరి అమరేందర్ రావు, బల్మూరి వనిత, కౌశిక లత, కన్నం అంజయ్య, పిన్నింటి రాజు, ఆది కేశవులు, పర్శ సమ్మయ్య, పల్లె సదానందం, పుట్ట రవి, మౌరం నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ ఓదెల: మండలంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై అధికారులు సర్పంచులకు, కార్యదర్శులకు, ఇతర శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలకు ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని, ఇతర శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జగన్మోహన్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి సత్తయ్య, వ్యవసాయ అధికారి శ్రీనాథ్, ఎస్సారెస్పీ డీఈ భాస్కర్, మండల పంచాయతీ అధికారి వాజిద్, సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన మక్కలు

ఆందోళన చెందుతున్న రైతులు



నవతెలంగాణ-ఓదెల: ఓదెల మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసి ముద్దవడంతో పాటు.. ఆరబోసిన మక్కలు వర్షానికి కొట్టుకుపోయాయి. ఒక వైపు రోహిణి కార్తె ప్రారంభమై వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న సమయానికి ప్రభుత్వం ధాన్యం కొ నుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

విరాళం అందజేత

నవతెలంగాణ-మంథని: మండలంలోని ధర్మారం గ్రామంలో గ్రామ ప్రజలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చిరుతల రామాయణ కళా బృందానికి సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణ రెడ్డి రూ.10వేల విరాళాన్ని అందజేశారు. గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నారాయణ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కొమురయ్య

నవతెలంగాణ- ఓదెల: మండలంలోని బాయమ్మపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ తెలుసూరి కొమురయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటి పరీక్ష చేయించుకున్న వారికి వారి సమస్యను బట్టి అద్దాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన గొప్ప అవకాశమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం


క్రాంతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నవతెలంగాణ-మంథని: మంథని మున్సిపాలిటీ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు పోతరవేని క్రాంతిని మంగళవారం మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు. తదనంతరం మత్స్య శాఖ అభివృద్ధిలో మంథని ప్రాంతానికి సంబంధించి ఎటువంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, ముదిరాజుల అభివృద్ధి కోసం, ఐక్యత కోసం పాటు పడే యువ నాయకులు ఇంకా ముందుకు వచ్చి ఐక్యతను చాటాలని సూచించారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మంథనిలో ఉన్న ముదిరాజ్ సోదరుల ఐక్యతను చాటి చెప్పిందన్నారు. క్రాంతి వెంట స్థానిక నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

అధికారుల సమీక్ష సమావేశం

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పాఠశాలల ప్రిన్సిపల్స్, నృత్య కళాకారులచే అధికారులు జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం రాంమోహన్, పర్సనల్ డీజీఎం లక్ష్మినారాయణ, డీజీఎం క్వాలిటీ శ్రీధర్, సీనియరన్ పర్సనల్ ఆఫీసర్ బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, కో ఆర్డినేటర్‌లు మేడి తిరుపతి, నగునూరి రవికుమార్, డ్యాన్స్ మాస్టర్స్ సందీప్, విజయ్, దేవా తదితరులున్నారు.

ఐపీఎల్ వేదికల్లో అభిమానుల నీరాజనం. బెంగళూర్, అహ్మదాబాద్, ముంబయి, కోల్‌కత, లక్నో, ఢిల్లీ సహా ఎక్కడికెళ్లినా మైదానంలో పసుపు జెర్సీలే దర్శనమిచ్చాయి. ఆతిథ్య జట్టు విజయం కంటే చెన్నై సూపర్‌కింగ్స్ గెలుపు కోసం అభిమానులు తపించారు. అందుకు ఒకే ఒక్క కారణం.. ఇంద్రజాలకుడు ఎం.ఎస్ ధోని. మరో నెల రోజుల్లో 42వ వసంతంలోకి అడుగుపెట్టనున్న ధోని..అభిమానుల కోసం మరో సీజన్‌లో అలరించేందుకు సిద్ధమని ప్రకటించాడు. ఐపీఎల్ 17లో మహి మాయ అభిమానుల కోసం మిగిలే ఉంది!!.



మరో సీజన్ ఆడతా!

- అభిమానులకు ఇదే నా బహుమతి
- సూపర్‌కింగ్స్ సారథి ఎం.ఎస్ ధోని

నవతెలంగాణ-అహ్మదాబాద్

మిస్టర్ కూల్ అభిమానులకు తీయటి కబురు. ఎం.ఎస్ ధోని ఐపీఎల్ 17లోనూ అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు రికార్డు ఐదో ఐపీఎల్ టైటిల్ అందించిన మహి.. మూడు రోజుల పాటు సాగిన (టెక్నికల్‌గా) ఐపీఎల్16 ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ టైటిల్ విజయంతో క్రికెట్‌కు గుడ్‌బై చెబుతాడని అందరూ అంచనా వేయగా.. ధోని మాత్రం అభిమానులకు గిఫ్ట్ ప్రకటించాడు. తనపై చూపించిన ప్రేమాభిమానులకు బహుమతిగా వచ్చే ఐపీఎల్ సీజన్‌లోనూ ఆడేందుకు సిద్ధమని తెలిపాడు. ఐపీఎల్ ఫైనల్స్ అనంతరం ప్రసారదారు వ్యాఖ్యాత హర్ష భోగ్లేతో మాట్లాడిన ఎం.ఎస్ ధోని పలు విషయాలపై స్పందించాడు. ఈ విషయాలు ఇవిగో..


ఐపీఎల్ 16 టైటిల్‌తో చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్ల కేరింతలు

ఉత్తమ సమయమే..!

'పరిస్థితుల పరంగా చూసినప్పుడు రిటైర్మెంట్‌కు ఇదే ఉత్తమ సమయం. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఎక్కడికి వెళ్లినా అభిమానులు నాపై అపారమైన ప్రేమ, అభిమానం చూపించారు. ఇంత గొప్ప అనుభూతి ఆస్వాదించిన అనంతరం.. 'అందరికీ ధన్యవాదాలు' అని ఓ మాట చెప్పి ముగించవచ్చు. కానీ ఇందులో కఠిన పని ఏంటంటే.. మరో తొమ్మిది నెలల పాటు కష్టపడి వచ్చే సీజన్‌కు సిద్ధమవటం. అభిమానులకు ఇదే నా బహుమతి. ఈ వయసులో ఇది నాకు ఏమంత సాధారణ విషయం కాదు. అభిమానులు నాపై ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపించారు. అభిమానుల కోసం నేనూ చేయాల్సింది ఉంది' అని ధోని అన్నాడు.

భావోద్వేగం సహజం

'భావోద్వేగానికి లోనవుతాను. అందుకు గల కారణం ఒక్కటే.. ఇది నా కెరీర్‌లో చివరి అంకం. ఐపీఎల్ 2023లో తొలి మ్యాచ్ ఆడేందుకు అహ్మదాబాద్ వచ్చినప్పుడు.. నిండుకుండను తలపించిన స్టేడియం నా పేరుతో మార్మోగినప్పుడు కండ్లలో నీళ్లు తిరిగాయి. డగౌట్‌లో కాసేపు కూర్చున్నాను. కాస్త సమయం తర్వాత ఇది ఒత్తిడికి లోనయ్యే సన్నివేశం కాదు.. విజయాన్ని ఆస్వాదించే సమయమని గ్రహించాను. చెపాక్‌లో చివరి లీగ్ మ్యాచ్ ఆడినప్పుడు చెన్నైలోనూ ఇదే జరిగింది. చెపాక్‌లో మళ్లీ ఆడనుండటం గొప్ప భావన కలిగిస్తుందని' ధోని తెలిపాడు.

అలా చేయలేను

'అభిమానులు ఇంతలా అభిమానించడానికి నేను నాలాగా ఉండటమే కారణమని భావిస్తాను. ఏ సమయంలోనైనా ఒదిగి ఉంటాననే అభిమానులు ఇష్టపడుతున్నారు. నేను మైదానంలో ఆడే క్రికెట్ సైతం అందుకు ఓ కారణం. నేను ఆడే షాట్లను అభిమానులు సైతం ఆడగలమని అనుకుంటారు. ఎందుకంటే, నేను సంప్రదాయ క్రికెట్ షాట్లను ఆడను. అభిమానులు తమను నాలో చూసుకుంటున్నారని అనుకుంటున్నాను. ఇదే సమయంలో నేను ఎన్నడూ నా శైలి మార్చుకోవాలని అనుకోను, నేను కాని పాత్ర, స్వభావంలో నన్ను చూపించాలనుకోలేదు. అంతా సింపుల్‌గా ఉంచాను' అని మహి అన్నాడు.

కోపం వస్తుంది!

'కోపం నాకు కూడా వస్తుంది. నేనూ మానవ మాత్రుడనే. కానీ నేను పొరపాటు జరిగినప్పుడు ఏం జరిగిందనే విషయాన్ని.. అవతలి వ్యక్తి కోణంలో నుంచి చూస్తాను. ఒత్తిడిని ఒక్కొక్కరు ఒకలా మేనేజ్ చేస్తారు. మనం ఆటగాళ్లకు మద్దతు నిలిచి ప్రోత్సహిస్తే మనం ఉన్నప్పుడూ రాణిస్తారు. మనం లేకపోయినా.. అదే స్థాయిలో మెప్పిస్తారు. అజింక్య రహానె అనుభవజ్ఞుడు. జట్టులో ఇంకొందరు సైతం అనుభవం కలిగి ఉన్నారు. వారి గురించి ఆందోళన చెందను, బాధ్యత తీసుకోవాలని వారికి చెబుతాను. ఏమైనా సందేహం ఉంటే.. నా వద్దకు రావాలని చెబుతాను. ఓవరాల్‌గా ఫైనల్లో అందరూ బాధ్యత తీసుకున్నారని' ఎంఎస్‌డి చెప్పాడు.

రాయుడుతో ఆ అవార్డు రాదు!

'అంబటి రాయుడు జట్టులో ఉండగా నేను ఫెయిర్‌ప్లే అవార్డు సాధించలేను. ఎందుకంటే అతడు దేనికైనా వేగంగా స్పందిస్తాడు. (నవ్వుతూ. ఈ సమయంలో రాయుడు సైతం నవ్వుతూ కనిపించాడు). కానీ రాయుడు మైదానంలోకి అడుగుపెడితే 100 శాతం ప్రదర్శన చేస్తాడు. అతడు జట్టు ఆటగాడు.. భారత్-ఏకు ఆడిన రోజుల నుంచి రాయుడు అద్భుతమైన క్రికెటర్. స్పిన్, పేస్ సమర్థవంతంగా ఆడే క్రికెటర్లలో రాయుడు ఒకడు. ఫైనల్ మ్యాచ్‌లో రాయుడు ప్రత్యేక ప్రదర్శన చేస్తాడని అనుకున్నాను. రాయుడి పట్ల ఎంతో సంతోషంగా ఉంది. ఈ మ్యాచ్‌ను అతడు కొన్నాండ్ల పాటు గుర్తుంచుకుంటాడు. రాయుడు కూడా నాలాగే ఎక్కువగా ఫోన్ వాడడు. రాయుడు జీవితంలో తర్వాతి అంకాన్ని సైతం ఆస్వాదించాలని కోరుకుంటున్నాను' అని ధోని అన్నాడు.

క్రికెట్ వృద్ధికి అడ్డంకి!

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) నూతన ఆదాయ పంపిణీ విధానంపై అసోసియేట్ సభ్య దేశాలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశాయి. 2024-27 కాలంలో ఐసీసీ ఆదాయంలో బీసీసీఐ 38.5 శాతం అందుకోనుందని సమాచారం. పూర్తి సభ్య దేశాలు (12) ఆదాయంలో 88.81 శాతం పంచుకోనుండగా.. 94 అసోసియేట్ సభ్య దేశాల క్రికెట్ బోర్డులు మిగిలిన ఆదాయాన్ని పొందనున్నాయి. క్రికెట్ సూపర్‌పవర్ దేశాలకే ఐసీసీ ఆదాయంలో అధిక భాగం దక్కితే.. అసోసియేట్ సభ్య దేశాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఇప్పటికే ఈ విధానంపై వ్యతిరేకత వ్యక్తం చేయగా.. అసోసియేట్ సభ్య దేశాలు పిసిబి వాదనకు స్వరం పలుకుతున్నాయి. భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలకు మాత్రమే అధిక ఆదాయం దక్కుతుండగా.. మిగతా దేశాలు నామమాత్రపు నిధులు పొందనున్నాయి. జులైలో జరుగనున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నూతన ఆదాయ పంపిణీ విధానంపై ఓటింగ్ జరుగనుంది.




వెల్లివిరిసిన క్రీడోత్సాహం

- ఉత్సాహంగా సిఎం కప్ పోటీలు
- ఆరు వేదికల్లో శాట్స్ చైర్మెన్ పర్యవేక్షణ



నవతెలంగాణ-హైదరాబాద్

సిఎం కప్ 2023 పోటీలతో క్రీడోత్సాహం వెల్లివిరిసింది. 18 క్రీడాంశాల్లో 33 జిల్లాలు తలపడుతున్న తెలంగాణ క్రీడా సంగ్రామంలో గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, బాక్సింగ్, ఆర్చరీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, టెన్నిస్, రెజ్లింగ్, షూటింగ్ క్రీడాంశాల్లో పోటీలు తుది దశకు చేరుకోవటంతో పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. అథ్లెటిక్స్, ఆర్చరీ, షూటింగ్ క్రీడాంశాల్లో మంగళవారం కొన్ని విభాగాల్లో తుది పోటీలు జరిగాయి. పతక పోటీలకు హాజరైన శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విజేతలను అభినందించి, ప్రశంస పత్రాలు అందజేశారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లోనూ మంగళవారమే పతక పోటీలు నిర్వహించారు.

నేడు చివరి రోజు : సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు నేటితో ముగియనున్నాయి. ఆదివారం మొదలైన సిఎం కప్ పోటీలకు బుధవారం చివరి రోజు. ఎల్బీ స్టేడియం, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, జింఖాన, సరూర్ నగర్, హెచ్‌సీయూ షూటింగ్ రేంజ్ వేదికల్లో నేడు ముగింపు వేడుకలు జరుగనున్నాయి. ముగింపు వేడుకలకు మంత్రులు సబిత ఇంద్రారెడ్డి (గచ్చిబౌలి), శ్రీనివాస్ యాదవ్(ఎల్బీ స్టేడియం), డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ (జింఖాన గ్రౌండ్స్), మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి (సరూర్ నగర్) ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ మేరకు ఆరు వేదికల్లో ముగింపు వేడుకల ఏర్పాట్లు, తుది అంకం పోటీలను శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ పర్యవేక్షించారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ వివాదం

- హెచ్‌ఏఐ ప్రధాన కార్యదర్శిగా జగన్
- ఒలింపిక్ సంఘం నుంచి గుర్తింపు



హైదరాబాద్ : జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్యపై సుదీర్ఘంగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. వ్యక్తుల స్వార్థపూరిత ఆలోచనకు ఆట, క్రీడాకారులకు అన్యాయం జరుగకూడదనే బృహత్తర ఉద్దేశ్యంతో భారత హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ (హెచ్ఎఫ్ఐ), భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) చేతులు కలిపాయి. అంతర్జాతీయ, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యల గుర్తింపు పొందిన హెచ్ఐఏ అధ్యక్షుడిగా దిగ్విజయ్ చౌతాల, ప్రధాన కార్యదర్శిగా తెలుగు వ్యక్తి అర్శినపల్లి జగన్‌మోహన్ రావు ఎన్నికయ్యారు. రెండు హ్యాండ్‌బాల్ సంఘాలు ఏకతాటిపైకి రావటాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓసీ) అధ్యక్షురాలు పి.టి ఉష, సీఈవో కళ్యాణ్ చౌబే స్వాగతించారు. హ్యాండ్‌బాల్ అభివృద్ధి అజెండాతో రాజీ కుదుర్చుకున్న జగన్, దిగ్విజన్‌లను అభినందించారు. దేశంలో హ్యాండ్‌బాల్ అభివృద్ధి కోసం పని చేసేందుకు ముందుకు సాగుదామని తెలిపారు. ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఈ ఏడాది జాతీయ క్రీడల్లోనూ హ్యాండ్‌బాల్‌ను చేర్చనున్నట్టు హెచ్‌ఏఐ నూతన ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్ రావు తెలిపారు. జూన్‌లో ఆరంభం కానున్న ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) షెడ్యూల్ ప్రకారమే సాగుతుందని, ఈ లీగ్‌తో దేశంలో హ్యాండ్‌బాల్‌కు ఆదరణ రెట్టింపు కానుందని జగన్ ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్‌ఏఐ అనుబంధ రాష్ట్ర సంఘాలకు మాత్రమే అధికారిక గుర్తింపు కొనసాగుతుందని, భారత ఒలింపిక్ సంఘం సహకారంతో రానున్న రోజుల్లో హ్యాండ్‌బాల్‌కు మరింత జోష్ రానుందని అన్నారు.

శక్తివంతమైన భావోద్వేగాలతో అహింస : వెంకటేష్

తేజ దర్శకత్వంలో అభిరామ్ హీరోగా అరంగేట్రం చేస్తున్న యూత్‌ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అహింస'. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై పి కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గీతికా తివారీ కథానాయిక. జూన్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ, 'యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్స్‌తో దర్శకుడు తేజ చాలా గొప్ప విజయాలు అందుకున్నారు. 'అహింస' కూడా అన్ని ఎమోషన్స్ ఉన్న యూత్ ఫుల్ ఎంటర్ టైనర్. కొత్త నటీనటులు నుంచి పవర్ ఫుల్ ఎమోషన్స్ క్యాప్చర్ చేశారు తేజ. ఎవరూ చూడని అద్భుతమైన లోకేషన్స్‌లో తీసిన సినిమా ఇది. ఆర్పీ పట్నాయక్ వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. నిర్మాతగా కిరణ్ చిత్రానికి కావాల్సింది సమకూర్చారు. అభిరాం, గీతిక సినిమా ద్వారా పరిచయం అవుతున్నారు' అని అన్నారు. 'వెంకటేష్ రావడం వలన సినిమాకి వాల్యూ పెరిగింది. కొన్ని వందల మందికి అవకాశాలు ఇచ్చిన రామానాయుడు గారి కోరిక మీద ఈ సినిమా తీశాను. అభితో సినిమా చేయడానికి ఆయనే ప్రధాన కారణం. రామానాయుడు గారి ఆశీర్వాదంతో ఈ సినిమా బాగా ఆడుతుందని నమ్ముతున్నాను' అని దర్శకుడు తేజ చెప్పారు. హీరో అభిరామ్ మాట్లాడుతూ, 'ఇంత మంచి సినిమా ఇచ్చిన తేజకి, అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన ఆర్పీకి, నిర్మాత కిరణ్‌కి కృతజ్ఞతలు. ఈ సినిమా నాకు మంచి హిట్ అవుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. నిర్మాత పి కిరణ్ మాట్లాడుతూ, 'అహింసలో యాక్షన్ ఎంటర్‌టైన్మెంట్, లవ్ ..అన్నీ ఉన్నాయి. సినిమా ఖచ్చితంగా హిట్ అవుతుంది' అని తెలిపారు.


తేజ, వెంకటేష్, అభిరామ్, గీతికా తివారీ


నవ్వుతూనే ఉంటారు..


తిరువీర్ హీరోగా రూపక్ రొనాల్డ్సన్ దర్శకత్వం వహించిన చిత్రం 'పరేషాన్'. వాల్తేరు ప్రొడక్షన్స్ బ్యానర్ పై సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి హీరో రానా దగ్గుబాటి సమర్పణ. జూన్ 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో హీరో తిరువీర్ మీడియాతో మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు విలక్షణమైన పాత్రలు చేశాను. తొలిసారి హాస్య ప్రధానమైన జోనర్‌ని ఎంచుకున్నాను. దర్శకుడు రూపక్ తను చూసిన జీవితం, ఊరు, స్నేహం, అక్కడి ప్రజల పాత్రలని తీసుకుని ఒక ఇమాజినరీ వరల్డ్‌ని క్రియేట్ చేశాడు. కథ, పాత్రలు, లొకేషన్స్ .. అన్నీ చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. ఈ కథ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే సింగరేణి పోరగాళ్ళ కథ. మంచిర్యాల ఊరుని ఒక బయోపిక్‌లా తీస్తే అదే ఈ కథ. ఇందులో చాలా నేచురల్ కామెడీ ఉంటుంది. అవుట్ అండ్ అవుట్ కామెడీ డ్రామా. ఇందులో ప్రతి పాత్రకు ఏదో పరేషాన్ ఉంటుంది. అందుకే ఈ చిత్రానికి 'పరేషాన్'అని పేరు పెట్టాం. రానా ఈ సినిమా చూసిన తర్వాత.. డైరెక్టర్, నిర్మాతతో 'నేను మీకు ఏం చేయగలుగుతాను. సినిమాని జనాల్లోకి తీసుకువెళ్ళడానికి ఏం చేద్దాం' అని మాత్రమే అన్నారు. సినిమా చూస్తున్నంత సేపు ఆయన నవ్వుతూనే ఉన్నారు' అని అన్నారు.


తిరువీర్

దేశభక్తిని చాటే భారతీయన్స్

నీరోజ్ పుచ్చా, సోనమ్ టెండప్, సుభా రంజన్ హీరోలుగా, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్ నాంగ్యాల్ హీరోయిన్లుగా నటించిన బహుభాషా చిత్రం 'భారతీయన్స్'. భారత్ అమెరికన్ క్రియేషన్స్ పతాకంపై ప్రవాస భారతీయుడు డాక్టర్ శంకర్ నాయుడు అడుసుమిల్లి నిర్మించారు. రచయిత దీన్ రాజ్ ఈ దేశభక్తి చిత్రంతో దర్శకుడిగా పరిచయమవు తున్నారు. ఈ చిత్రాన్ని మాజీ సైనికాధికారుల కోసం ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. చైనా నీచ బుద్ధిని ఎండగడుతూ రూపొందిన ఈ చిత్రం సంచలన విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. నిర్మాత డాక్టర్ శంకర్ నాయుడు మాట్లాడుతూ, 'మన సైనికుల ప్రాణాలు బలి తీసుకుంటూ, మన దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే నీచ చర్యలకు పాల్పుతున్న చైనా పేరును తొలగించమని సెన్సార్ సభ్యులు చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఈ విషయంలో ఎంత దూరం వెళ్ళడానికయినా సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. 'త్రివిధ దళాల్లో పనిచేసిన మన దేశ ముద్దుబిడ్డలైన సైనికాధికారులు మా చిత్రాన్ని చూసి మెచ్చుకోవడం ఎంతో గర్వంగా ఉంది' అని దర్శకుడు దీన్ రాజ్ చెప్పారు.


దీన్‌రాజ్, డా॥శంకర్ నాయుడు


చిరంజీవి

భోళా మానియా షురూ..

చిరంజీవి, మెహర్ రమేష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తొలుత మ్యూజికల్ జర్నీ 'భోళా మానియా' త్వరలో ప్రారంభమవుతుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. మహతి స్వర సాగర్ ఈ చిత్రానికి చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ని స్కోర్ చేసారు.

కొంత టాకీ పార్ట్, క్లైమాక్స్ షూటింగ్, భారీ సెట్ సాంగ్ ఇంకా చిత్రీకరించాల్సి ఉంది. షూటింగ్‌తోపాటు పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోంది. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో తమన్నా కథానాయికగా నటిస్తుండగా, చిరంజీవి సిస్టర్‌గా కీర్తి సురేష్ కనిపించనుంది. సుశాంత్ లవర్ బాయ్ పాత్ర పోషించారు. ఈ చిత్రం ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

మెప్పించే చక్రవ్యూహం

అజయ్ ప్రధాన పాత్రలో నటించిన మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ 'చక్రవ్యూహం' -ది ట్రాప్ అనేది ఉపశీర్షిక. చెట్కూరి మధుసూదన్ దర్శకుడు. సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రి నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ,' ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్‌లుక్, టీజర్, ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వస్తుంది. అలాగే సినిమాకి కూడా అని థియేటర్స్‌లో ఇదే విధంగా రెస్పాన్స్ వస్తుందనే ఆశాభావంతో ఉన్నాం. ట్రైలర్ విడుదల చేసిన హీరో సాయిధరమ్ తేజ్‌కి ధన్యవాదాలు. యూట్యూబ్‌లో మిలియన్ వ్యూస్‌తో ఈ చిత్ర ట్రైలర్ దూసుకెళ్తోంది. జూన్ 2న ప్రేక్షకులు థియేటర్స్‌లోనే సినిమా చూసి ఆదరించాలని కోరుతున్నాను' అని తెలిపారు. 'మధుసూధన్ సినిమాని తీసిన తీరు నాకెంతో నచ్చింది. స్క్రీన్ ప్లే, కథ పై తనకి మంచి కమాండ్ ఉంది. ఈ సినిమా అందరికి నచ్చుతుంది' అని అజయ్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా హక్కులను సొంతం చేసుకున్న మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూషన్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,'కథ వినగానే నచ్చి కొన్నాం. ఇప్పుడు డైరెక్టర్ తీసిన సినిమా చూశాక 100 శాతం సినిమా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కోరుకుంటున్న రీతిలోనే ఈ సినిమా ఉంది. అందర్నీ మెప్పిస్తుంది' అని చెప్పారు. ఈ వేడుకలో శశిధర్ రెడ్డి చేతులు మీదుగా చిత్ర యూనిట్ అంతా కలిసి బిగ్ టికెట్‌ని ఆవిష్కరించారు.


ఊర్వశి, అజయ్, మధుసూదన్

నవచిత్రం

భిన్న కాంబినేషన్‌లో కొత్త సినిమా

టాలీవుడ్‌లో ప్రస్తుతం ఓ క్రేజీ కాంబినేషన్‌లో నయా సినిమాని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ కొత్త సినిమా చేస్తున్నారు. మిర్యాల సత్యనారాయణరెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను జూన్2న మేకర్స్ రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రక్తం మరకలతో ఉన్న చేయి.. సినిమా కథపై అందరిలోనూ ఆసక్తిని క్రియేట్ చేసింది. అంతేకాకుండా 'అఖండ' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్‌ని అందించిన బ్యానర్ నుంచి ఈ సినిమా వస్తుండటంతో సర్వత్రా భారీ అంచనాలూ ఏర్పడ్డాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుందనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పోస్టర్ తీరు చూస్తుంటే దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల న్యూ ఏజ్ సినిమాతో రాబోతున్నారని అర్థమవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే చిత్ర బృందం తెలియజేయనుంది.


శ్రీకాంత్ అడ్డాల, మిర్యాల రవీందర్‌రెడ్డి

వైభవంగా ఎన్టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డ్స్ వేడుక

ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంయుక్తంగా నిర్వహించిన ఎన్‌టీఆర్ లెజెండరీ నేషనల్ అవార్డ్స్ వేడుక ఎల్ వీ ప్రసాద్ ఆడిటోరియంలో అంగరంగ వైభవంగా జరిగింది. 8 రాష్ట్రాలకు చెందిన సినీ, సామాజిక ప్రముఖులకు అందించిన ఈ పురస్కార వేడుకకు మురళీ మోహన్, కోట శ్రీనివాసరావు, బాబుమోహన్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో చైర్మన్ ప్రభాకరరావు, ఎఫ్‌డిసిచైర్మన్ అనిల్ కూర్మాచలం, బసిరెడ్డి, దామోదర్ ప్రసాద్, కాశీ విశ్వనాథ్, ఎన్టీఆర్ మనవడు నందమూరి యశ్వంత్, గౌతమ్ రాజు తదితరులు విచ్చేసి గ్రహీతలకు అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా, అవార్డు గ్రహీతగా విచ్చేసిన మురళీ మోహన్ మాట్లాడుతూ,' జాతీయ స్థాయిలో ఇంతమందిని ఒక వేడుకలో భాగస్వామ్యం చేయడం ఎంతో కష్టసాధ్యం. అయినప్పటికీ యుగపురుషుడు ఎన్టీఆర్‌పై అభిమానంతో ఈ సంస్థలు ఈ కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించడం విశేషం' అని అన్నారు. రెండున్నర గంటల సమయంలో 101 మందికి అవార్డులను అందజేసిన ఈ వేడుక.. వరల్డ్ బుక్ అఫ్ రికార్డులో చోటు సంపాదించింది. ఈ ఘనత సాధించిన ఎఫ్ టీ పీ సి సంస్థ అధ్యక్షులు చైతన్య జంగా - కార్యదర్శి వీస్ వర్మ పాకలపాటి లకు వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్ లండన్ సి ఈ ఓ రాజీవ్ శ్రీవాత్సవ్ సర్టిఫికెట్ ని ప్రదానం చేశారు.


సురేష్‌కృష్ణ, మురళీమోహన్

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.